

# హిందూ యువజన సంఘ భవనము.

## వామ పార్శ్వ దృశ్యము.



( Left Side View )

## హిందూయువజనసంఘ భవనము - దక్షిణపార్శ్వ దృశ్యము.




( Right Side View )

3 RSVM01A155



పరబ్రహ్మాత్మికాం దేవీం భుక్తిముక్తిఫలప్రదాం,
ప్రణమ్య స్తౌమి తామేవ జ్ఞానశక్తిం సరస్వతీమ్.

సంపుటము ౧౦ సంచిక ౧

# గ్రంథాలయసర్వస్వము

ధాత చైత్రము ఏప్రిల్ 1936

## ఉగాది మ్రొక్కులు

(శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు)

మామిడి చూలు మోయ,
నవమల్లిక పుష్పిణిగాఁ,
పయోధరశ్యామలగాఁగ ధాత్రి,
లలితార్చనలఁ నవరాత్రులొప్ప,
ముక్తామిహారావళిఁ సరసి దాల్ప,
జరాచ్ఛదముల్ త్యజింప నారామవనస్పతుల్,
శుభపరంపరలఁ జనుమంచు
వత్సరస్వామికి, ధాతకుఁ తరుణదాతకు,
మ్రొక్కుఁ

ఉ
గా
ది
ప్రొద్దులఁ.

## అభినందనములు

(శ్రీ. కె. ఎస్. వేదాంతంగారు)

శ్రీయువాబ్దంబు గడవఁ దత్సింహపీఠిఁ
దా నధిష్ఠించె ధాతృవత్సరము నేఁడు,
ఈశుభోదయవేళ మీ కివిగో నాదు
నవ్యసంవత్సరాద్యభినందనములు.
ఆత్మజుని పేరి దమ ప్రేమ హరియు సిరియు
నోలి నారోగ్యభాగ్యంబు లొసఁగఁ, దనదు
పేరిదని ధాత యాయువు పెంప, మీకు
ధాతృవర్షంబు

సు
ఖ
ద
మై
తనరుగాత!

# సరస్వతీ స్తుతి

(విద్వాన్ కల్లూరి వెంకట సుబ్రహ్మణ్య దీక్షితులుగారు)

శ్రీవాణీ! యనిపిల్వ, లక్ష్మి తొలుతన్ శ్రీ శబ్దమాత్రార్థకం
బై వాణింట సిరుల్ ఘటింప; నది శోభార్థంబుగా నీవు వి
ద్యావైశద్యము గూర్తు, భారతి! విచిత్రం బిట్లు మీ మీ విరో
ధావేశంబుల కార్తరక్షణకళా వ్యాసక్తి నేకాగ్రతా
భావంబూన్చెడి విశ్వతోముఖము శబ్దబ్రహ్మ మర్చించెదన్.

ఉ. మెల్లనఁ జైత్రపాడ్యమి సమీరకిశోరుని జంకఁబెట్టి, యీ
చల్లని వేఁకువన్ గుసుమ సంతతులన్గయిసేసి, నీ ముఖో
త్ఫుల్ల సరోజగంధరసపూరము విందుల నారగింపఁగాఁ
దల్లిరో! వచ్చె నీ ప్రకృతి దానుగ నీ పదపద్మసేవకున్.

ఉ. కోయిల పంచమంబు శ్రుతిగూర్చె, వసంతుఁడు ప్రేమగీతికల్
హాయిగఁ బాడె, గ్రంథసదనాంతరలక్ష్ములు పేరఁటాండ్రుగా
నీ యడుగుల్భజింత్రు జననీ! పలుకుంజెలి! ముద్దుపల్కులం
దీయగ స్వాగతం బిడఁగదే శుభధాతకు ధాత కియ్యెడన్.

మ. కవులున్ గాయకులు న్గళావిదులు నీ కళ్యాణగాథాంకముల్
చవులీనన్ దమ భావవీణపయి భాషాతంత్రి మ్రోయింతు ర
త్సవ సన్నాహముగా సమస్తధరణీ సారస్వత శ్రీ యశో
భవనప్రాంగణసీమ భద్రనటనప్రారంభమున్ జూపవే.

మ. ప్రణయంబున్ బ్రణవంబు నైక్యగతి నుద్భాసించు నీ నాట్యకం
కణకాంచీమణికింకిణీక్వణనశిక్షన్ దర్థికావ్యంపు నై
పుణి వ్యాఖ్యానము సేయు టార్యమతమే మోయంచు గ్రంథాలయాం
గణసీమ న్దిరుగాడు ధాత యడుగో కల్యాణి! వీక్షింపవే!

గ్రామగ్రంథాలయములే భారతదేశౌన్నత్యమునకు
మూలాధారములు

# సంపాదకుని తొలిపలుకులు

## శ్రీ ధాత ఆశీస్సు

శ్రీ ధాతసంవత్సర మారంభమయినది. ధాత సృష్టిని సంకేతించును. సృష్టియనునది యేనాడో యే దేవుడో యేదయ్యమో చేసినదికాదు. నవనవ వికాసమునఅనుదినముజరుగునట్టి క్రియ. అందుననే ఈశ్వరుని స్వయంభూత్వసిద్ధి కలుగుచున్నది. తానే కర్త, తానే పోషకుడు, తానే హర్త అగుట అతనిగుణము. హర్తృత్వ కర్తృత్వములసంధి ప్రళయము. ఇదియు అనంతకాలముననిముసనిముసము కలయట్టి క్రియయే. సృష్టికి ఇది ఆది ఇది అంతము అనునది లేనియట్లులే ప్రళయమునకుఆద్యంతము లులేవు. ఈ రెంటి నడుమను చేరుకొనినది కావున స్థితికి అవి గలవు. మానవుడు ఈశ్వరాంశ సంభూతుడు, సృష్టికర్తయందలి కళ. అది మరచి, సౌలభ్యమునకు మరగి, స్థితియం దాస్థగొని ఆద్యంతములు స్వస్వరూపములనిభ్రమించి భయ విహ్వలమానసుడై ప్రళయమునకుజంకుచున్నాడు ధాత పేరు చెప్పిన వడవడ వడంకుచున్నాడు. తాను సర్వకాలసర్వావస్థలయందును సృష్టికర్త యనుటను మరువక, స్థితియందు దృష్టినిబంధింపక, నిరంతరపరిశ్రమ కావించినయెడల ప్రళయము తనస్వాధీన మనుటను గ్రహింపగలడు; తరింప గలడు. ధాతయొక్క సుందరవికాసవదనార విందమును ప్రత్యక్షము కావించుకొని యానం దింపగలడు.

కావుననో సోదరసోదరీమణులగు భారతసంతానములారా! ధాత యమంగళకరమని జంకవలదు. మంగళా మంగళములు మీ పరిశ్రమఫలములు. మీయీశ్వరాంశనుమీరు గురుతించి వికాసమున నుత్సాహమున నిరంతరోద్యోగు లగుదురేని మీరు అమంగళము నెప్పుడును ననుభవింపరు. సర్వమంగళసాన్నిధ్యమె మీ కెల్లకాల ముండ గలదు. కలది పోవునేమోయని బెంగలు పెట్టు కొనక ముందంజవేయుడు. నడుములు బిగింపుడు నవనవసృష్టికర్మయందు మగ్నులుగండు. విజయ ముచేకూర్చుకొనుడు. ధాత మీకు ధన్యతక్ ప్రసాదింపగలదు. జయ్! విజయీభవ!!

* * * *

## గ్రంథాలయసర్వస్వ నవీనాకృతి

మా గ్రంథాలయసర్వస్వమునం దొకనవీనసృష్టి ప్రయత్నము నారంభించుచున్నాము. గ్రంథాల యోద్యమము అనంతవిజ్ఞానప్రచారకోద్యమము. ఆ విజ్ఞాన స్వరూపిణి యగు శ్రీ సరస్వతికి గ్రంథాలయము సాంకేతికము. సాంకేతికమునకు సంబంధించిన విషయపరిజ్ఞానము మిక్కిలి యవ సరమేయైనను అంతటితో సంతృప్తిపడినయెడల సాధనముతో సంతృప్తిపడి యుద్దేశమును మరచిన వార మగుదుము. కాబట్టి ఈ గ్రంథాలయ సర్వస్వమున నేటినుండి అనంతవిజ్ఞానప్రచార మును మాకుచెందిన మితాధికారసంపత్తితో కావింప తలపెట్టితిమి. ఈ సచరాచరప్రపంచ రహస్యము లెక్కడ? మాసమునకు నలుబదిపుటల పరిమితిగల మా గ్రంథాలయసర్వస్వ మెక్కడ? మేము కోరునట్టి మహాసృష్టియెక్కడ? మా సాధనసంపత్తియొక్క యణుమాత్రస్వరూప మెక్కడ? అనుప్రశ్నలు మాకు తోచకపోలేదు. కాని యణువులసృష్టియే యనంతసృష్టి. నిముస ములకర్మయే నిరంతరకర్మ. ఎడతెగని ప్రయ త్నమే ఎల్లలేనిజీవనము. ఈ భక్తితో నుపక్ర మించితిమి.

గ్రంథాలయ సర్వస్వమున కొన్నిపుటలు ఇదివరలోవలెనే ప్రత్యేకము గ్రంథాలయోద్యమమునకే వినియోగింపగలము. తక్కుంగల భాగమున సర్వవిజ్ఞాన ప్రపంచవిహారమును, క్రమరీతిని కావింప నెంచితిమి. ఆంధ్ర వికాసమును జీవకళగా సాధింపదలచితిమి. ఆంధ్రసంస్థలు - ముఖ్యముగా ధర్మసంస్థలు - ఆంధ్ర మహామూర్తులు, కవులు, గాయకులు, శిల్పులు, చిత్రలేఖకులు, పరిశోధకులు, ప్రజ్ఞానిధులు, వీరులు, సూరులు, రాజనీతికోవిదులు, దాతలు, గురువులు, - వీరిచరిత్రలు, రచనలు, లేఖలు, ఆంధ్రభూమి క్షేత్రములు, గుళ్ళు, గోపురములు, దుర్గములు, దృశ్యములు, ఆంధ్రచరిత్ర ఇత్యాదులకు ప్రథమస్థాన మీయనెంచితిమి.

మాసంకల్పము లీడేరుటకు మాయం దభిమానముంచి విషయములు వ్రాయునట్టి పండితులు సక్రమసానుభూతిసహాయములు నెరపుట మొదటి యవసరము. వారికి మాయం దెంత వాత్సల్యము ఎంత సహనము ఉండునో అంతవరకే మాపని నెరవేరగలదు. మేమొక క్రమ విధానము నిర్ణయించుకొంటిమి. కావున అందులోనికి మాకంటెను ఎక్కువమేధాశాలురు అనుభవజ్ఞులు జ్ఞానపరులు నగు తా మిముడవలసి యుందురు. మమ్ము దయదలచి ఆదరించి మా లోపముల సైరించి మాకు తోడ్పడుచే తమ సంతోషముగ మమ్ము దీవింపవలసియుందురు. ఆంధ్ర పండిత మండలియందు - ప్రాచీన నవీన మార్గావలంబకు లందరియందు-ఈ ప్రేమకలదని విశ్వసించియే మేము వారి నాశ్రయించి పని బూనితిమి. వారు తప్పక మమ్ము కృతకృత్యుల గావింతురుగాక !

పండితులవలెనె ప్రముఖులును ప్రజలును మమ్మాదరింపవలసియుందురు. వ్యాప్తిని గణించిన యెడల వీరి యాదరణయే హెచ్చుగా కావలయును. ధర్మార్థ కామ సాధనములలో అర్థమున కర్థము చాల గొప్పది. ప్రముఖులయు ప్రజలయు ఆదరణముననే అది సాధ్యము కావున మావిన్నపము సర్వాంధ్ర ప్రజలకును సమర్పించుకొని తమ యాదరణముచేత, సాధనమాత్రమగు నర్థమును సాధ్యముకావలసిన విజ్ఞాన ప్రచారావకాశమును మాకు సమకూర్తురు గాకయని ప్రార్థించుచున్నాము.

అభివందనములు:

శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారు ఆంధ్రవిశ్వవిద్యాలయమునకు ఉపాధ్యక్షులుగా నెన్నుకొనబడుట మహదానందకరము. వారు ఇదివరలో రెండు పర్యాయము లీ పదవి నలంకరించిరి.

ఏదో మహోద్దేశముతో మధ్యకాలమున పదవికి రాజీనామానిచ్చిరి. ఈమూడవ అధికారకాలము వారికి రమారమిగ అయాచితమై లభించినది. మొదటినుండియు విశ్వవిద్యాలయ విద్యావిధాన నిర్మాణమున శ్రీరెడ్డిగారు మహోదారమైన దృష్టికలవారు. ఆయుదాశయములను, నిరాటంకముగ గార్యక్రమమునందిడి, కృతకృత్యులగుటకు వీరికి ఈశ్వరుఁడు సహాయపడును గాక! దేశసేవను తమహృదయమున కత్యనుకూలమైనరీతిని నిర్వహించుటకు సాధనమైనపదవిని వీరు మరల వహించినందులకు వీరి నభినందించుచున్నాము. బహుజనవిద్యా విషయక పరిశ్రమయందు వీరు అప్పటికన్న నెక్కుడు దీక్షవహింతురుగాక యని కోరుచున్నాము.

# అమరకంటక యాత్ర

కీ. శే. శ్రీమతి భండారు అచ్చమాంబగారిలేఖ.*

## నర్మదానది యెచ్చట బుట్టును?

సంబలపూర్ ౩౦-౮-౦౩

ప్రియసఖీ తిలకమా!

తాము మిక్కిలి బలహీనత కలిగియుండియు దానిని లెక్కింపక నాకు వ్రాసినకార్డు నాకందినది. దానివలన మీశరీరమున కించుక నెమ్మది కలిగెననియు ముందీవ్యాధియే నిశ్శేషమగునను నమ్మకముగా నున్నదనియు జదివి యప్పుడే తాము సంపూర్ణారోగ్యతను గాంచి నాకన్నుల కగుపడినటుల నత్యంతానందము గలిగెను. చి. లక్ష్మణరాయుడు♦ మిక్కిలి నీరసించి యుబ్బసముతో బాధపడుచుండెను గాని వానికి స్నేహితుఁడగు నొక డాక్టరు పట్టుదలతో మందిచ్చి దానిని బోగొట్టినందున నాఱు సంవత్సరముల నుండియు వాఁడు శరీరసౌఖ్యముకలిగియే యున్నాఁడు. వాఁడిప్పుడు చెన్నపురికి వచ్చియే యుండును.

♦♦చి. చంద్రమతి చదువుకుంటున్న వార్త విని సంతోషించితిని. దానికి నా ముద్దులు చెప్పుడు.

ఇఁక మిగతసంగతుల నావలఁద్రోసి వెనుకటి యుత్తరములో వ్రాసినప్రకారము మా అమరకంటకయాత్రావార్తను వ్రాసెదను.

**బిలాస్పురమునుండి సంబలపురమునకు మమ్ములను మార్చినవార్త తెలిసినవెంటనే మాకమరకంటకమునకు వెళ్లవలయుననెడి కోరికె హెచ్చెను. పూర్వ మాఱుసంవత్సరములు బిలాస్పురమునం దుండి యీ పర్వతప్రదేశమును జూచుట తటస్థించినదికాదు. నర్మదానదికి జన్మస్థానమగు నీస్థలము బిలాస్పురమునకు సమీపమునం దుండుటవలన వెంటనే బయలుదేరు దినము నిశ్చయముచేసికొని, ‡మీ బావగారచటియాఫీసరును సెలవడిగిరి. అందుకాయధికారి సమ్మతించి

---

* కీ. శే కొమర్రాజు వెంకటలక్ష్మణరావుగారి సోదరీమణియు, అబలాసచ్చరిత్ర రత్నమాలను రచించిన సుప్రసిద్ధ విదుషీమణియు నగు భండారు అచ్చమాంబగారు తమ్మునికిని, కొటికలపూడి సీతమ్మగారు పులుగుర్తి లక్ష్మీనరసమాంబగారు మొదలగు కవయిత్రులకును వ్రాసినలేఖ లనేకములున్నవి. ఆలేఖలన్నింటిని ప్రచురింపవలెనను కుతూహలముతో లక్ష్మణరావుగారు సంపాదించియుండిరి. వానిలోఁ గొన్నింటి నీమాసపత్రికలో బ్రచురింపఁ దలచితిమి. ఈ లేఖను అచ్చమాంబగారు శ్రీమతి కొటికలపూడి సీతమ్మగారికి 30-8-1903 తేదీన వ్రాసిరి.

♦ లక్ష్మణరావుగారిని బంధువులు 'లక్ష్మణరాయుడు' అని వ్యవహరించెడివారు. అప్పుడు లక్ష్మణరావుగారు శ్రీమునగాల రాజాగారి కొలువున చెన్నపట్టణములో నివసించుచుండిరి.

♦♦ చంద్రమతి కొటికలపూడి సీతమ్మగారి కుమార్తె.

** బిలాస్పురము సెంట్రల్ ప్రావిన్సెస్‌లోని నగరము.

‡ సీతమ్మగారిని అచ్చమాంబగారు చెల్లెలి వరుసను పిలుచుచుండిరి. అందువలన అచ్చమాంబగారు తమ భర్తగారిని గుఱించి వ్రాయునపుడు 'మీబావగా'రని వాడినారు. అప్పుడు అచ్చమాంబగారిభర్త మాధవరావుగారు మధ్యరాష్ట్రములలో సబుడివిజనలు ఆఫీసరు ఉద్యోగము చేయుచుండిరి.

నందున జూన్ నెల ౪ వ తేదీని సాయంత్రము నాలుగుగంటల ట్రైనులో సకుటుంబ సపరివారముగా నెక్కి రాత్రి ౮ గంటలకు ఖుర్దారోడ్డను స్టేషనులో దిగితిమి. ఆరాత్రి యాపల్లెలో మేము దిగుటకు నిల్లుదొరుకుట కష్టమని తలంచి స్టేషను సమీపమునం దున్న బాలురపాఠశాలలో దిగి ఫలహారములుచేసి విశ్రమించితిమి. బిలాస్పురము నుండి బయలుదేరిన దినము గర్భశూలావలన నేనధిక బాధపడినందున నాదిన మచటగడిపి రాత్రి ప్రయాణముచేయుటకు నిశ్చయించి తెల్లవారిన పిదప మమ్ముల నొకధర్మశాలయం దునిచి కొన్ని క్రోసులదూరములోనున్న సర్కారుపనిచూచుటకు మ. మీబావగా రరిగిరి. నాటి దినము చి. బాయియే వంటచేసినది. పనిచూచి శ్రీమీబావగారు మాబసకు జేరునప్పటికి రెండు ఝాములు దాటినది. తదనంతర మందఱమును భోజనము జేసి యమరకంటకమునకుబోవుటకు బండ్లుగుఱ్ఱములు సవారీలు మొదలైనవి అద్దెకు దొరుకునాయని విచారించితిమి. కాని యా దినములు వ్యవసాయకులు భూమిని దున్నుచుండు దినములైనందువలన మాకు రెండు కప్పులులేని బండ్లును, పిడికెడు వరిగడ్డి మేసి బలిసినయొక గుఱ్ఱపుతట్టును మిక్కిలి ప్రయాసముగా నద్దెకు దొరికినవి.

మేము దిగిన స్టేషనునుండి యమరకంటకమునకు రోడ్డు లేనందున బండ్లు త్వరగా నడువవని మేము రాత్రి రెండుగంటలకే ప్రయాణమైతిమి. మేము సూర్యోదయమునకు నైదు క్రోసులు నడుతుమని యనుకొనినను ఆ తెల్లవారి తొమ్మిది గంటలకు తొమ్మిదిమైళ్ళు ప్రయాణము చేసితిమి. బండ్లాస్థలమువఱకే పోవునుగాన మేమంత వాని నచటనే విడచి మరలి వచ్చువఱకు గాచియుండుడని చెప్పి పిల్లల నొక్కరొక్కరినిగా నశ్వారోహణము చేయించుచు మేము పాదచారులమై పోవుచుంటిమి. ఇట్లు మే మొకమైలుదూరము నడిచిన పిదప నామ్రవృక్షచ్ఛాయాసమన్వితంబును శీతలోదకయుక్తంబును నగు నొక్క సెలయేటిని గాంచితిమి. సూర్యతాపముచే బడలియున్న మా కాప్రదేశ మధికసుఖప్రదముగా నుండినందున మేమచట గొంత దవ్వుండి ప్రాతర్విధుల నిర్వర్తించుకొని యల్పాహారము జేసి మనస్సున కసమ్మతమైనను ఆస్థలమును విడిచి ముందుకు సాగితిమి. కాలము వేసవికాల మైనందునను ప్రొద్దెక్కినందునను నాకొండతావుల యందుంగల రాళ్లన్నియు కాగియుండినందున పాదరక్షలులేక మే మాస్థలమునుండి నడుచుటయే దుష్కరముగా నుండెను. అయితే సూర్యతాపము నివారించుట కచట నెవ్వరును లేకుండిరని యనుకొనకుడు. సదా పరోపకారమే నైజగుణముగాగల యనేకవృక్షములప్పుడప్పుడు తమఛాయను మాకొసంగి మమ్ములను సత్కరించి తాపమునార్పినపుణ్యము నోడిగట్టుకొనినవి. ఇట్లునాలుగుమైళ్ళుకొండపై కెక్కిన పిదప మేమమరకంటకమనుపర్వతమును జేరినర్మదాగుండమును గాంచితిమి. ఈగుండముమధ్య నొక దేవాలయము గట్టబడియున్నది. ఆ దేవాలయము క్రిందిగా నర్మద ప్రవహింపుచున్నదంట. ఆగుండమునందలి నీరంతయుందీసినప్పుడా ప్రవాహము కానుపించునంట. గుండముచుట్టును రాతికట్టడము గట్టి దిగుటకును స్నానములుచేయుటకును వీలుగాం జేసియున్నది. దీనినుండి జల మింకొకగుండములోనికిని, దానినుండి యింకొక స్థలమునకును బ్రవహించును.

మేమును నర్మదాగుండమునకు సమీపము నందున్న తీర్థవాసులయింటదిగి మూడుజాముల వరకు భోజనములం గావించుకొని సాయంత్ర మాపర్వతమునంగల క్షోణభద్రప్రవాహమును జూడనరిగితిమి. ఇదినర్మదాగుండమునకు మైలు దూరములోనున్నది. ఈక్షోణభద్రకుం బోవు

మార్గము విశేషరమణీయముగా నుండును. మేమచటికి గ్రీష్మాంతమునం దరిగియుండినందున మార్గమధ్యమున కిరుప్రక్కలంగల పర్వతములు కోమలపల్లవయుతములగు వృక్షలతాదులచేఁ గప్పఁబడి దూరముననుండి చూచువారి కీపర్వతములందుండు వనలక్ష్మి యాకుపచ్చరంగుగల పీతాంబరమును గట్టుకొనినదో యనునట్టు లగుపడుచుండెను. కన్నుల కింపగు నాత్రోవను గొంత దవ్వరిగి యచట నాపర్వతమునుండి క్రిందికి నేగుచున్న శ్రోణభద్రి యను సెలయేటిఁ గాంచితిమి. ఇదిగాక ఆపర్వతమున గులీబకావలీవన మనునొక ప్రసిద్ధిగాంచినపుష్పవనమును,కపిలధారపాలధార మొదలగు ననేక ప్రేక్షణీయస్థలములు గలవు. వీనిలో కపిలధార ముఖ్యమైనది. మేము రెండవ దినము కపిలధారనుగాంచి బయలుదేర నెంచితిమి.

తలచినటుల రెండవ దినము తెల్లవారు జామున నేలేచి పిల్లలు నడువలేరని వారినింట నుంచి *మార్కండేయుని మాత్రము తీసికొని కపిలధారమార్గమున నడచి పోవుచుంటిమి. ఇది నర్మదాగుండమునుండి 3 మైళ్లదూరమునందున్నది గుండమునుండిబయలువెడలు సన్నధారయే కొంత దూరమరిగినపిదపఁ గొంచెము పెద్దదగును. ఈప్రవాహమునకాపర్వతమునందలి సెలయేళ్లుసహాయపడుచుండుటవలన నది మనకుదోవలో క్రమక్రమముగా వృద్ధియగుచుండున ట్లగుపడును. మనము పోవు మార్గము నర్మదాయొడ్డుగానుండును. ఈనది రెండు పర్వతముల మధ్య చదునుగా నున్న పర్వతముమీద నిటుల మూడు మైళ్లేగి యచట నాకొండకు డెబ్బది యడుగులక్రింద నుండురాళ్ళపై బడును. దీనినే కపిలధార యని పిలుతురు. కపిల ముని త్రోవ కడ్డముగా కాలుంచినందున నది వంకరగా నేగి ధారగా క్రిందికి దిగెనని యందురు. మేము పై వరకు నదితో నరిగి యచటనుండి దుర్ఘటమగు మార్గమున క్రిందికిదిగికొంత సేపు ఆనందించితిమి. కపిలధార పాపముచేసినవారిపైఁబడదని వింటిమి; కాని, యప్పుడు మేమును మాతో నాస్థలమును జూడవచ్చినవారును ధారక్రింద స్నానములు చేసితిమి కాని మాకెవ్వరును బాపము చేసినవారగుపడలేదు. అనగా ధారక్రిందికిబోవ వెలిచిన వారెవ్వరును గానరాలే దనుకొనవచ్చును. నర్మద యటనుండి కొంత దూరమేగి పర్వతము క్రింద పడును. దానిని పాలధారయని పిలుతురు. మే మచటనుండి బసకు వచ్చుఁటకు జాము ప్రొద్దెక్కెను. బసకుఁజేరిన వెంటనే వంటచేసి యందఱకును వడ్డించి నేను భోజనముచేసి ప్రయాణమగునంతకు రెండుజాము లయియుండును. అచ్చట నీరు మంచిదికానందున నాయాసమును లక్ష్యముచేయక నాఁడే పర్వతముదిగి బండ్లలో నెక్కి స్టేషనుజేరి పొగబండి నెక్కి యామఱుదిన ముదయమున బిలాస్పురము జేరితిమి.

ఈ ప్రయాణములో విశేషము లేమియు లేకుండినను దర్శనీయమగు కపిలధార వార్తను మీకుఁ దెలుపవలెనని తెలిపితిని. దాని ఫొటో కొఱకు విచారించితిని గాని యది చిక్కినది కాదు.

మా అమ్మగారికి ♦♦కన్నులు బాగున్నవఁట. చి. బాయి ♦నాగపురములో సుఖముగానున్నటుల యుత్తరము వచ్చినది. రాజ్యలక్ష్మమ్మ పిన్నిగారికి నా నమస్కారములు. ఇట్లు చెలి,

భం. అచ్చమాంబ.

---

* మార్కండేయుఁడను బాలుఁడు అచ్చమాంబగారికి ప్లేగు కొంపులలో దొఱికినాఁడు. తల్లిదండ్రులు విడిచిపెట్టిపోయిన ఆయనాథశిశువును తెచ్చి పెంచుకొని పెద్దవానిఁ జేసి, ఆస్తికి గూడ కర్తను జేసియున్నారు.

♦♦ భండారు అచ్చమాంబగారి జనని గంగమ్మగారు కాశీనగరమునందు నివాసమేర్పరచుకొని చిఱకాల మందే యుండిరి. ప్రియపుత్రుని మరణవార్తవిన్న కొలది వత్సరముల కచ్చటనే మృతినొందిరి.

♦ బాయి, అచ్చమాంబగారి సవతికూతురు. ఈమె యిప్పటికిని జీవించియున్నది. ఈమె పూర్తిపేరు మాచిరాజు మీనాబాయి. ఈమె కుమారుఁ డిప్పుడు సెంట్రలు ప్రావిన్సెస్‌లో సబుజడ్జీ పదవిలోనున్నాఁడు. బాయి యన్న అచ్చమాంబగారికిఁ బంచప్రాణములలో నొక ప్రాణము.

# ప్రాచీనాంధ్ర నాట్యము పుట్టినిల్లు

# కూ చి పూ డి

( శ్రీదివాకర్ల రామమూర్తిగారు )

ఇచట ఆంధ్రులనోము నర్తించిచనియె;
ఇచ టుషోగీతికలు నినదించి విడిచె;
ఇచట భరతర్షి వేదసద్రచన నిలచె
ప్రాభవముడిగ్గి పతిత మూకీభవింప.

* * * *

ఇచట కనువిప్పులోన లయించిపోయె
'ధణధ ధోందణ' శివునినర్తనలు నేడు;
ఇచట కాలాహినోట జీర్ణించిపోయె
పలుకునిగ్గులు, గానసప్తస్వరాలు

* * * *

కూచిపూడి చిన్నగ్రామము. బందరునకు 10 లేక 12 మైళ్లదూరమున నున్నది. ఇప్పటికిని లౌకికవ్యవహారములు చక్క దిద్దుకొనుట కాయూరివారు మచిలీపట్టణము రావలసినదే. దీనినే కూచిపూడియగ్రహార మందురు- అగ్రహారీకులగు బ్రాహ్మణులు విశేషముగా నుండుట చేత- ఈ యగ్రహారమునకు దగ్గరగా 8 మైళ్ల దూరమున కృష్ణాస్రవంతి ప్రవహించుచుండును. వారి కళోపాసన కాధార మీకృష్ణామధు తోయము. కృష్ణవేణీస్రవంత్యాగత మందవాయువులు వారిగళమందున్న జీరలకు విరోధులు. కృష్ణాపులినసీమలలో వారు గానమును సాధింతురని వినుకలి.


అగ్రహారము చిన్నదియు కాదు పెద్దదియు గాదు. సామాన్యమగు విస్తీర్ణముగలది. రాజవీధి కిరుప్రక్కలను ఎత్తగు వేదికలు గృహపురోభాగములం దుండును. ఉదయమున కళ్లాపు చల్లి ముగ్గిడిన తరువాత ఆగృహపురోభాగములు సరస్వతీవిహారసదనములవలె దోచును. వేకువలయందు గురువులు శిష్యులకు గృహప్రాంగణమందలి ఉన్నతవేదికలమీద నుపవిష్టులై పాఠములు చెప్పుచుందురు. ఎప్పుడుచూచినను ఆగ్రామమం దేదో యొకమూల సంగీతము వీనులబడును. సాయంసమయములందు సూర్యారుణకిరణము లేటవాలుగా పడుచుండ చల్లని గాలి కృష్ణానదినుండి గ్రామముమీందకు విహరించుచున్నప్పు డాగ్రామవీధులయందు నడచిన గాంధర్వలోకములో విహరించు నట్లనిపించునని ఆయూరివారు పలుకుదురు. జన్మభూమి స్వర్గముకన్న నెక్కు డానందహేతువన్న విషయము వారల నట్లనిపించినదనుటకు వీలుండదు. ఎచ్చట చూచినను కిన్నెరవలె కోకిలస్వరములతో విద్యార్థులు పాడుచుందురు. ఇది వారి కుగ్గుపాలతో పెట్టిన విద్య.

అగ్రహారీకులు ప్రాచీనశిష్టవ్యవహార భాష మాట్లాడుదురు. 'ఏమంఛారు' ఇత్యాదిపదములు వా రుపయోగింతురు. 'అటువంటిన్ని ఇటువంటిన్ని' అను టిన్నులు వారి సంభాషణలో దొర్లును. ఛాందసరీతిని వారు మాట్లాడుదురు. అందరును కొద్దిగనో గొప్పగనో సంస్కృత వాసన చవిచూచినవారే!


అగ్రహారమునందు బ్రాహ్మణు లొక్కరే కాపురములు లేరు. ఇతరవర్ణములవా రున్నారు. కాని బ్రాహ్మణగృహసంఖ్యవిరివి. ఆరునెలలు సహవాసము చేసిన వారు వీ రగుదురన్న సామెత ప్రకారము బ్రాహ్మణసేవాపరాయణులగువారి యందుగూడ సంగీతము లయించినది. వా రభినయక్రమశిక్ష నొందకున్నను వాసనయంటి

# హిందూ యువజన సంఘము, శాశ్వత ధర్మకర్తలు.

రు 50,000/- లు భవనదాత.



రా. బ. మోతే గంగరాజు జమీందారుగారు.
హిం. యు. సంఘ ధర్మకర్తృ సంఘాధ్యక్షులు.
ఏలూరు గోసంరక్షణసమితి ప్రెసిడెంటు;
ఏలూరు అన్నదానసమాజం పోల్‌ట్రస్టి.



మ. రా. శ్రీ మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారు.
ప్రథమ శాశ్వతధర్మకర్త (ధర్మకర్తృ సభా గౌరవ కార్యదర్శి.)
ఏలూరు గోసంరక్షణసమితి, అన్నదాన సమాజముల వైస్ ప్రెసిడెంటు.

సామాన్యముగా పాడగలరు. అభినయముచేయగలరు. వారి వాసన కొన్ని సమయములందు భాగవతుల కత్యుపయోగముగనుండును.

* * *

నిసర్గముగా సృష్ట్యాదినుండి స్త్రీ ప్రకృతి సునిశితమయినది. పురుషప్రకృతికి కార్యవ్యగ్రతా విశేషమున సునిశిత మోటువారును. పురుషుని కంఠమునందు స్థాయిభావములు తరచు మారును. స్త్రీ గళమునందు స్థాయిభావము నిశ్చలముగానుండి ఎగుడు దిగుడులు ఎత్తుదింపులు లేని శబ్దము జనించును కూచిపూడిలోని ఆడవారు పాఠశాలలయందు చదువుకొనినవారు కారు. సంగీతబోధకునియొద్ద నిత్యము గానకళాభ్యాసమొనరించినవారు గారు. అనుక్షణము వారి ఇండ్లలో సంగీతము మారుమ్రోగుటంజేసి వారు అనుశ్రుతముగా వచ్చిన వంశపారంపర్యహక్కుచే సంగీతవిద్యార్థినులగుదురు. వారు హార్మోనియం వాయింపులకు మోహపడరు. ఉచ్చమయిన కంఠములతో అధ్యాత్మరామకీర్తనలు భక్తిముక్తి ప్రదముగా నేర్చుకొందురు; నేర్పుదురు; పారాయణచేయుదురు. వారు గృహకార్య నిమగ్నులై కాలము గడుపుదురు. వ్రాయను చదువను గలుగుట సకృత్తు. వారిసంగీతము సరసమును హృదయరంజకమనుట అనుభవసిద్ధము.

కూచిపూడి గ్రామ సస్య కేదారములు కృష్ణాప్రవంతోదకవర్ధితములు. పంటల దినములలోను, వర్షాకాలములందును అగ్రహారీకులు వ్యవసాయము చేయుదురు. వారాకాలమున నుద్యోగము నాసించలేరు. స్వతంత్రజీవులు. నాటకసంచారములేని వ్యవధిదినముల యందు కర్షకులుగా కాయమును దిట్టపరుచు కొందురు. కూచిపూడివారు కర్షకులు, గాయకులు, అభినయవేత్తలు, విద్వాంసులు.


# ఓరియంటల్

## గవర్నమెంటు సెక్యూరిటీలైఫ్ అస్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్

స్థాపితము 1874. హెడ్ ఆఫీసు : బొంబాయి.

**1934** నివేదిక — సంగ్రహము.

| | | | |
|---|---|---|---|
| జారీచేసిన క్రొత్త పాలిసీలు | రూ. 7,62,42,761 | చెల్లించిన క్లయిముల మొత్తం | రూ 16,29,88,814 |
| పాలీసా ఆదాయము | ,, 3,14,01,970 | పెరిగిన ఫండు మొత్తములు | ,, 15,53 88,843 |
| అమలులోనున్న పాలసీలు | ,, 54,20,38,518 | | |

ఈ పైన తెలుపబడిన అంకెలు ఓరియంటల్ యొక్క ప్రజాదరణ, కంపెనీస్థిరత్వముగూర్చి వేనోళ్ళ చాటుచున్నవి.

ప్రజాదరణబొంది దినదినాభివృద్ధిగాంచుచున్న ఈహైందవ భీమాసంస్థలో మీజీవితము భీమా చేసికొనుటకు

ఆలసింపవలదు.

వివరములకు : పి. హెచ్. గుప్త, బార్-ఎట్-లా సెక్రటరీ, ఉత్తరజిల్లాలు, గోడేవారివీధి, లేక ఈక్రింది ఉదాహరింపబడిన కంపెనీ కార్యాలయములకు వ్రాయవచ్చును. విశాఖపట్టణము,

ఆగ్రా, అజ్మీర్, అహమ్మదాబాద్, అలహాబాద్, అంబాల, బెంగుళూర్, బెరియేలీ, బెల్గాం, కలకత్తా, కాలికట్, కోయంబత్తూర్, కొలంబో, ఢక్కా, ఢిల్లీ, గౌహతి, గుంటూరు, జలాను, జల్పాయిగురి, జబ్బల్‌పూర్, కరాచీ, కోలాలంపూర్, లాహోరు, లక్నో, మాండలే, మధుర, మెర్కారా, మొంబాసా, నాగపూరు, పాట్నా, పూనా, రాయపూరు, రాజసాహి, రాంచీ, రంగూన్, రావల్పిండి, సింగపూర్, సుక్కూర్, తిరుచునాపల్లి, తిరువనంతపురము, విశాఖపట్టణము.

(Oriental)

# గోడగూచి కథ *

శ్రీ ఉభయభాషాప్రవీణ, కా. వీరభద్రేశ్వరరావుగారు, బి.ఏ., యల్.టి.

శివదేవుఁడను శివభక్తుఁడు పొన్నూరికేఁగుచు కడగొట్టుపాప నింట గాపుంచి, "అమ్మా! గోడగూచీ, ఇంట బదిలముగనుండుము. నిత్యము గుడికేగి దేవదేవునకుఁ గుంచెడుపాలు ఆరఁగింపఁ బెట్టుము. ఈవ్రతమును నీవు తప్పక జరిపెదవని నమ్మి పోవుచున్నాము. చిన్నతల్లీ! నీ కొక మంచి బొమ్మయు నిన్ని బొమ్మపొత్తికలును తెచ్చి యిచ్చెదము" అని అప్పగించి వెళ్ళెను. గోడగూచియు కాళ్ళు మొగము గడిగికొని, గంగియావుపాలు కమ్మగా కాచి కుంచెడు కోరతో గొలిచిపోసి, కోరను పొత్తిన కొంగున గప్పి శివాలయమునకు వెళ్ళినది. శివునిముందర నామె కోరఁబెట్టి మ్రొక్కి పాలారగింపవలసినదని విన్నవించి, కనుమరగయ్యెను. తాను చాటునకేగినను కోరలోనున్న పాలు కొంచెమైన గదలనందున భయముఁజెందినదై యిట్లని బహుప్రకారముల సన్నుతించెను.

"పాలేల యారగింపవు లింగమూర్తి?
కాచుట చాలదో? కమ్మ వల్వమినా?
ప్రాచియో? విరిగెనో? పడుచ నే ననియో?
ప్రొద్దెక్కెనో యెండ పొగవట్టి చెడెనా?
బుద్ధిపుట్టదో? నెయ్యి వోయకుండిననా?
కడు వేడియో? నీరు గలసినవనియో?
యెడ వాద్యములులేక యేనె తెచ్చితినా?
చాలవో? యివి యాలపాలుగా వనియో?
పాలపైఁ జిత్తమే బరపితి ననియో?
కోర బెడంగెనో? కుంచెడు లేవా?
యారగింపగబెట్ట నేరకుండితినా?
మీఁదుపోయినవనో? మీఁగడ లేదో?
యేదెచ్చునెడ నెవ్వరే జూచిరనియో?
యారగింపక యేమిటికి పాలొల్లవు తాప్రవ?
కారణంబేదేని కలదేని చెపుమ.
నిక్కపు టాకలి నీకు లేదేని
గుర్కైనను గొని చిక్కించు నాకు
గుడుపున కియ్యెడ గుదగుద లేల,
కుడుకెడు దెత్తునా గుజ్జునోగిరము.
మూలపన్నారుల, యాలోవిలోన,
పోలెలున్నవి, పంపు, పోయి తెచ్చెదను.
యుట్టిపై బానలో నున్నది. నెయ్యి
ఇట్టున్న దెచ్చెద నిష్టమే నీకు.
కుండెడున్నది పోయి కొనివత్తు పుల్ల
ఖండంబు వలెనేని గ్రక్కున జెపుమ.
అచ్చన యెల్లి మాయయగారి నగర
జెచ్చెర బిల్వవచ్చెద నారగింపు.
మా శివసోదరి మఠమునగలదు
పాశంబుదెచ్చెద పాలు మున్ద్రావు.
షోడశపండువు చూడ బోదండు
పోడిగా నీపాలు పురహర గొనుము.
వీరేశుజాతరవేళ నిన్నుండి
యేరొప్ప బనిచెద నీపాలుద్రావు.

* ఇది పాల్కురికి సోమనాథసుకవి ప్రణీతమైన బసవపురాణమునందలి చిన్నికథ. ఇట్టికథ లనేకములందు వర్ణింపఁబడినవి. ఈకథలను సోమనాథుఁడు సర్వసామాన్య భాషయగు తేటతెనుఁగులో ద్విపదలలో గూర్చెను. ఇందు జాను తెనుఁగుమాటలు, వీనుల విందగు జాతీయములు గోచరించుచున్నవి.


పొన్నూరు = పొరుగూరు, కోర = పాత్ర, కమ్మ = తీపిదనము, ప్రాచి = చద్ది. బెడంగెనో = తొణికెనో. మీఁదుపోవుట = దృష్టిదోషముతగులుట. చిక్కించు = విడిచిపెట్టు, కుడుకెడు = కుడుక — (పిడత) + ఎడు. ఓగిరము = అన్నము. పన్నారులు = దొంతెర, లోవి = పాత్రము, పోలెలు — పోళీలు = భక్ష్యవిశేషములు, పాశము = పాయసము; పులఖండము = కండచక్కెర.

ఎడమడుగేమిటి కీపాలలోని
కడుకులు దెచ్చెద నట్లన జెపుమ.
ఇత్తఱి శిశువుండ నెట్టు లంటేసి
పొత్తుననైనను నెత్తి త్రావుదము.
పిన్న పన్నారులు, చిన్ని బొమ్మలును,
ఇన్ని గూడడుకులు, నెన్నెని పండ్లు,
నాకెల్లి మావారు సలి దెత్తు రపుడు
నీకె యిచ్చెదఁగాని నీయాన, త్రావు
పాలును జల్లారె, పలుకవు తోడ
ఏలయా లింగ నన్నే చెదవు•

పాపటీశ్వరుఁడా బాల మొఱాలకింపఁడయ్యెను. గోడగూచి ముద్దరాలు కావున శివునకు పలుమారు మ్రొక్కినది. శివుని కోపించి భంగించి ఎలుగెత్తి పిలిచినది. కాళ్ళుచేతులు విలవిలదన్నుకొని విలపించినది. శివుఁడు కొంచెమేని ద్రావెనేమోయని పాలకోరవంకను ఫాలాక్షువంకను జూచినది. నిర్జీవివలెపడి నివ్వెరబోయినది. బుజ్జగించినది బూరగించినది. ముప్పతిప్పలు పడినది. లాభమేమియు కనబడలేదు. దొప్పగ దొర్లినది, కుప్పగ కూలినది. పాలకోరను శివుని ముందట బెట్టి, "బాలేందుమౌళీ! పాలేలద్రావవు? ఎట్లు పెట్టిన వట్లే యున్నవి. ఏల మూతి ముట్టవు? మూర్కొనవు? నీవు పాలు త్రాగలేదని మావారువిన్న నన్ను చంపుదురు. నేను వారిచేఁ జావనేల? ఇచ్చటనే నీయెదుటనే చత్తును"అని గోడగూచి కినిసి తన తల శంభునిశోఁ దాకించుకొనుటకు వచ్చుచున్న, ముగ్ధబాల భక్తికిమెచ్చి శివుఁడు నవ్వుచుఁ గోరనెత్తి కుత్తుకబంటిగ పాలు గ్రోలెను. అదిచూచి బాలిక 'కరకంఠా! పడుచనని పాలు ద్రాగుటకు న న్నింత ఏడ్పించితి సరే! మఱవకుము. మాయన్నతోఁ జెప్పెదనులే!" అని పలుకుచు కుడుక నిమ్మని యందుకొని యింటికేగెను. ఇట్లు నిత్య మాపడుచు పాలుగొని శివున కారగింపు చేయుచుండెను. అంత నొక్కనాఁడు పొరుగూరికేగిన జననీజనకులు రిత్తకోరతో నెదురువచ్చు కుమారింగని యాశ్చర్యపడి జరిగినవృత్తాంతము విని నమ్మక "ఇది వట్టికల్ల. శంకరుఁడు పాలుత్రావునా? నీవైనను నీతోడిపడుచులైనను త్రాగియుండవలయు. తొల్లి మహాత్ములయిన ప్రమథులు సహితమెంత వేడినను ఒల్లని శివుఁడు నేఁ డెట్లారగించె? సరే నిజము రేపు తెలియఁగలదులే" యని పలికిరి.

ఆ మరునాఁడు బాలికచేతఁ బాలు పట్టించుకొని తండ్రి శివునిగుడికివెళ్లి పాలకోర హరుమ్రోలఁబెట్టెను. బాల నిశ్చలముగ్ధభక్తి లోకములో వెలయింప వలెనని లింగమూర్తి పాలకోరను మునిమ్రుచ్చువోలె మూర్కొనఁడయ్యె. శివదేవుఁడు మండిపడెను. 'ఓసీ ద్రోహీ! నిన్న త్రాగినశివుఁడు నేఁడేల త్రాగఁడు? ఏమేమో ప్రేలితివే! శివార్హములైన పాలు నీపొట్టనఁ బోసికొంటివి. నిలు!నిలు!నీపొట్ట వ్రచ్చెద నెందు పోయెదవని యుగ్రమునఁ బట్టవచ్చు తండ్రిఁగని బాల 'హాలింగ హాలింగ' యనుచుశంభుశరణముఁ జొచ్చెను. చేతికోర సందికొన వచ్చురీతి సమీపించిన భక్తురాలిని వీక్షించి ఓడకోడకుమనుచు తత్క్షణమే *కరిడిగభోగనాథుండు కృపాసనాథుండై తనవక్షము దెరచెను. గోడగూచియు హరుని దివ్యలింగాంగము జొచ్చెను.హా! పోయితివే తల్లీ యనుచు తండ్రి, వెంటనే వెండ్రుకలు పట్టుకొను నంతలో బాలిక శివుగర్భముఁ జొచ్చినది. కూకటి వెంట్రుకలు మాత్రము తండ్రిచేతికిఁ జిక్కినవి. ఇప్పటికిని ఆరు నెలలకొకపరియాయ మాశివుని మీఁదఁ జిక్కి పెరుగుచున్న కురులు కత్తిరించుచుందురు. గోడగూచి నిశ్చల ముగ్ధభావమునకీ దృశ్యమిప్పటికిని దృష్టాంతము.

• ఎడమడుగు=భేదము. కుడుక=పిడత. *కరిడిగ—ఇది కన్నడ దేశమందలి పుణ్యస్థలములలో నొకటికావలయును.



# కోకిల

( శ్రీమతి గుడిపూడి ఇందుమతీదేవిగారు )

కం. మాకందము నీకందము
మాకందమునకును గూర్చె మఱిమఱియుందం
బోకోయిల యీ మాధవు
రాకయెగదె భువికి మేలురాక తలంపన్. 1

గీ. ఎచటనుంటివె కోయిలా యిన్నినాళ్లు?
నీకు మాధవునకు నేటినేస్త మొక్కొ?
అతనితోఁ గూడ వేంచేతు వరయ తెలిసె
నతడెగా నీకు గానవిద్యాగురుండు! 2

గీ. చిగురుగొమ్మలచాటున జేరి నిలిచి
పంచమస్వరమున మించి పాడెదీవు
సర్వజనులకు కర్ణరసాయనముగ
చిత్తములు కోయిలా యిగు రొత్తుచుండ. 3

గీ. ఎవరు సభజేసి పిలువరు, ఎన్న డేమి
పారితోషిక మీరు, నీపాటి కీవె
నవసుధారసభవ్యగానమున బుధుల
పామరులగూడ నానందబఱతు, వౌర! 4

ఉ. ఏమి తపంబు జేసితివె;
ఎట్టి మహౌషధము ల్భుజించితే?
యేమహనీయు గొల్చితివె;
యెట్టిసుకర్మము లాచరించితే?
యీ మధురంపు గానకళ
యీధర నీకె లభించె కోయెలా!
యేమి ఫలంబు గోరకెద
నిట్టుల బాడెదు, పుణ్య మద్దియే.

గీ. ఎల్లరసములు గ్రోలి మత్తిల్లు మాకు
నీ మధురగానపటిమ లభింపదాయె
మెత్తనౌ వగరు చిగురుల మేసినంత
నీదు కుత్తుక కేలాటి నేర్పు ఘమరె. 6

ఉ. ఇన్ని దినాలనుండియును
నేమియు పల్కకనూరకుంటనో?
తిన్నని పంచమస్వనము
తీయదనంబును నీకు గల్గె; నీ
వెన్నడు పాడవత్తువని
యెంచుచునుంటిమి; వత్సరాదియున్
పన్నుగ వచ్చె నామనియు
వచ్చెను వచ్చితి వీవు కోయెలా. 7

గీ. పాడవే, ప్రీతి, కోయెలా! పాడుమమ్మ,
యింక పదిమాసములనాటికే గదమ్మ
యీచవులనీను గానంబు నేమువినుట,
యేల నెడనెడ మానెదో యెఱుగమమ్మ. 8

గీ. హా! తెలిసె, బాలురెల్ల నీ వనినయట్లు
లనుటచే, గేలిజేసినారంచు గిన్క
నంది, కనులెఱ్ఱజేసెద, వట్లుగాదు,
వారు నీపాట నేర్వగా గోరినారు.

# ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘము,

## బెజవాడ.

15-3-1936న, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘము యొక్క సామాన్యసమావేశము "ఉండి" గ్రామమున జరిగినది. శ్రీ గా. హరిసర్వోత్తమరావుగా రగ్రాసనాధిపత్యము వహించిరి. ఈక్రిందితీర్మానములు ఆమోదింపబడినవి.

### తీర్మానములు.

1. ఈక్రిందివారిని ముందు సంవత్సరమునకు కార్యనిర్వాహకులుగా ఎన్నుకోవడమయినది. (కార్యనిర్వాహక సంఘము)

అధ్యక్షులు.—గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు

ఉపాధ్యక్షులు:—శ్రీమతి బొడ్డపాటి సీతాబాయమ్మగారు
మ. రా. గోపు రామచంద్రరావుగారు
,, మాగంటి బాపినీడుగారు
,, శరణు రామస్వామిచౌదరిగారు (గుంటూరుజిల్లా)
,, భూపతిరాజు తిరుపతిరాజుగారు (పశ్చిమగోదావరి)
,, మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు (విశాఖపట్టణము)

కార్యదర్శి;—శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారు

సహాయకార్యదర్శులు: శ్రీ మల్లెల శ్రీరామమూర్తిగారు
,, వావిలాలగోపాలకృష్ణయ్యగారు
,, పాతూరి నాగభూషణంగారు
,, తాడిమేటి కుటుంబశాస్త్రిగారు
,, కలచవీడు వెంకటరమణాచార్లు గారు
,, హట్టి శంకరరావుగారు (అనంతపురంజిల్లా సంఘకార్యదర్శి)

డాక్టరు కైప సుబ్రహ్మణ్యశర్మగారు (కర్నూలు ,, )
శ్రీ మాడపాటి హనుమంతరావుగారు (హైదరాబాదు ,, )
శ్రీనరసింహ దేవరసత్యనారాయణగారు(తూర్పుగోదావరి ,,)
శ్రీ పురిపండ అప్పలస్వామిగారు (విశాఖపట్టణం ,, )
శ్రీ తిత్తి జలరామయ్యగారు

II 1936-37 సంవత్సరమునకు ఈదిగువ విధముగా బడ్జటును నిర్ణయించడమైనది.

1. కార్యాలయపుఖర్చులు

| | |
|---|---|
| (౧) సహాయకార్యదర్శికి నెల 1 కి రు 30 ల చొప్పున | రు 360-0-0 |
| (౨) నౌకరుకు నెల 1 కి రు 8 ల చొప్పున | 96-0-0 |
| (3) పోస్టేజి | 120-0-0 |
| (౪) అద్దె నెల 1 కి రు 10/-లు చొప్పున | 120-0-0 |
| (౫) స్టేషనరీ వగైరా | 120-0-0 |
| (౬) మిసలేనియస్ | 84-0-0 |
| | 900-0-0 |

2. గ్రంథాలయ సర్వస్వమునకు గ్రాంటు 600-0-0

3. ప్రచారము

(౧) ఆంధ్రదేశములో జనరలు ప్రచారమునకు గాను 700/
(౨) పశ్చిమగోదావరిజిల్లాలో ప్రత్యేక ప్రచారమునకుగాను 300/ } 1000-0-0

మొత్తము రు. 2500-0-0

III. ఆంధ్రోద్యమముయొక్క సాఫల్యమునకు గ్రంథాలయోద్యమము వెన్నెముకవంటిదని యీ సభవారభిప్రాయపడుచు, ఆంధ్రదేశ గ్రంథాలయసంఘకార్యనిర్వహణమునకుగాను అన్నిగ్రామములలోను, పట్టణములలోను, రాబోవు సంవత్సరాదినాడు, అభిమానులు పూనుకొని యింటిలటికి వెళ్ళి చందాలను వసూలు చేసి, వసూలైన మొత్తములను ఆంధ్రదేశగ్రంథాలయసంఘకార్యదర్శిగారి పేరిట బెజవాడకు పంపవలెనని ఈ సభవారు వేడుచున్నారు.

IV. ఈ సంఘకార్యనిర్వహణకు అవసరమగు మొత్తమును ప్రజలనుండి విరాళములు సభ్యత్వచందాలు వగైరా మూలముగా వసూలుచేయుటకు ఈ దిగువవారిని ఒక సంఘముగా నేర్పరచడమైనది. ఇతరులనుగూడ వీరు తమతో జత చేర్చుకొనవచ్చును. వీరు కనీసము రు. 1000/-లైనను ఏప్రిల్ నెలాఖరులోగా వసూలుచేయ ప్రార్థితులు.

శ్రీయుతులు:— గా. హరిసర్వోత్తమరావుగారు
,, భూపతిరాజు తిరుపతిరాజుగారు (కుముదవల్లి, భీమవరంపోష్టు)
,, యర్రా చంద్రరావుగారు (ఉప్పులూరు, ఉండి పోష్టు)
,, తటవర్తి బాపిరాజుగారు (ఉండిపోష్టు)
,, కూనపరాజు పెదరామరాజు ,,
,, వేగేశన సూరపరాజుగారు (పాండువ్వ)
,, అడవికొలను సూరయ్యగారు (నిడమర్రు)
,, అయ్యంకి వెంకటరమణయ్యగారు
,, పాతూరు నాగభూషణంగారు (పెదపాలెం)
,, తాడిమేటి కుటుంబశాస్త్రిగారు (నిడదవోలు)

శ్రీకుటుంబశాస్త్రిగారు సమావేశకర్తగా నేర్పరుపబడిరి. మొదటి సమావేశము ఈ నెల 30 వ తేదీన "ఉండి" సమీపమున ఉప్పులూరియందు జరుపుటకునిశ్చయించబడినది.

V. ధాతసంవత్సరాదినాడు ఆంధ్రదేశములోని అన్ని పల్లెలలోను పట్టణములలోను ఆంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకతను గూర్చి తగు ప్రచారముగావించి, రాష్ట్రసంసిద్ధికి కృషి చేయుటకు దీక్షాబద్ధులను గావించుటకు, గ్రంథాలయములవారును ఈయుద్యమాభిమానులెల్లరును తగుపూనికతో "ఆంధ్రోద్యమదివసము"ను దిగ్విజయముగా జరిపించవలెనని ఈ సభవారు కోరుచున్నారు.

VI. ఈ సంఘముయొక్క కార్యక్రమమును ఈ క్రిందవివరించిన శాఖాసంఘములచే నిర్వహించుటకు తీర్మానించడమైనది. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘపు అధ్యక్షుడును కార్యదర్శియు అన్నిశాఖలలోను అధికారరీత్యా సభ్యులుగానుండగలరు.

### 1. గ్రంథభాండాగారికుల తరిబీతుశాఖ.

అధ్యక్షులు:— శ్రీ అర్. జనార్దనంనాయుడుగారు
కార్యదర్శి:— శ్రీ పాతూరి నాగభూషణంగారు
సహాయకులు:— శ్రీ అబ్బూరి రామకృష్ణరావుగారు
,, పుణ్యమూర్తుల రాజశేఖరంగారు
,, జటావల్లభుని పురుషోత్తంగారు

ఈశాఖ చేయవలసినపనులు:
i ప్రణాళిక నేర్పరచుట
ii. పాఠ్యపుస్తకములను ఆంధ్రమున తయారు చేయుట
iii. తరిబీతుతరగతులను నిర్వహించుట

### 2. గ్రంథాలయోద్యమప్రచారకశాఖ

అధ్యక్షులు:— శ్రీ శరణు రామస్వామి చౌదరిగారు
కార్యదర్శి:— వావిలాల గోపాలకృష్ణయ్యగారు
ఈశాఖ చేయవలసిన పనులు:
i. ప్రచారమునకు అవసరమైన కరపత్రములను తయారుచేయుట, పంచిపెట్టుట.
ii ప్రచారమునకు అనువైనమార్గములను అన్వేషించి ఆచరణలో పెట్టుట, యాత్రలను నిర్వహించుట.

### 3. గ్రంథనిర్వాచనశాఖ (Book Selection)

అధ్యక్షులు:— శ్రీ జటావల్లభుని పురుషోత్తంగారు
సభ్యులు:— శనివారపు సుబ్బారావుగారు (కార్యదర్శి)
,, మంగిపూడి పురుషోత్తమశర్మగారు
ఈశాఖ చేయవలసినపనులు:
i గ్రంథాలయములు తెప్పించుకొనతగిన 1000-500-100 గ్రంథములపట్టికలను తయారు చేయుట,
ii ప్రత్యేకవిషయములనుగూర్చిన గ్రంథములపట్టికలను తయారుచేయుట.
iii. అవసరమైన ఇతరపట్టికలను తయారు చేయుట.

### 4. ఆంధ్రదేశ గ్రంథాలయ చరిత్రశాఖ.

అధ్యక్షులు:— శ్రీ గా. హరిసర్వోత్తమరావుగారు
కార్యదర్శి:— జటావల్లభుని పురుషోత్తంగారు
ఈశాఖ చేయవలసినపని,
ఆంధ్రదేశ గ్రంథాలయ చరిత్రలను తయారుచేయుట

### 5. సారస్వత పరీక్షశాఖ:

అధ్యక్షులు:- శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు
కార్యదర్శి:- ,, ఉన్నవ లక్ష్మీనారాయణగారు
స. కార్యదర్శి:- ,, మందలపర్తి ఉపేంద్రశర్మగారు
ఈశాఖ చేయవలసినపని:
సారస్వతమునందు పరీక్షలను నిర్వహించుట.

### 6. సేవాశాఖ

అధ్యక్షులు:— శ్రీ మారేపల్లి రామచంద్రశాస్త్రిగారు
కార్యదర్శి:— మల్లెల శ్రీరామమూర్తిగారు
ఈశాఖచేయవలసినపని:- సేవాసంఘ సభ్యులయొక్క నివేదికలను తెప్పించి ప్రచురించుట.

7. గ్రంథాలయ సర్వస్వ ప్రకటనశాఖ

గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారు
అయ్యంకి వేంకటరమణయ్యగారు } సంపాదకులు

ఈశాఖయొక్క ప్రత్యేకనిబంధనలు:

1. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘపక్షమున పత్రికను ప్రకటించవలెను.
2. దీనిలెక్కలను ప్రత్యేకముగ నుంచవలెను.
3. ఆంధ్రదేశ గ్రంథాలయ సంఘసభ్యులలో రు 3 ల చందానిచ్చువా రందరికి ఈ పత్రిక ఉచితముగా పంపవలెను.
4. ఆంధ్రదేశగ్రంథాలయసంఘమునకు రు 3 లకు తక్కువ కాని చందాయిచ్చు ప్రతిసభ్యు డొక్కొంటికి గ్రంథాలయసర్వస్వశాఖకు కర్చులకుగాను రు 2 లు జమ కట్టుచుండవలెను.
5. ఈ శాఖకు సంబంధించిన అచ్చు, ప్రకటన, ఉద్యోగుల నేర్పరచుట, జమాకర్చులు చేయుట మొదలగు అన్నిఏర్పాటులువగైరాలు యావత్తు ఈ శాఖవారే నిర్వహించవలెను.
6. ఈ శాఖయొక్క కర్చులకుగాను ఆంధ్రదేశగ్రంథాలయ సంఘము వారు సంవత్సరమునకు రు 600 లు ప్రత్యేకము విరాళముగ జనరల్ ద్రవ్యములోనుండి యిచ్చుచుందురు.
7. పైని వివరించిన రు 600 లును, ప్రతిసభ్యునకు గ్రంథాలయ సర్వస్వము పంపుటకు ఇచ్చు రు 2 లు, ప్రకటనద్రవ్యము, ఇందునకు ఇచ్చుప్రత్యేకవిరాళములు ఈ శాఖయొక్క ఆదాయము.
8. గ్రంథాలయ సర్వస్వమునకు వచ్చుద్రవ్యములో మిగిలినది ఈపనికై ప్రత్యేకనిధిగా ఉంచవలెను.
9. ఈ శాఖాసభ్యుల నిర్ణయము ననుసరించి ఈశాఖవారు తమలోనివారికిగాని, ఇతరులకుగాని గౌరవభృతుల నీయవచ్చును.
10. అవసరమునుబట్టి ఉచితముగా పంపుపత్రికలను ఈ శాఖవారే నిర్ణయింపవచ్చును.

గా. హరిసర్వోత్తమరావు, అధ్యక్షులు
10—3—1936

ఓమ్.

# బెజవాడ నగర గ్రంథాలయ సంఘము, బెజవాడ.

బెజవాడనగర గ్రంథాలయసంఘ చతుర్థ వార్షికోత్సవము ది 8-3-36 ని, బెజవాడ రామమోహన ధర్మ గ్రంథాలయభవనమున మద్రాస్ మేయరు జనాబ్ అబ్దుల్ హమీద్‌ఖాన్ B. A. M. L. C. గారి యాజమాన్యమున జరిగినపుడు కార్యదర్శి మల్లెల శ్రీరామమూర్తిగారు చదివిన నివేదిక.

నేటికాలమున ప్రజల విజ్ఞానాభివృద్ధికి గ్రంథాలయము లత్యంత సహకారముగ నున్నవని ఎల్లరంగీకరించిన విషయము. భారతవర్షమున గ్రంథాలయోద్యమము దినదినాభివృద్ధి గాంచుచున్నది. అందు ఆంధ్రదేశము ఇతరరాష్ట్రములకంటె ముందంజ వేయుచున్నది. ఆంధ్రదేశగ్రంథాలయ సంఘముద్వారా గ్రంథాలయోద్యమము తెనుగునాట వృద్ధిగాంచుచున్నది. జిల్లా సంఘములు, తాలూకా సంఘములు ఏర్పడి పల్లెలలో ప్రచారము చేయుచూ ప్రజల విజ్ఞానమును పెంపొందజేయుచున్నవి. అట్లేపెద్దనగరములలోకూడ ప్రత్యేకనగర గ్రంథాలయసంఘములు స్థాపింపబడి గ్రంథాలయోద్యమాభివృద్ధిచేయు టావశ్యకమైయున్నది. ఆకారణముననే ౧౯౩౨ వ సంవత్సరమున బెజవాడనగరమున ఆంధ్రదేశ గ్రంథాలయసంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ అయ్యంకి వేంకటరమణయ్య పంతులుగారిచే ఈ సంఘము స్థాపింపబడి యథాశక్తిని పని చేయుచున్నది. ఈ సంఘమును స్థాపించుటలో గల ముఖ్యోద్దేశములు.

౧ బెజవాడనగరమందుగల వివిధ గ్రంథాలయములకు, సంఘములకు ఐక్యభావము కలుగజేసి సమీకరణము చేయుట.

౨ బెజవాడనగరమందుగల అన్నిగ్రంథాలయములలోని పుస్తకములకు సంయుక్తగ్రంథ విభజనపట్టికను తయారుచేసి అన్నిగ్రంథాలయములలో నుంచి చదువరులకు సౌకర్యము కలుగజేయుట.

3. సంచారశకటముల ద్వారాను, మాజిక్ లాంతరు ఉపన్యాసముల ద్వారాను వయోజనులకు గ్రంథాలయములద్వారా విజ్ఞానముకలుగజేయుట.

౪. రిజిస్టరు కాని గ్రంథాలయములను, సంఘములను రిజిస్టరు చేయించుటకు యత్నించుట. గ్రంథాలయ పరిపాలకులకు గ్రంథాలయాభివృద్ధికై సలహాలనొసంగి ఉద్యమమును అభివృద్ధి చేయుట.

ఈ కార్యములు చక్కగ జరుగుటకుగాను యీసంఘము స్థాపించబడినది. ఈ సంఘమువారి కృషివలన కొన్ని గ్రంథాలయములు రిజిస్టరు చేయబడినవి. సంయుక్త గ్రంథములపట్టిక కొఱకు ప్రయత్నములు చేయబడుచున్నవి. సాధ్యమైనంత త్వరలో ప్రకటించుటకు తోడ్పడవలెనని గ్రంథాలయసంఘములవారిని కోరుచున్నాము. బెజవాడ నగరమున యిప్పటికి ౨౨ గ్రంథాలయములు గలవు. వాటివివరము లుదహరించుచున్నాను.

౧ శ్రీరామమోహన ధర్మ గ్రంథాలయము
౨ భారతమహిళాసంఘ గ్రంథాలయము
3 శ్రీరామమోహన ధర్మగ్రంథాలయ స్త్రీ శాఖ
౪ దివ్యజ్ఞాన సమాజగ్రంథాలయము
౫ ఆంధ్రజంఖానాక్లబ్ గ్రంథాలయము
౬ రైల్వేఇన్స్టిట్యూటులైబ్రరీ (ఇండియన్సు)
౭ రైల్వేఇన్స్టిట్యూట్లైబ్రరీటు,యూరపియన్సు
౮ హిందీమహావిద్యాలయ గ్రంథాలయము
౯ శ్రీభ్రమరాంబా మల్లేశ్వరాంధ్ర గ్రంథాలయము
౧౦ శ్రీవెలిదిండ్ల హనుమంతరాయ గ్రంథాలయము
౧౧ ప్రకృతి ఉచిత పఠనాలయము
౧౨ యువతీజన ధర్మగ్రంథాలయము
౧3 భారతీభువన పుస్తకభాండారము
౧౪ శంకరగ్రంథనిక్షేపము
౧౫ రామచంద్రరాయపుస్తకభాండారము
౧౬ కార్మికగ్రంథాలయము
౧౭ మాడపాటి వేంకటేశ్వరరావుగారి టౌనుహాలు గ్రంథాలయము
౧౮ హిందూహైస్కూలు గ్రంథాలయము
౧౯ మునిసిపల్ హైస్కూలుగ్రంథాలయము
౨౦ మహమ్మదీయ గ్రంథాలయము
౨౧ ఎంగుమెన్సు మహమ్మడన్ అసోసియేషన్ లైబ్రరీ
౨౨ శ్రీ శంకరమఠాలయ విద్యాపోషక సంఘ గ్రంథాలయము

ఇందు నగరమున ౧౪, గవర్నరుపేట గాంధినగరములలో ౮ గ్రంథాలయములుగలవు. ఇందు దేవాలయ సంబంధమయిన మత విషయక గ్రంథాలయములు 3, స్త్రీలకు సంబంధించినవి3, కార్మికులకై కొత్తపేటలో౧, మహమ్మదీయులకు౨, రైల్వే సర్వీస్ ఉద్యోగులకు ౨, మునిసిపల్ గ్రంథాలయము ౧, హైస్కూళ్లలో 3, క్లబ్బుల యాజమాన్యమున ౨, దివ్యజ్ఞాన సమాజ పక్షమున ౧, హిందీ విద్యాలయపక్షమున ౧, ప్రకృతి ప్రచారమునకై ౧, సార్వజనిక గ్రంథాలయములు ౨, వైశ్య వర్తకుల యాజమాన్యమున ౧, మొత్తము ౨౨ గ్రంథాలయములు యీవిధముగా వివిధపక్షములచే స్థాపింప

బడి ప్రజల కుపయోగపడుచున్నవి. వీటిని నగర వాసులు ఉపయోగపరచుకొని విజ్ఞానము నభివృద్ధి చేసుకొనవచ్చును. ఈ ౨౨ గ్రంథాలయములలో 3 కి తప్ప మిగిలిన ౧౯ గ్రంథాలయములకు స్వంతభవనము లున్నవి. ఈ గ్రంథాలయము లన్నిటిలోగల పుస్తకములు వివిధ భాషలలో ఇరువది వేలకు మించియున్నవి. వాటి కిమ్మతు ౨౫ వేల రూపాయిలు దాటియున్నది. గ్రంథాలయములకున్న భవనముల విలువ లక్ష యేబది వేలరూపాయి లుండవచ్చును. ఈగ్రంథాలయములన్నిటిలో నగటున రోజుకు సభ్యులుగాక ౧౦౦౦ మంది చదువుకొనుచున్నారు. ఇన్ని గ్రంథాలయములు బెజవాడలో గలవని చాలా మందికి తెలియదు. బెజవాడలోని కొన్ని గ్రంథాలయముల యభివృద్ధికి శ్రీ॥ శ్రీ॥ మాడపాటి వేంకటేశ్వరరావు పంతులు, బ్రహ్మశ్రీ కవుతా సూర్యనారాయణరావు, శ్రీనడిమి తిరువూరు జమీందారు, శ్రీ చల్లపల్లి రాజా, శ్రీ మీర్జాపురం రాజాగార్లు పెద్దమొత్తములు ధర్మముల నొసంగి వారి ఔదార్యమును వెల్లడించిరి. అట్లే శ్రీమంతులు గ్రంథాలయములకు ధర్మముల నొసంగి ప్రజలకు విద్యాదానమొసంగి దేశకల్యాణమునకు తోడ్పడు టావశ్యకము.

బెజవాడ నగరమున గల గ్రంథాలయముల చరిత్రలను సంపాదించి గ్రంథరూపమున ప్రకటించుటకు సంకల్పించితిమి. ప్రయత్నము చేయుచున్నాము. ఈ సంవత్సరాంతములోపల నగర గ్రంథాలయముల చరిత్రను ముద్రించి ప్రకటించగలమని నమ్ముచున్నాము. అందులకై మాకు తోడ్పడవలెనని గ్రంథాలయ పాలకులను ప్రార్థించుచున్నాము. బెజవాడనగరము ఆంధ్రదేశమునకు మధ్యనున్నది. నగరము దినదినాభివృద్ధి యగుచున్నది. దీనిని దాదాపు ౨౫ పల్లెటూళ్ల సముదాయముతో పోల్చవచ్చును. ఏలనన నగరమున మారుమూల కార్మికులు నివసించు ప్రతిభాగమును ఒక్కొక పల్లెటూరుగ నున్నది. అట్టిచోట్ల నివసించు ప్రజలకు విద్యాగంధముగాని, జ్ఞానసముపార్జన మార్గములుగాని బొత్తిగ లేకున్నవి. పాశ్చాత్యదేశములందు జరుగుచున్న గ్రంథాలయోద్యమాభివృద్ధి మహత్తరమైనది. ఆదేశములందలి ముఖ్యముగ అమెరికా, ఇంగ్లండు, రష్యాదేశముల యందలి జనులలో జ్ఞానవిహీనతచే నష్టపడువాడెవ్వడును ఆయాదేశములలోనుండకూడదని ఆదేశపు ప్రభుత్వములు గ్రంథాలయోద్యమ ప్రచారమూలమున పాటుపడుచున్నవి.

అరువదిఐదు వేలకు మించిన జనాభాగలిగిన బెజవాడ నగరమునకు ౨౨ గ్రంథాలయములు పనిచేయుచుండుట మిక్కిలి సంతోషదాయకమైన విషయమే. మద్రాసునగరమును మినహాయించిన యీ రాజధానియందలి గల మరి ఏయితర పట్టణమునను ఇన్ని గ్రంథాలయములు లేవనిచెప్పుటకు గర్వపడుచున్నాము. అయితే యింతమాత్రమున తృప్తిపడకూడదు. ఏలనన మన ఈ గ్రంథాలయములును, ఇతర పట్టణములలోని గ్రంథాలయములును చదువుకొనుటకుశక్తికల్గిన కొలదిమందిజనులకుమాత్రమే ఉపయోగపడుచున్నవి. వారైననుపూర్తిగా వానినుపయోగించుకొనరు. కాన వారందరునుకూడ గ్రంథాలయములకేగి చదువుకొనుటకు మనము ప్రయత్నము చేయవలసియున్నది. నూటికి ౯౦ మంది నిరక్షరకుక్షులైయున్న జనాభాలో ఎక్కువమంది గ్రంథాలయసౌకర్యము, విద్యాప్రచారములేక జ్ఞానవిహీనులైయుండుట మిక్కిలి శోచనీయము. ఈనగరమునగల కార్మికులపేట

లన్నిటిలో రామభజన మందిరములు వెలసినవి. అట్టిభజన మందిరములలో సరస్వతీదేవిని కూడ స్థాపించి ఆమె ప్రసాదమును చదువురాని వారికి కూడ అందుబాటులో నుండునటుల చేయుటకు రాబోవు సంవత్సరమున మన మందరము శక్తి వంచనలేక పాటుపడవలసి యున్నది. ఇందుకొరకు సంచార గ్రంథాలయ శకటము, ఉత్సాహవంతులగు ౨౫ మంది గ్రంథాలయ సేవకులు, అత్యంతావసరమై యున్నారు. ముందు సంవత్సరము నాటికి చాల యభివృద్ధికరముగ పనిజరుగుటకు తోడ్పడవలెనని నగరవాసులను ప్రార్థించుచున్నాము. పురపాలక సంఘాధ్యక్షులగు కవుతా సుబ్బారావు పంతులుగారు మా సంఘమునకు అధ్యక్షులై యున్నారు. వారి యాజమాన్యమున చాల పనిచేయగలమని నమ్ముచున్నాము. ఇంతవరకు యీ సంఘమునకు కార్యదర్శిగనుండి సేవయొనర్చిన శ్రీ అయ్యంకి వేంకటరమణయ్యగారికి వందనము లర్పించుచున్నాము. ఈ వార్షికోత్సవ సభాధ్యక్షత వహించుట కంగీకరించి వచ్చిన ప్రజాసేవకులగు మద్రాసు మేయరు అబ్దుల్ హమీద్‌ఖాన్ సాహేబ్ యం. యల్. సి. గారికి మా సంఘపక్షమున హృదయ పూర్వకమైన వందనము లర్పించుచు విరమించుచున్నాను.

---

# తాడేపల్లిగూడెం తాలూకా గ్రంథాలయసంఘము

(కార్యదర్శి: తేతలి సత్యనారాయణ మూర్తిగారు)

1-4-35 నుండి 19-2-36 వరకు జరిగిన

## కార్యనివేదిక

తాడేపల్లిగూడెం తాలూకా గ్రంథాలయసంఘ కార్యదర్శి శ్రీ తేతలి సత్యనారాయణగారు అహరహము సంఘము తరఫున జరుగుచుండు పనినిగురించి అప్పటికప్పుడు పంపిన కార్యనివేదికలను 1-4-35 నుండి 19-2-36వరకును గల వానిని ఈ క్రింద ప్రకటించితిమి. గ్రంథాలయ కార్యకర్తలు దీనిని జాగ్రత్తగా చదివి తామును కార్యనిర్వహణ వివరములను తెలియజేయుచుందురుగాకయని కోరుచున్నాము. శ్రీ సత్యనారాయణగారి శ్రద్ధను, భక్తిని, కార్యదక్షతను మేము ప్రత్యేకము ప్రశంసింప నవసరములేక వారి నివేదికయే వేనోళ్ల ప్రశంసించుచున్నది.

—సంపాదకులు.

4-4-35: రావులపర్రు శ్రీ వెంకాయమ్మ గ్రంథాలయము సందర్శించి, "పంచాంగశ్రవణం" చేయవలసిన పద్ధతిని గురించియు గ్రంథాలయ పరిపాలనగురించియు ఉపన్యసించితిని.

7-4-35: మాధవరంలో శ్రీభారతిగ్రంథాలయభవనము, జిల్లాబోర్డు అధ్యక్షులు మ.రా.శ్రీ బడేటి వెంకటరామయ్యానాయుడుగారిచే తెరువబడెను.

9 4-35: జగన్నాథపురము శ్రీ మల్లేశ్వర గ్రంథాలయముచూచి, గ్రంథాలయనిర్వాహకులకు కొన్ని ముఖ్య సలహాల నిచ్చితిని.

27-4-35: అనంతపురము పంచాయతీ గ్రంథాలయము చూచి, అభివృద్ధి సూచనను తెలిపితిని.

29-4-35: ఏలూరు యువజనహిందూ సంఘగ్రంథాలయ త్రిదశోత్సవమునకు హాజరైతిని. ప్రొఫెసరు రాధాకృష్ణగారు అధ్యక్షతను అత్యంత జయప్రదముగ జరిగెను.

28-5-35: పెదతాడేపల్లి శ్రీసరస్వతీ గ్రంథాలయము చూచి, రిజష్టరు నూతనముగా తెరిచితిని.

30-5-35: చేబ్రోలు జిల్లాబోర్డు గ్రంథాలయమును చూచితిని. చక్కగ పని చేయుచున్నది.

**6-7-35:** ద్వితీయతాలూకా గ్రంథాలయ మహాసభ శ్రీయుత అయ్యదేవర కాళేశ్వరరావుగారి అధ్యక్షతను, పెంటపాడులో శ్రీనివాస గ్రంథాలయమువారి యాజమాన్యమున అత్యంతజయప్రదముగా జరిగెను. తల్లాప్రగడ ప్రకాశరాయుడుగారు ప్రారంభోపన్యాసమును, మండలపర్తి ఉపేంద్రశర్మగారు, భూపతిరాజు తిరుపతిరాజుగారు, శిరిగికాడిసుబ్బారాయుడుగారువావిలాలగోపాలకృష్ణయ్యగారు, ముదిగంటి జగ్గన్నశాస్త్రిగారు, అయ్యంకి వెంకటరమణయ్యగారు, వితాల వీరభద్రరావుగారు, య. వెం. రత్నంగారు ఉపన్యసించిరి. తరువాత భీమేశ్వరరావుగారు అధ్యక్షులుగను దద్దనాల లక్ష్మీసత్యనారాయణగారు ఉపాధ్యక్షులుగను, తేతలి సత్యనారాయణమూర్తిగారు కార్యదర్శిగను, పుట్టా సుబ్బారావుగారు సహాయ కార్యదర్శిగను యేడుగురు సభ్యులుగను ఎన్నుకొనబడిరి.

(వివరములు ఆంధ్రపత్రిక గ్రంథాలయ సర్వస్వమునందుగలవు.)

**తణిఖీ :-**

తాలూకా గ్రంథాలయ సభ అనంతరము దిగువ గ్రంథాలయములను, ఆయా గ్రామడైరక్టర్లతో చూచితిని. గ్రంథాలయ నిర్వాహకులను సమావేశపరిచి ఆంధ్రదైనిక పత్రిక లేనిచోట ఆంధ్రపత్రిక తెప్పించుటయు, చందాదార్లను చేర్పించుటయు, రిజష్టరులేనిచోట రిజష్టర్లు ప్రారంభించుటయు, కొన్నిచోట్ల వార్షికోత్సవములు జరుపుటయు, కొన్నిచోట్ల గ్రంథాలయ పరిపాలనగురించి ముఖ్యసలహాల నిచ్చుటయు జరిగినవి.

26-8-35 బాదంపూడి, బొమ్మిడి
2-9-35 కాగుపాడు
3-9-35 కేశవరము
8-9-35 శారదాగ్రంథాలయము (తా॥గూడెం)
16-9-35 కాకినాడు, పిప్పర, చెరుకుగనుము (రెండు)
18-9-35 నల్లజర్ల
22-9-35 అలంపురము
23-9-35 గణపవరం, సరిపల్లి (రెండు)
1-10-35 వల్లూరు, అర్ధవరం
15 10-35 పెంటపాడు
17-10-35 చేబ్రోలు
25-11-35 పరిమళ్ల, ప. విప్పర్రు, కొమ్మర, యానాలపల్లి
27-11-35 పెదతాడేపల్లి
2-12-35 కాశిపాడు, రాలిపాడు, చింతపల్లి, బోడపాడు
3-12-35 నాబుగుంట

సంవత్సరారంభమున 51గ్రంథాలయములు గలవు. తదుపరి బోడవరం నందమూరులలో నూతనముగా గ్రంథాలయములు తెరువబడినవి. మొత్తము 53 గ్రంథాలయములకు ఇప్పటికి 28 గ్రంథాలయములు తణిఖీ చేసితిని. ఇంకను 25 గ్రంథాలయములు 31-3-36 లోపుగా పూర్తిచేయవలసి యున్నది. ఈ మాసాంతములోపుగా, 1 పడాల 2 మారంపల్లి 3 ఉప్పాకపాడు 4 దరిశపర్రు గ్రామములలో నూతనముగా గ్రంథాలయములు తెరుచుటకు ప్రయత్నములు జరుగుచున్నవి.

తాలూకాలో పంచాయతిబోర్డులున్న 58 గ్రామములకు ఇంతవరకు, 32 గ్రామములలో పంచాయతి గ్రంథాలయములును, 2 గ్రామములలో జిల్లాబోర్డు గ్రంథాలయములును, 5 గ్రామములలో కమిటి గ్రంథాలయములుగలవు. మిగిలిన 19 గ్రామములందలి పంచాయితిబోర్డుల వారిచే గ్రంథాలయములు తెరుచుటకుప్రయత్నములుజరుగుచున్నవి. మిగిలిన గ్రామములలో, గ్రంథాలయములు పెట్టుటకు శక్తిలేమివలన పఠనమందిరములైనను పెట్టుటకు యేర్పాటు చేయబడును. ప్రతిపఠనమందిరముకు దైనిక ఆంధ్రపత్రిక యొకటి తెప్పించబడును,

**ఆంధ్రపత్రిక :-**

ఈతాలూకాలోని గ్రంథాలయములన్నిటికిరు. 18-0-0 రేటున, తాలూకాగ్రంథాలయసంఘ కార్యదర్శి, సిఫారసుతో యిచ్చుట కంగీకరించిరి. దిగువగ్రంథాలయముల వారిచే నూతనముగా ఆర్డరుచేయించితిని.

1 బాదంపూడి
2 అనంతపల్లి
3 రావులపర్రు
4 కృష్ణాయపాలెం
5 తాడేపల్లిగూడెం (స్త్రీల)
6 జల్లికాకినాడ
7 సరిపల్లి

**సోదా :-**

దిగువ గ్రంథములు, పోలీసువారు సోదాచేసి గ్రంథాలయములనుండి తీసుకొని వెళ్లిరి. సెర్చివారంటుకొన్నిచోట్ల లేదు. రశీదులు కొన్నిచోట్ల ఇవ్వలేదు. కొన్నిచోట్ల రాత్రి సోదా చేసిరి. కొన్నిచోట్ల పట్టుకొనివెళ్లినగ్రంథములు తిరిగి యిచ్చిరి.

సోదాచేసిన గ్రంథాలయములు:-

1 రామదాసుగ్రంథాలయం (రాచెర్ల)
2 నాగేశ్వరగ్రంథాలయం (గణపవరం)
3 జిల్లాబోర్డుగ్రంథాలయం (తాడేపల్లిగూడెం)
4 శ్రీనివాసగ్రంథాలయం (పెంటపాడు)
5 రామమోహనగ్రంథాలయం (వుంగుటూరు)

ఈవిషయమును గూర్చిపంపిన సర్క్యూలరుకు ఇంకా కొన్నిగ్రంథాలయములనుండి జవాబు రాలేదు.

సోదాచేసి తీసుకొని వెళ్లిన గ్రంథములు:-

1 గాంధీ నీతిమంజరి
2 రాజనీతిసారము
3 మేజనీ జీవితము
4 ఝాన్సీ లక్ష్మీబాయి
5 వినాయకసావర్కారు
6 బార్డోలీవిజయము

(1–6) ము. జగన్నశాస్త్రి

7 గ్రామపునర్నిర్మాణము. శ॥ సుబ్బారావు
8 గవర్నమెంటు ,,
9 భారత స్వరాజ్యయుద్ధము గా॥ సూర్యనారాయణ
10 ఫ్రెంచి స్వాతంత్ర్యవిజయము.
11 స్వరాజ్యదర్పణము
12 కలియుగప్రహ్లాద
13 అల్లూరి సీతారామరాజు
14 స్వరాజ్యచక్రము
15 సత్యాగ్రహ చరిత్రము

డిస్ట్రిక్టు ఎడ్యుకేషనలు ఆఫీసరుగారి అంగీకారము:- 600 గ్రంథములజాబితా, గ్రామగ్రంథాలయముల నిమిత్తం వ్రాసి జిల్లా ఎడ్యుకేషనలు ఆఫీసరుగారికి అంగీకారము నిమిత్తముపంపగాఇందుకొన్ని గవర్నమెంటువారునిషేధించియుండని (Proscribe చేయని) గ్రంథములనువారుఅప్రువు చేయలేదు. వాటిజాబితాఒకటి క్రిందటినెల గ్రంథాలయ సర్వస్వమునందు ప్రకటింపబడినది.మరియు,గ్రంథాలయములవారిఅంగీకారమునిమిత్తము పుస్తకములజాబితా పంపగా, ఒకపుస్తకము ఒకచోట అప్రుచేయుటయు, మరియొకచోట చేయకపోవుటయు జరుగుచున్నది. గవర్నమెంటు వారిచే నిషేధింపబడిన పుస్తకముల పట్టికను మాసమునకొకసారిగాని, సాలునకొకసారిగాని పంపవలసినదని కోరగా అట్టిది వారివద్దనే లేదని తెలవిచ్చిరి.

వార్షికోత్సవములు:—

9-11-35 వ తేది వల్లూరు గ్రంథాలయమునకు, 16-11-35 వ తేది తాడేపల్లిగూడెం శారదాగ్రంథాలయమునకు వార్షికోత్సవములు జరిగినవి. వివరములు ఇందు జతపర్చుచున్నాను.

నేను 6-7-35 వ తేదీని, కార్యదర్శిగా ఎన్నుకొనబడితిని. నాటినుండి నేటివరకు, తాలూకాలో జరిపిన కృషినివ్రాసితిని. ఇకముందు ప్రతినెలకానెల నివేదికలు వ్రాయుచుందును.

## 1935 డిశంబరునివేదిక

### పాతగ్రంథాలయములు

ఈనెలలో 17 గ్రంథాలయముల సందర్శించి ఆయా గ్రంథాలయములయజమానులకు తగుసలహాల నిచ్చితిమి. రిజష్టరు లేనిచోట రిజష్టరు తెరుచుటయు, పత్రికలేనిచోట దైనిక ఆంధ్రపత్రిక తెప్పించుటయు, పంచాయితీబోర్డుల సమావేశపర్చి, గ్రంథాలయము 1 కి 500 లు సేంక్షను చేయించుటయు, సాలునకు రు 1-0-0 చొ॥న గ్రంథాలయములకు సభ్యులను చేర్చుటయు జరిగినది. ఈ సంచారములో ఆ యా ఫిర్కాడైరక్టర్లు, ఇతర గ్రంథాలయోద్యమాభిమానులు నాకు తోడ్పడిరి. అందు వివరములు దిగువ నుదహరింపబడినవి.

2—12—35

1 కాశిపాడు (పంచాయితీ గ్రంథాలయము)
2 చింతపల్లి (భీమేశ్వరగ్రంథాలయము)
3 బోడపాడు (పంచాయితీ గ్రంథాలయము)
4 రావిపాడు (రామలింగేశ్వర గ్రంథాలయము)

ఫిర్కాడైరెక్టరు, పెన్మత్స సూర్యనారాయణరాజు గారుకూడ పైగ్రామములకు వచ్చిరి. 26 మైళ్లు సైకిళ్లమీద వెళ్ళియుంటిమి.

3-12-35

5 నాచుగుంట (గంగాదేవి గ్రంథాలయము)

9-12-35

6 కోరుమిల్లి (సరస్వతి గ్రంథాలయము)
7 మీనవిల్లూరు (పంచాయితీ గ్రంథాలయము)
8 ,, (టక్కునగ్రంథాలయము)

ఈ రెండుగ్రామములు పుట్టా సుబ్బారావుగారు (సంయుక్తకార్యదర్శి) పెన్మత్స సూర్యనారాయణరాజుగారు (ఫిర్కాడైరెక్టరు) ధూ. సత్యనారాయణగార్లతో వెళ్ళియుంటిని. మొత్తము 26 మైళ్ళు సైకిల్సుమీదనే వెళ్ళియుంటిమి. దారిలో భద్రిరాజుకొండేపాడు అను గ్రామ

మునకు వెళ్ళి, గ్రామస్థులకు గ్రంథాలయ స్థాపనయొక్క ఆవశ్యకతను తెలిపితిమి. గ్రామస్థులు త్వరలో గ్రంథాలయము తెరుచుటకు వాగ్దానము చేసిరి.

16-12-35

9 రావులపర్రు (వెంకాయమ్మ గ్రంథాలయము)
10 రాచూరు (వివేకానంద గ్రంథాలయము)
11 దేవరగోపవరం (పంచాయితీ గ్రంథాలయము)
12 పెదనిండ్రకొలను (గౌరీశంకర గ్రంథాలయము)
13 ,, (శ్రీరామకృష్ణ గ్రంథాలయము)

ఈ గ్రామములు పుట్టా సుబ్బారావు, నిడమర్తి అశ్వనీకుమారదత్తు, అడవికొల్లు సూరయ్యగార్లతో చూచితిని. కొంతదూరము రైలు, కొంత సైకిలు, కొంతనడకవలన, మొత్తము 50 మైళ్లు సంచారము.

18-12-35

14 కృష్ణాయపాలెం (పంచాయతి గ్రంథాలయము)

24-12-35

15 అడవికొలను (పంచాయితి గ్రంథాలయము)
16 చేనమిల్లి (విజ్ఞాన ప్రచారిణి గ్రంథాలయము)
17 నిడమర్రు (లక్ష్మీనారాయణ గ్రంథాలయము)

ఈ గ్రామములు అడవికొలను సూరయ్య నిడమర్తి అశ్వనికుమారదత్తుగార్లతో తిరిగితిని. మేము 42 మైళ్లు (సైకిలు, జట్కా, కారు, నడక) వెళ్లితిమి. ఈ సంచారములో (17 గ్రంథాలయములకు) కార్యదర్శి, ఫిర్కాడైరెక్టర్లు స్వంతఖర్చులతో ప్రయాణము చేసిరి.

నూతనగ్రంథాలయములు:—

గ్రంథాలయయాత్ర ముగింపు తేదికి ఉన్న 51 గ్రంథాలయములుగాక నూతనముగా 4 గ్రంథాలయములు తెరువబడెను. అందు, ఈ నెలలో, పడాల, ముద్దాపురము గ్రామములలో నూతనగ్రంథాలయములు తెరువబడెను.

పడాల:—

శ్రీరామా గ్రంథాలయ మనుపేర, శ్రీయుత దామోజిపురపు నరశింహారావు పంతులుగారి అధ్యక్షతను, 14-12-35 వ తేదిని తెరువబడెను. శ్రీయుత, ద॥ల॥సత్యనారాయణయ్యగారు ప్రారంభోపన్యాసముగావించిరి. క॥ చినగంగరాజుగారు, పె॥ సూర్యనారాయణరాజుగారు, మట్టా సుబ్బారావుగారు, తే॥ సత్యనారాయణగారు ఉపన్యసించిరి. పంచాయతిబోర్డుఅధ్యక్షులు, కాముశెట్టి వెంకట నరసయ్యగారు, పంచాయతీబోర్డునుండి 50 రూపాయలు సేంక్షను చేసిరి. ఆంధ్రపత్రికకు (దైనిక) వెంటనే ఆర్డరు ఇవ్వడమైనది. 21 మంది సభ్యులుగ చేరిరి. డా॥ నరశింహారావు పంతులుగారు గ్రంథాలయమునకు స్థలము ఉచితముగ నిచ్చిరి.

ముద్దాపురం

ఈగ్రామములో గ్రామ పంచాయతీ బోర్డువారిచే 28-12-35 వ తేది మ.రా. శ్రీ కోటగిరి అప్పారావుగారి అధ్యక్షతను (జిల్లాబోర్డు మెంబరు) శ్రీ సీతారామ గ్రంథాలయము తెరువబడెను. తురగా వెంకట్రామయ్యగారు ప్రారంభోపన్యాసము నిచ్చిరి. గూడపల్లి నరశింహారావుగారు, ద॥ల॥ సత్యనారాయణయ్యగారు, గ॥ బాలకృష్ణమూర్తిగారు, కలిదిండి గంగరాజుగారు, తే॥ సత్యనారాయణమూర్తిగారు ఉపన్యసించిరి. 80 పుస్తకములు గ్రామస్థులు ఇచ్చిరి. 15 మంది సభ్యులు చేరిరి. దైనిక ఆంధ్రపత్రికకు ఆర్డరు ఇవ్వబడెను. ద్రవ్యములేనికారణమున పంచాయతిబోర్డువారు ప్రస్తుతం 25 రూపాయలు మాత్రమే సేంక్షను చేయగలిగిరి.

గ్రంథాలయకార్యనిర్వాహక సంఘము;—

ఈ నెల రెండుసార్లు, పడాల, ముద్దాపురము గ్రామములలో సమావేశ మయ్యెను (14, 28 తేదీలయందు). మొదటి సమావేశమునకు 5 గురును, రెండవ సమావేశమునకు 5 గురును డైరక్టర్లు హాజరైరి. 3 సమావేశములకు వరుసగా రానివారి స్థానే, నూతనసభ్యుల నెన్నుకొనుటయు, ఫిర్కాడైరెక్టర్లు వారమున కొకసారియైనను వారిఫిర్కాలలో గ్రంథాలయములను చూచుచు డయిరీలను వారి ఫిర్కాలోని గ్రంథాలయనివేదికలను మాసమున కొకసారి పంపుటకును. కార్యనిర్వాహక సభలు నెలకొకసారి సమావేశపర్చుటకును అంగీకరించుచు తీర్మానములు గావింపబడెను.

గవర్నమెంటు గ్రాంటులు:—

ఈ తాలూకాలో జిల్లాబోర్డు వారిచే నిర్వహింపబడుచున్న
తాడేపల్లి గ్రంథాలయమునకు 114-0-0ను
మాధవరం గ్రంథాలయమునకు 114-0-0ను
వుంగుటూరు పెదనిండ్రకొలను గ్రామములందు రిజిస్టరు కాబడిన శ్రీరామకృష్ణ శ్రీసదాశివరెడ్డి గ్రంథాలయములకు (సంఘం) చెరియొక పాతిక రూపాయలు సేంక్షను కాబడినది.

## 1936 జనవరినెల నివేదిక

1-1-36

1 వుంగుటూరు (శ్రీరామమోహన గ్రంథాలయం)
2 ,, (శ్రీ సదాశివరెడ్డి గ్రంథాలయం)
3 తర్లాపురం (శ్రీ రామ గ్రంథాలయం)

12-1-36

4 నవాబుపాలెం (శ్రీ పంచాయతి గ్రంథాలయం)
5 మాధవరం (శ్రీ భారతి గ్రంథాలయం)
6 జగన్నాథపురం (శ్రీ మల్లేశ్వర గ్రంథాలయం)
7 దండగర (శ్రీ కృష్ణాగ్రంథాలయం)

14-1-36

8 రాచెర్ల (శ్రీ రామదాసు గ్రంథాలయం)

30-1-36

9 తాడేపల్లిగూడెం (జిల్లాబోర్డు గ్రంథాలయం)

పైగ్రంథాలయములు, ఆయా గ్రామ డైరెక్టరతో, పైతేదీలను చూచితిని. తర్లాపురం గ్రంథాలయము గ్రామముతోబాటు పరశురామప్రీతి అయినది. మరల పునరుద్ధరణ చేసితిమి. మాధవరం గ్రంథాలయము జిల్లాబోర్డువారి పరిపాలనలోయున్నది. ఇటీవల ఒకనౌకరునుకూడ సేంక్షను చేసిరి. తాడేపల్లిగూడెం గ్రంథాలయమునకు సలహాసంఘమును చందాదారులనుండి ఎన్నుకొనుటను జిల్లాబోర్డు ప్రెసిడెంటుగారికి వ్రాసితిని.

ఈమాసములో నూతన గ్రంథాలయములు తెరువలేదు. సంఘ సమావేశములు జరుగలేదు. తాలూకాలోని 55 గ్రంథాలయములకు ఇప్పటికి 51 గ్రంథాలయములు తనిఖీ చేసితిమి. మిగిలిన 4 గ్రంథాలయములు తనిఖీచేయుటయు నూతన గ్రంథాలయములు మరికొన్ని తెరుచుటయు ఫిబ్రవరి మార్చి నెలలలో జరుగును. ఏప్రియల్ మొదటివారములో తృతీయ గ్రంథాలయమహాసభ జరుపుటకు ప్రయత్నించెదము. ఈసంవత్సరము గ్రంథాలయయాత్ర యేర్పాటుచేయు నుద్దేశములేదు.

## 1936 ఫిబ్రవరినెల నివేదిక

5-2-36:-

1 అనంతపల్లి:- శేషాద్రిగ్రంథాలయమును జూచితిని. రిజష్టర్లు సక్రమముగా వ్రాయబడుచున్నవి. ఆంధ్రదైనిక పత్రిక వచ్చుచున్నది. కొందరు నూతనచందాదారులను చేర్పించి, కార్యనిర్వాహకులకు కొన్ని సలహాల నిచ్చితిని

2 చోడవరం:- "శ్రీమోతేరాజా" గ్రంథాలయము చూచితిని. దానికి మోతే గంగరాజుగారు రాజపోషకులుగ నుండి ఆర్థికముగ తోడ్పడుచున్నారు. 1-7-35 వ తేదీని, నూతనముగా, పంచాయితీబోర్డువారిచే తెరువబడి, ప్రత్యేక భవనమున నుంచబడినది. రిజష్టర్లు వ్రాయబడుచున్నవి. ఆంధ్రదైనిక పత్రిక వచ్చుచున్నది. పంచాయితీబోర్డు జీతముతో భాండారకుని నియమించిరి.

19.2 36:-

3 నందమూరు:- ఇదియొక నూతనగ్రంథాలయం. 3-7-35 వ తేదీని తెరువబడి, రు2000లు విలువగల స్వంత భవనములో నర్సారావుపేట, నిడదవోలు, జమీందారు గారి రాజపోషణతో, గ్రామమందలి వెలమవారు (మొఖాసదారుల) యాజమాన్యమున, ఆదర్శముగా పని చేయుచున్నది. బీరువాలు మున్నగుసామగ్రి (committee library) అంతయు గలదు.

4 మారంపల్లి:- ఇది యొకనూతనగ్రంథాలయము. 19-2-35 తేదీని, నాచే శ్రీరామలింగేశ్వరుని పేరట తెరువబడెను. 25 గురు చందాదార్లు చేరిరి. సరిపల్లి వీరభద్రరాజుగారు అధ్యక్షులుగగల సంఘముచే వ్యవహరింపబడుచున్నది. రూ 35-0-0 లు చందాలు వాగ్దానము చేయబడెను. పత్రిక తెప్పించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. రిజిష్టర్లు తెరువబడినవి. సరిపల్లి పెదవెంకట్రాజుగారు గ్రంథాలయభవనమునకుస్థల ముచితముగానిచ్చిరి. ఈగ్రామమువద్ద డీసిలుకారు రైళ్లుకూడ ఆగుచుండుటవలన ఇటీవల ఈగ్రామము ప్రాముఖ్యతవచ్చుచున్నది. గ్రామమున పంచాయితీబోర్డులేదు.

4-3-36 పోతవరం, గ్రామమందలి, బాలసరస్వతి గ్రంథాలయమును చూచితిని, అభివృద్ధి సూచనలు, కార్యనిర్వాహకులకు, తెల్పితిని.

15-3-36 ఉండి సమావేశమునకు హాజరైతిని.

24-3-36 సంవత్సరాది భిక్షలు నిమిత్తము యేడు రూపాయిలు వసూలు చేసితిమి.

28-3-36 ఉప్పకపాడు గ్రామమునందు, గ్రామపంచాయితిబోర్డు వారిచే, శ్రీ శీతారామాంజనేయ గ్రంథాలయము, తెరువబడెను. గ్రామపంచాయితి బోర్డు వారు 50 రూపాయల విరాళము నిచ్చిరి.

షరా:- ఇంతటితో ఈ సంవత్సరమునందు(ద్వితీయమహాసభ జరిగినపిమ్మట) ఈతాలూకాలోని 55 గ్రంథాలయములను జూచి వాటిఅభివృద్ధికి పాటుపడితిమి. ఇక మిగిలిన పోతవరం గ్రంథాలయము 4-3-36 వ తేదీని జూచితిమి. ముందుమాసము నివేదికలో వ్రాయబడును. సంచారము పూర్తి అయినది. యాత్రలో ఆఖరికియున్న 51 గ్రంథాలయములుగాక నూతనముగా, 5 గ్రంథాలయములు తెర్చితిమి. ఏప్రిల్ నెలలో తృతీయసభ గావించి ముందు సంవత్సరము వెనుకబడిన గ్రంథాలయములను గురించి కృషిచేయుటకును, మరికొన్ని నూతనగ్రంథాలయముల తెచ్చుటకును నుద్దేశించి యున్నాము.

# హిందూ యువజన సంఘము, ఏలూరు.

## ప్రారంభము

అల్పారంభము లోకప్పుడు మహోన్నతకార్యనిర్వహణమునకు హేతుభూతములగు విధమును హిందూయువజన సంఘముయొక్క కడచిన ముప్పదియేండ్ల చరిత్రము విపులముగ విశదపరుపగలదు నేడు ఆకర్షణీయములగు ఉన్నత సౌధములలో నొకటిగా నొప్పారు దివ్యభవనముతో, రాజధానియం దగ్రస్థానము వహించిన గ్రంథాలయములలో నొకటియై యొప్పు గొప్ప గ్రంథభాండాగారమును గలిగియు జ్ఞానవితరణమునం దపారమైన ఖ్యాతి నార్జించి పాలక పాలితుల యామోదమునకు పాత్రమగుచున్న యీ హిందూయువజనసంఘము, మొట్టమొదట దక్షిణపువీధియం దొక చిన్నమేడలో ఏలూరు కరణము కీ. శే. దుగ్గిరాల సత్యనారాయణమూర్తిగారివలన 1904వ సం॥ సెప్టెంబరు 23 వ తేదీనాడు ఆడంబర రహితముగ నారంభింపబడినది. ఆదిమసంకల్పానుసారము కొంతకాలము వరకు ధార్మిక సామాజిక సారస్వతాది ప్రసంగములకును, మహాపురుషుల జన్మదినోత్సవములకును అవకాశ మొసంగుచు క్రమక్రమముగ నందు భజనలు, శ్రీరామనవమి మొదలగు పండుగులు జరుపుటయేగాక ఆ యా పర్వదినముల నప్పుడప్పుడు బీదసాదల కన్నప్రదానము గూడ గావింపబడుచుండెడిది.

కొలదికాల మిట్లుజరిగి నామమాత్రముగనుండిన యీ సంఘమునకు 1909 సంవత్సరమున నిర్మాతయగు దుగ్గిరాల సత్యనారాయణగారే మరల యత్నించి గ్రంథాలయ మను పేరుగూడ నిడి నూతనరూప మొసంగిరి. ఈ పరిణామమున వీరికి కీ. శే. దుగ్గిరాల దేవరాజుగారుకూడ తోడ్పడియుండిరి. వీరిరువురు గ్రంథాలయమున కావశ్యకములైన పరికరములను గ్రంథములను ఒసంగి కొలదిగ పుష్టివంతము గావించి దానినొక గ్రంథాలయ మనిపింప గలిగిరి.

## విద్యార్థులయందు పోటీపరీక్ష

తెలుగున వ్యాసము వ్రాసి గెలుపొందిన విద్యార్థులకు 25 రూపాయిల విలువగల పుస్తకములను బహుమతి నిచ్చు నేర్పాటు 1913 వ సంవత్సరముననే ప్రారంభమైనది. తదాది యథాక్రమమున ఉన్నత పాఠశాలవిద్యార్థులు 1 మొదలు 6 వ ఫారమువరకు ఈవ్యాసపరీక్షలకు అభ్యర్థులగుటయు, ఉత్తీర్ణులైన వారు బహుమతులను గొనుటయు, సాగుచుండినది. ఈమధ్య రెండు మూడు సంవత్సరముల నుండి బాలికాపాఠశాలలనుండి విద్యార్థినులు పోటీకి నిలుచుటయు గెలుచుటయు బహుమతుల నందుటయు జరిగినది. బహుమతి మూల్యము రు 60 లకు పెరిగినది.

## నూత నోజ్జీవము

ఏమైన నేమి 1914 సం. మొదలు సంఘమున నూతనోజ్జీవ మారంభమైన దనవచ్చును. సమయానుగుణముగ సభలు జరుపుటయు, పఠనమందిరము ప్రవృద్ధిని సూచించుటయు, గణ్యములగు తెలుగు ఇంగ్లీషు పత్రికలకు యేర్పడిన తావు విరివియగుటయు మొదలుగానెన్నేని జీవకళలు పొడసూపుచు వచ్చినవి. ఈసంఘము యొక్క పూర్వదశయందు పోషణమునకై చేయిచ్చినవారిలో కీ. శే. చిలుకూరి నరసింహారావు (జూట్ మిల్లుమేనేజరు) గారు ఒకరుగ గణింపకుండరాదు.

క్రమముగా పుస్తకభాండాగారము, దాని యనుబంధమగు పఠనమందిరము పెంపుసూచించుటచే పదుగురకు పిన్నపెద్దలకు అందుబాటులో నుండుచోట సంఘమునకు ఒక వసతి యేర్పరుచుట అవశ్యకమైనది. ఆ కాలమున ఈపురమున నెలకొనిపనిజేయుచుండిన "లిటరరీఎసోసియేషన్" అను పేరుగల సంస్థను ఈ సంఘముతో మేళవించుటకు ప్రయత్నములుజరిగినవి. వైశ్యయువకులుప్రత్యేక సమితిని నెలకొల్ప నుద్యుక్తులై యుండిరి.

అనేకత్వమునకన్న ఏకత్వము ఉచితమని అన్నిటిని ఏకీకరణ మొనర్ప ప్రయత్నము సాగినది. వైశ్యయువకులు ఈ సంఘమునెడ సుముఖులై తమ ప్రయత్నమును విరమించి, తాము సంఘమునకు సాధనభూతులైరి, "లిటరరీ అసోసియేషన్" వారు పేరునుగూర్చిన పెనుగులాటకు లోనై తమప్రత్యేకతను గోల్పోజాలకపోయిరి. కాని సోమంచి భీమశంకరంపంతులు, నంబూరి తిరునారాయణస్వామి, బి. యె. గార్ల పురుషకారము ఫలించి, ఆ అసోసియేషన్ గ్రంథములు కొన్ని, ఈసంఘభాండాగారమున జేర్చబడినవి. ఇప్పటికి ఆంగ్లేయగ్రంథములు 374, ఆంధ్రగ్రంథములు 438, సంస్కృత గ్రంథములు 43, తాళపత్ర గ్రంథములు 6, మొత్తము 861 గ్రంథములు భాండాగారమునందు కలవు. ఈ సంవత్సర మధ్యముననే గ్రంథి రామమూర్తిగారి (పోస్టాఫీసువద్దనున్న) కొట్టునకు మార్పబడినది. ఇది 1915 వ సంవత్సరపు కథ.

## సాంఘిక సేవ

1915 - 17 మధ్యకాలమున జరిగిన కృషివలన ఈసంఘపు పునాదులు గట్టిపడినవని చెప్పదగును. గ్రంథముల సంఖ్య పెరిగినది. సభ్యులసంఖ్య హెచ్చినది. పత్రికాప

తన కుతూహలము హెచ్చినదనుటకు ఆంగ్ల ఆంధ్రపత్రికల సంఖ్య 60 వరకు అభివృద్ధిచెందుటయే తార్కాణము. ఈ కాలమున ఈ సంఘద్వారమున విస్మరింపరాని ఉత్కృష్ట సేవ జరిగినది. అదేదన, 1916 సంవత్సరమున గోదావరి వరద వలన నష్టమొందిన బీదసాదలకు ,,మదరాసు గోదావరి వరద నిధి'' వారు పంపిన రూ 200 లను ఈసంఘ సభ్యులు కొందరు ఆవిపద్రంగమునకు వెళ్ళి ఆర్తులకు గింజల రూపముననను, బట్టలరూపముననను, వివేచనముతో పంచి పెట్టి రనుటయే. మరొక్క విషయము. 1917 సం॥ చివర భాగమున ,,ప్రకృతి పరిణామము- హైందవ సిద్ధాంతము'' అను విషయమునుగూర్చి కృష్ణాపత్రికారచయిత శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు భావపూరితమగు ఉపన్యాస మిచ్చిరి. కలరా మున్నగు భయంకర వ్యాధులు పురమును నాల్గుమూలల ముట్టడించి ప్రజలను బాధించుచుండిన దినములలో సంఘసభ్యులు కొందరు బయలుదేరి ఉపన్యాసము లిచ్చియు, వ్యాధిగ్రస్తులకు ఔషధాది పరిచర్యలు చేసియు నిర్వ్యాజమగు సేవయొనర్చిరి.

ఉగాదిపండుగ

1918 వ సంవత్సరము ఈ సంఘజీవనమునకు ఉగాది పండుగ. ఇంతవరకు ఈ సంఘమున జరుగుచున్న సరస్వతీ ప్రసన్నతనుగూర్చియే మీరువింటిరి. ఇపుడు లక్ష్మి సాక్షాత్కరించినదని, యీ సాక్షాత్కారమునకు ఈసంఘమును భరించిన మహాన్భావములలో నొక్కడు ప్రజాహితైక సేవాతత్పరుడు, వదాన్యుడునగు మద్దుల వెంకటచినరాజు శ్రేష్ఠిగారు నూరు రూకల దక్షిణతో ,,శతమానం భవతు శతాయు'' అని అమృతాశీస్సు గావించిరి. వీరే సార్థకమైన ప్రథమశాశ్వత సభ్యులు. సంఘమునకు దినక్రమమున పుస్తకములు, ఇతర సామానులును పెంపొందుచుండుటచే జవాబుదారితో గూడిన జాగరూకత గల కాపుదారీ అవసరమైనది. ప్రజాదరము అంతకంతకు పరివ్యాప్తియందు ఉన్నదని ఉత్సాహము కలుగుచుండినమాట నిజము. కాని వచ్చుబడికన్న వెచ్చము అధికమగుచున్నది. అంత అలనపాలనకును, ఆర్థికోషపత్తికిని అనువయిన సంఘ మొకటి మాపురవైశ్య జమీందారుడు, వితరణ వినోదియగు రావుబహదూర్ మోతే గంగరాజుగారు శీర్షికగా ప్రతిష్ఠమైనది. ఈ ప్రతిష్ఠాపనమునకు ఆ వెంకట చినరాజు శ్రేష్ఠిఅమృతసంకల్పమే నిశ్చలకార్యదీక్షయే కారణమనిన అతిశయోక్తికాదు. అది మొదలు సంస్థను నడపుటకు ఆవశ్యకములైన సన్నాహములు జరిగినవి. అట్లుస్థాపింపబడిన సంఘమే నేడు ధర్మకర్తృసంఘము పేర ప్రవర్తిల్లుచున్నది.

తరువాత జరిగిన తత్పరిణతిని గూర్చియు ఇంచుక విన్నవించుకొందుము. 500 రూపాయలు పూర్తిగా చెల్లించి శాశ్వత ధర్మకర్తలయినవారు 1930 సం॥ న ద్వాదశాదిత్యులవలె పన్నిద్దరు. ఇందు శ్రీకారము మద్దుల వెంకట చినరాజు శ్రేష్ఠిగారే. రు500 ల మీదవడ్డీ యిచ్చువారు చతుర్దశభువనములవలె పదునలుగురు. మొత్తము ఇరువది ఆరుగురు. ఇట్లే క్రమాభ్యున్నతినొంది నేటికి ధర్మకర్తసభ పూర్తిగ రు 500 లు సొమ్ము చెల్లించిన పదునారుమంది సభ్యులతోను, అంత మొత్తముమీద వడ్డీనిచ్చు 17 సభ్యులతోను శాశ్వతపోషకులు మొదలు సహాయులు 52 సభ్యులతోను విరాజిల్లుచున్నది. మరియు ఈసంవత్సరమునందే 1860 సం. 21 ఆక్టుప్రకారము లేఖ్యారూఢమైనది. శుభోత్కరములైన యిన్ని సన్నివేశములకు ఆకరమైనదగుట ఈ సంవత్సరము ఈసంఘమునకుఉగాదిపండుగ. రు500లు వెచ్చించిమ్యాజిక్ లాంతరు నొకదానిని తెప్పించిరి. ఉద్దేశానుసారము పామర జనసామాన్యమున జ్ఞానమును పరివ్యాప్తము చేయుటకై దీనిని వినియోగించిరి. ఈ సంఘముయొక్క ఊనషోడశ వర్షోత్సవము (15) [1920 జనవరి 18, 19 వ తేదీలు] నకు అధ్యక్షతవహించిన శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు ఇట్లు నుడివిరి.


" ఈపురయువజనులు 1904 సంవత్సరమునందు కతిపయ గ్రంథములతో నారంభించిన గ్రంథాలయము పదునైదేండ్లలో క్రమవికాసము బొందినది. ఆంధ్రదేశమునందుగల 530 గ్రంథాలయములలో ఈ గ్రంథాలయము పుస్తకముల ననుసరించి ఐదవదిగను, ఆదాయము ననుసరించి ఎనిమిదవదిగను ఉండుట ఈపురవాసులైన యువజనుల యుత్సాహమునకు నిదర్శనము. యువజనుల యుత్సాహమునకు విశేష ప్రోత్సాహమొసంగిన మోతేగంగరాజుగారు మొదలగు పౌరులు మనకృతజ్ఞతకు పాత్రులు.

గృహ నిర్మాణము

ఈ సంఘమునకు శ్రీ మోతే గంగరాజు జమీందారుగారు స్వగృహమును నిర్మించెదమనిరి. ఏలూరు పురపాలక సంఘమువారు 2000 చ.గ. స్థలమును ఉచితముగా నిచ్చిరి. ఈ స్థలమునకు మ్యునిసిపాలిటివారు కోరినట్లు అద్దెక్రింద 30 సంవత్సరములవరకు సం॥ 1 కి రు 100 లు చొ॥ చెల్లింతుమనియు, ప్రతి ముప్పది సంవత్సరములకు నూటికి 30 రూప్యములు మించని అద్దె వసూలు చేయవచ్చుననియు 25-10-20 సం॥ తేదీన సంఘము తరఫున మ్యునిసిపాలిటీకి రిజష్టరు దస్తావేజు వ్రాయించి యీయబడెను. అంతట శంకుస్థాపన మయినది. స్తంభప్రతిష్ఠమైనది. మహారాజ


# హిందూ యువజన సంఘ భవనము.

గర్భదేశము. నాట్యశాలావరణము-ప్రేక్షకస్థానము.



( Balcony. )


ఊపరిభాగము. గ్రంథముల బీరువాలు.



( Upper chamber: Library Hall )


## హిందూయువజనసంఘ భవనము

అంతర్భాగము - అగ్రదృశ్యము, పఠనశాల.



(Inner side - Front Hall - Reading Room)

గర్భదేశము - నాట్యశాలావరణము - రంగభూమి.



నాటకశాల తెరమీద మద్దుల వేంకటశ్రేష్ఠి, ట్రస్టుబోర్డు కార్యదర్శిగారి పటము అగుపడుచున్నది.

సౌధముతో పోల్పదగిన మందిరము తయారైనది. రు15000 లతో పరిపూర్తి చేయనెంచుకొనిన భవననిర్మాణ క్రమము అర్ధలక్ష ఆరగించినది.

జిల్లాకలెక్టరు పి. యల్. మూరుగారు భవనమునకు శంకుస్థాపనము జేసిరి. ఈ శంకుస్థాపనమయిన రెండు సంవత్సరములకు గవర్నమెంటు రివెన్యూపన్ను క్రింద ఏడాదికి రూ 413-3-7 ల అధికపుపన్ను విధించినది; రు 18000 ల సొమ్మువరకు వ్యయపరచి నిర్మించుచుండిన భవనముపని హఠాత్తుగా ఆగిపోయినది. మితిమీరిన నిరుత్సాహము మమ్మావరించినది. ఈ పట్టున 5 సంవత్సరములు అటు గవర్నమెంటుతో, ఇటు మ్యునిసిపాలిటీతో, ఉత్తర ప్రత్యుత్తరములు సాగినవి. జప్తులేకావు, వారంట్లేకావు, చివరకు వేలమువరకు వచ్చినది. ఈ యవకాశమును చూచుకొని పురపాలకసంఘమువారును దావా వేసిరి.

ఇట నొక్క చిన్నవిషయము. ఈ విపత్తరంగముల మధ్య సంఘ మొక కొట్టుమిట్టాడుచున్న సమయమున, సంఘాధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులు, కమిటీ మెంబర్లలో చాలమందియు తమబాధ్యతలను తొలగం ద్రోసికొనుటకై రాజీనామామాటలు పంపిరి. ఆ పంపిన వారిలో రాజాభుజంగరావు, మోతే గంగరాజు జమీందారు, మోతే నారాయణరావుగార్లు గూడ నున్నారు. ఇంచుమించు సంఘము నిరాధారస్థితికి వచ్చినది. అపట్టున అసహాయముగా నిలువంబడి సంఘపరిరక్షణమే ధర్మమని నమ్మి సొంతపూచీమీద ప్రోనోట్లువ్రాసి డబ్బుతెచ్చి సర్కారుశిస్తుచెల్లగట్టి, సంఘపాలకవర్గమును మరలగూర్చి మహావిపత్తునుండి రక్షించిన శ్రీ ఈదర వెంకయ్యపంతులు మొదలుగా హితైషులఉపకారము సంఘజీవనమున నొక ముఖ్యోపాఖ్యానముగ నున్నది.

తుద కెట్లయిన నేమి, పట్టణ స్థలముమీద ధర్మసంస్థలకు నేలపన్ను విధించు ముఖ్యసూత్రమును పురస్కరించుకొని ఎకరము 1 కి రూ 1000 ల రేటునుంచి, రూ 6-4-0 కు పుచ్చుకొన్న తేదీనుంచి పన్ను తగ్గించినట్లు నె 620/30-3-27 తేదీగల ఉత్తర్వు ప్రభుత్వమునుండి తెచ్చుట భగీరథప్రయత్నమైనది. భగీరథ ప్రయత్నము చేసిన మద్దుల వేంకటచినరాజుశ్రేష్ఠిగారికి ఆముఖమై దివాన్ బహదూరు మోచర్ల రామచంద్రరావుపంతులుగారు సహకారము నెరపిరి. ఈ సఫలప్రయత్నులు ఇరువురును ఈ శుభవార్తమోసికొని చెన్నపట్నమునుండి మెయిలు దిగిననాడు ఈ సంఘపక్షమున స్వాగతాద్యభినందనము లొసగిరి. 10-3-29 న నూతనభవన ప్రవేశ వైభవముకూడ జరిగినది.

ఆపట్టున కవాటోద్ఘాటనకాండ మదరాసు గవర్నమెంటు హోం మెంబరు మార్జొరీబ్యాంక్సు కె.సి.ఐ.ఇ. దొరవారిచే జరుపబడినది. దివ్యభవనమును గట్టించి సరస్వతీదేవిని కాపురము నిల్పిన శ్రీ గంగరాజు జమీందారుగారి రూపపటముతో మదరాసునుంచి వచ్చిన మార్షుబ్యాంక్సు దొరగారు పఠనమందిరము నలంకరించిరి.

## గ్రంథముల యభివృద్ధి

కీ. శే. డాక్టరు సామర్ల కోటయ్యనాయుడుగారి వెయ్యిరూపాయల విలువగల 1076 గ్రంథములు ఈగ్రంథాలయ మలంకరించినవి. చిన్నం చెలమయ్యశ్రేష్ఠి బి. ఏ. గారు రు 150 విలువగల ప్రపంచయుద్ధచరిత్రను ఒసంగిరి. బొర్రా వెంకటస్వామినాయుడుగారి జ్ఞాపకార్థమై జంపన రామయ్యనాయుడుగారు 41 తాళపత్రగ్రంథములతో ఈ గ్రంథాలయమును పూజించిరి. చీమకుర్తి కూర్మసుబ్బారాయుడుగారి కుమారుడు మల్లికార్జునశ్రేష్ఠిగారు అమూల్యములగు 1050 ఆంధ్ర గ్రంథములతో ఈ సరస్వతీ నిలయమును అలంకరించిరి. కృష్ణాజూట్ అండ్ కాటన్ మిల్సు సంఘమువారు సహస్రరూపికలతో ఈవిజ్ఞానమూర్తిని తాన మాడించిరి. ఎనిమిదివందల రూప్యముల విలువగల నైతికగ్రంథ సంపుటములతో "తిలక్ పొలిటికల్ లైబ్రరీ" పేర ఈ శారదాదేవికి తిలకము ధరింపజేసిరి.

రాయబారముపేర ఆంగ్లదేశమున పర్యటన మొనర్చివచ్చిన దీ. బ. మోచర్ల రామచంద్రరావుపంతులు, సర్. కూర్మా వెంకటరెడ్డి నాయుడుగార్లకు ఈ సంఘము ఊరేగింపుతో స్వాగత మొసంగెను. ఇంచుమించు ఈ సంవత్సరాంతముననే, అనవద్యవిద్యాసంపన్నుడని అమేయ విమర్శకదక్షుడని ఆంధ్రులలో గణ్యతగన్న కట్టమంచి రామలింగారెడ్డిగారు "హైందవసంఘపునర్నిర్మాణము" గూర్చి నిజవ్యాఖ్యానముతో ఈ సారస్వతకోశమునకు మహదాశీర్వాద మొనర్చిరి. తెలుగుసీమయందలి ప్రతిభకును, ఉపజ్ఞకును ఉదాహరణభూతులును, ఆంధ్రవాఙ్మయమునకు హాస్యరస మను భిక్షపెట్టిన స్రష్టయు నగు శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావు పంతులుగారి అధ్యక్షప్రసంగము వలన 1922 సం॥న ఈ గ్రంథాలయము మంగళాశీస్సును బొందినది. 18 వ వార్షికోత్సవము 1923 వ సం॥ లో సాధుశీలురగు శ్రీ రాజా వెంకటాద్రి అప్పారావు బహద్దర్ ఉయ్యూరు వగైరా యస్టేట్ల జమీందారుగారి సాచివ్యమున జరుపబడినది,

ఆ తరువాత 1930 సం॥వరకు వార్షికసభలు జరుగక పోవుటకు భవన నిర్మాణప్రయత్న నిమగ్నతయే కారణమని విన్నవించుచున్నాము. మరల 1930 సెప్టెంబరు మాసమున, ఆంధ్ర భీష్మ బిరుదాంకితులగు న్యాపతి సుబ్బారావు పంతులుగారిఅధ్యక్షతను వార్షికసభ జరిగినది. 21-4-33 వ తేదీని తన రాజకీయ విజ్ఞానముతో విదేశీయులను నిర్విణ్ణులను చేసిన గౌ. వి. యస్. శ్రీనివాసశాస్త్రిగారు ఈ సంఘవార్షికోత్సవమునకు అధ్యక్షు లయిరి. శ్రీవారికి అభినందనపత్రికను సమర్పించిరి. ఈ సంఘమునకు ఇది ఒక పర్వదిన మనవచ్చును. ఆసందర్భమున గ్రంథాలయమును గూర్చిన ఇద్దరు పెద్దమనుష్యుల ప్రసంగములు . సంస్తవనీయము లనవచ్చును. ఒకరు కన్నెమరా గ్రంథాలయ పాలకులు ఆర్. జనార్దనరావు నాయుడుగారు, మరి యొకరు నరసింహదేవర సత్యనారాయణగారు.

ఈ గ్రంథాలయమునందలి పుస్తకములపట్టిక వ్రాతలో నుండెడిది. అది గతికపాటి వేంకట కామేశ్వర దీక్షితులు, వేపా సత్యనారాయణ బి. యె. వకీలు మొదలగు వార్లకృషివలన రమారమి వేయిరూపాయల వెచ్చముతో ఆంగ్లాంధ్రసంస్కృత హిందీ గ్రంథములకు సరియైన పట్టికలు తయారు కాబడి అచ్చుపడినవి.

కృతజ్ఞతలు

చేపట్టినదాది అత్యంతప్రీతితో నీహిందూయువజన సంఘమును పోషించుచు, భవనదాతగను, ధర్మకర్త్రసంఘాధ్యక్షుడుగను కొలుచుచున్న శ్రీ శ్రీ గంగరాజు జమీందారుగారి జీవితము, తదేకదీక్షతో ధర్మకర్త్ర సంఘమునకు శ్రీకారమై, కార్యదర్శియై, పెక్కువిధముల ప్రాణమునకన్న మిన్నగ ఈ సంఘమును రక్షించుచున్న శ్రీ శ్రీ మద్దుల వెంకటచినరాజు శ్రేష్ఠిగారి జీవితము ఈసంఘ చరిత్రయందు మిళితమైనవి.

1915 మొదలు 1923 సం॥వరకును అధ్యక్షపదవికి అలంకారభూతులై యుండిన మ. రా. రా. శ్రీ రాజా మంత్రిప్రెగడ భుజంగరావు బహద్దర్ జమీందారు గారును, 1924 మొదలు 1933 వరకు అధ్యక్షులై సంఘము నెదుర్కొనిన క్లిష్టసమస్యల పరిష్కారమునకు అవసరము పడినపుడెల్ల చక్కనిసలహా లిచ్చుచుండిన ది. బ. రామచంద్రరావు పంతులుగారును, ఆదినుండి ఉపాధ్యక్షులుగ నుండి అనేకవిధముల తోడ్పడుచున్న శ్రీ మోతే నారాయణరావు జమీందారుగారును అత్యంతము ప్రశంసనీయులు, మరియు పెక్కేండ్లు కార్యదర్శులుగానుండి తమ పదవులు సార్థకములగునట్లు అంతఃకరణశుద్ధియగు ఆసతో ఈ సంఘమును సేవించిన శ్రీ ఈదర వెంకయ్యపంతులు గ్రంధి రామమూర్తిగార్లు సంస్తవనీయులు.

1933-34సం॥కుగాను ప్రభుత్వమువారుఇచ్చిన రు200ల విరాళములో మరి రెండువందలు సంఘనిధినుండి చేర్చి, 250 మేలురకపుగ్రంథములను గూర్చి తెలుగున వ్యాసపరీక్షలతో వక్తృత్వపరీక్షలనుగూడ జోడించితిమి. అంతట తనిసియుండక విజ్ఞానప్రపంచమునకు పౌరుల దృక్కులను ఆకర్షించుటకును, యువకులయందు అంతర్భూతమైయున్న ప్రజ్ఞావిశేషములను ప్రబోధించుటకును మతసాంఘిక సారస్వతాదివిషయములపై చర్చలు జరుప నేర్పాటుచేసితిమి. పైచర్చితాంశములలో ముఖ్యముగా పేర్కొనదగినది, "హిందూస్త్రీలకు విడాకుల చట్టము అవసరమా" అనునది. ఈ చర్చయందు ఉభయపక్షవాదములును తీవ్రతరముగ సాగినవని చెప్పుటకు రెండుదినములువరుసగా జరుగుటయు, ప్రముఖులు పాల్గొనుటయు,వందలకొలది ఆబాలవృద్ధముగ స్త్రీ పురుషులు కుతూహలాయత్తులై సభనలంకరించుటయు నిదర్శనములు, ఈచర్చావిధానమునకు, 1933 సంవత్సరము వార్షికోత్సవమున కధ్యక్షతవహించిన శాస్త్రిగారు ప్రసంగవశమున ఇచ్చిన హితవు దిక్సూచికయు, హెచ్చరికయు అయినవనియు, వారు వ్యంగ్యముగ సూచించినదానిని ఈ గ్రంథాలయమువారు అనుసరించుచున్నారు. ఈ సంవత్సరమున వ్యాస వక్తృత్వపరీక్షలలో గెలుపొందిన అయిదుగురు విద్యార్థినులు ఉత్తమసత్కారములకు యోగ్యులైరి. ఈ సంఘవర్తనమునకు రచితములైయుండిన పూర్వనిబంధనలను ప్రకృతస్థితికి అనువుపడునట్లు సంస్కరించుటకై ఉపసంఘమొకటి నియుక్తమైనది. మార్పుచెందిన నిబంధనలును తయారైనవి.

ప్రకృతికి గాలిపాటునుబట్టి సాంక్రామికాదితరుణవ్యాధులు తప్పనట్లు మాయీసంఘవ్యవహారము లందును అప్పుడప్పుడు విషవాయువులు వీచుచుండిననుట నిజమే. కాని నిరోధకాది నివారణ చికిత్సలతో సంఘము ఒక విధముగ ఆరోగ్యముగనే కాలక్షేపము చేయుచున్నది. ఇందునకు సంఘశ్రేయమునకై పాటుపడెడు మాన్యులరక్షణమే కారణము.

1934 సంవత్సరము వార్షికోత్సవము ఆంధ్రభాషాభిజ్ఞులలో నొకరుగా నెన్నదగిన మా ప. గో. జిల్లా ట్రెజరీ డెప్యూటీకలెక్టరు మ. రా. శ్రీ మహూరు లక్ష్మీనరసప్ప యం. ఏ. గారు అధ్యక్షతవహించి నిర్వహించుటయేగాక, యెల్లవిధముల ఈసంఘమును గొలుచుచున్న మద్దుల వెంకట

చినరాజు శ్రేష్ఠిగారిరూపపటమును గ్రంథాలయభవనమున ప్రదర్శించిరి.

ఈసంవత్సరాంతమున మదరాసులో జరిగిన తొమ్మిదవ అఖిల భారత గ్రంథాలయ మహాసభకును పదునేడవ ఆంధ్ర గ్రంథాలయ మహాసభకును, ఈ సంఘపక్షమున కార్యనిర్వాహక సభ్యులనేకులును, కార్యదర్శి నరహర శెట్టి రంగారావుగారును, భాండాగారాధిపతి పా. సత్యనారాయణమూర్తి బి. యె. బి.ఇడి. గారును ప్రతినిధులుగా వెళ్ళి ఉభయసభల కార్యక్రమమునందును ప్రాముఖ్యముగా పాల్గొనిరి. ఆ నొప్పుతింపబడిన నివేదిక ఆసభాముఖములఁ జదువబడెను. ఈ సంఘభవనముయొక్క వివిధరకములపటములు గ్రంథాలయప్రదర్శనమునకు పంపబడెను.

ఈ సంఘము సాగించుచుండిన కృషివలన వణిగ్వర్గమునందు అంకురించిన గ్రంథపఠనాభిరుచిని పురస్కరించుకొని నడిబజారులో పఠనాలయశాఖ యొకటి 1932సం॥లో నెలకొల్పబడినది. నాటి మొదలు నేటివరకు నిరంతరాయముగను ప్రోత్సాహకరముగను నిర్వర్తింపబడుచున్నది.

నౌ కరులు:—

ఈ గ్రంథాలయమునకు ప్రతినెలకును రు 90 ల జీతముమీద 4 గురు గుమాస్తాలును 3 గురు బంట్రోతులును గలరు.

ఫలశ్రుతి:—

వింటిరిగదా ఈ సంఘచరిత్రము! సంగ్రహముగా నివేదించిన ఈ సంఘజీవిత పరిణామములను బట్టి నడుమ నడుమ నలమితొలఁగిన అవాంతరముల కేమిగాని, మొత్తముమీద గ్రంథాలయాదిపఠనమందిరములద్వారా సంఘోద్దేశములు కొన్నియేని నిర్వర్తింపఁబడుచు వచ్చినవి. ఈ మన రాజధానియందు అథవా మన తెలుఁగుసీమయందు సర్వాంగ సౌష్ఠవము లయిన గ్రంథాలయములలో ఈ మా సంఘము మొదటిది కాకపోయినను రెండవదిగానైన ఎన్నుటకుఁ దగిన లక్షణములు గల్గియున్నది. కాని 1920 వ సం. వార్షిక సభాధ్యక్షత వహించిన వదాన్యమూర్తి కాశీనాధుని నాగేశ్వరరాయడు, ఆకరములం చూపుచు రాజధానియందలి ఉత్తమ గ్రంథాలయములలో ఈ గ్రంథాలయమును పంచమస్థాయి కెక్కించి నిజవాత్సల్యమును వెలువరించిరి. ఆయమృతవాక్కు నాధారముగఁగొని నాటికి నేటికి పదునైదేండ్లు గడచినవి కాన అద్వితీయమని చెప్పనగును.

గ్రంథముల సంఖ్య పండ్రెండువేలను దాఁటినమాట నిజమే. ఇందు అపురూపము లైన గ్రంథములును పెక్కుగల వనుటయు నిజమే. ఇటు గ్రంథాలయమునను, అటు పఠనమందిరమునను పఠితలసంఖ్య మిక్కిలి ప్రోత్సాహకరముగ నున్నదనుటలో అతిశయోక్తిలేమియు నిజమే. చందాదారుల పట్టిక పెరుగుచున్నదనియు చెప్పికొనుటకు సంతోషమే. సంఘము చూపుచున్న సేవాపరాయణతను బట్టి ధర్మకర్తల సంఖ్య పెరిగిన దనియుఁ దెలుపుటకు ఉత్సాహమే. కాని ధర్మకర్తల దాననిధినుండి రావలసిన వడ్డీయందు సగముకూడ సక్రమముగ వచ్చుటలేదు. చందాలమూలకముగ ప్రతినెలకును రావలసిన ఆయమున సగమువంతు వసూలగుటయు చాలకష్టమగుచున్నది. మంచి పుస్తకములు పదుగు రపేక్షించునవి పట్టుకొని వెళ్ళెడు వారిలో చాలమంది నెలల తరబడి వాపసు చేయుటలేదు. వాపసైన వానిలో కొన్ని శిథిలావస్థ నొంది యుండును. అసలు పుచ్చుకొనిన పుస్తకములను, ఎట్టి యమూల్యములైన వైనసరే. ఇచ్చు నలవాటులేని మహానుభావులు కొందఱు, పోగొట్టిన పుస్తకమునకు వెల ఇచ్చువారును గలరు గాని, అప్పుడే వాపసు చేసినామని అసలుకే ఎసరుపెట్టు పెద్దలే ఎక్కువగా నున్నట్లు లెక్కలు తెలుపుచున్నవి.

ఇట్టిధార్మిక కార్యమునఁగూడ అధికార వ్యామోహము పీడించుట వలన అప్పుడప్పుడు కలఁతలకు కొంత ఈపాలక వర్గమున తావేర్పడు చున్నదా? అనిన ప్రశ్నమునకు, లేదని చెప్పదగిన భాగ్యములేదు.

సరి ఇట్టివానికేమి పోనిండు - ఈ రోజులలో సంఘర్షణలపాలుగాని సంస్థలు ఎన్ని? కేవల సేవామాధుర్యలోలురు ధార్మికదృక్కులు కొందరు లోటుబాటులను సంబాళించుకొనుచుండుటచే కొన్నియలజడుల కెడమిచ్చినను మొత్తముమీఁద సంస్థలు నిరపాయముగనే నడచుచుండును.

భరత వాక్యము:—

అమెరికాసంయుక్తపరగణాలనుండి ఖండఖండాంతరములయందు ప్రశస్తిగాంచిన కార్నీజియక్ లైబ్రరీని ఉదాహరణభూతముగ నుంచుకొని ప్రపంచమున కంతకు గాకున్నను కనీసము భరతవర్షమున కంతకును అద్వితీయ మనుపించునంత స్థితికి ఈ సంఘమును గ్రంథాలయమును వృద్ధిపొందింప వలయునని యువ్విళులూరుచున్నారు. భాషాభిరతులు వదాన్యవినోదులు తలంచిన అదెంతపని? ముఖస్తుతిగా భావింపకుందురుగాక! శ్రీమోతేగంగరాజు జమీందారువంటి దానశౌండుఁడు మఱొక్కమాఱు ఈ

సంఘము వైపు కటాక్షమును బఱపినా చాలును. భారతవర్షమున నిరుపమానమగు గ్రంథాలయము ఏలూరు కన్నదన్నమాటె. కేవలము అమూల్యగ్రంథములచే అల్మైరాల నలంకరించుటే గాదు - పెద్దపిన్న తారతమ్యములులేక ప్రతి పల్లెయందును ప్రతి యింటిగుమ్మమునను సరస్వతీదేవతను ప్రతిష్ఠింప వలయును. పర్ణకుటీరములు మొదలు ప్రభువుల సౌధోపరిభాగముల వరకు సరస్వతీదేవి తాండవింపవలయును. ఐతిహాసికాది సమస్త విషయముల పరిశోధనలకును శరణ్యమిదియే యనిపింపవలయును.

## ఆస్తి.

ఈ గ్రంథాలయమునకు రు 50,000 లు ఖరీదు చేయు భవనము రు 17,306-14-6ల గ్రంథములు, రు 6429-4 9ల సామాను, 300-11-3ల ఇతర సామానులు, బహుమతులు వగైరాలకై రొఖము రూ 899 లు వగైరాలు 92 వేల ఆస్థి గలదు.

## 1935 సం॥ ఆదాయ వ్యయములు.

ఆదాయము:-

| | |
|---|---|
| 985-7-9 | వడ్డీలు |
| 936-11-0 | చందాలు |
| 67-5-6 | ప్రవేశరుసుము వగైరాలు |
| 857-6-2 | ఆదానుమించినవ్యయము |
| 2846-14-5 | జెరసి |

వ్యయము:-

| | |
|---|---|
| జీతములు వగయిరా | 1123-11-2 |
| పత్రికలు | 257-8-6 |
| సంవత్సరోత్సవము | 120- 1-3 |
| వ్యాసరచన వగయిరాలు | 253- 9-10 |
| లైటింగు | 95- 6-3 |
| ప్రింటింగు, బైండింగు | 155- 9-3 |
| పుస్తులు వగయిరాలు | 175- 2-0 |
| స్టేషనరీ, పోష్టేజీ | 39-15-3 |
| అడ్వెరటయిజు మెంటు | 46- 8-0 |
| ఆడిటుఫీజు | 125- 8-0 |
| గ్రాండురెంటు | 5-11-0 |
| చిల్లరఖర్చులు | 204. 0-3 |
| బ్రాంచినిమిత్తం | 244- 3-8 |
| జెరశి | 2846-14-5 |


# మంచి గ్రామఫోనులు

# జయోఫోనులే శ్రేష్ఠమైనవి

ప్రపంచవిఖ్యాతిగాంచిన కొల్లేరో మోటారుతో (ఆంగ్లేయదేశములో చేయబడినది) అమర్చబడినది. అన్ని నమోనాలలో నున్నవి. ధరలు ఎక్కువపెట్టి కొన్నవాటితో సమానముగా నుండుటకు గ్యారంటీ—

ఆంధ్రఫోనుహౌసు

ఆంధ్రగ్రంథాలయ ప్రెస్, బిల్డింగ్సు, బెజవాడ.

# తెలుగు మాసపత్రికలు

### రాష్ట్రేతరాంధ్ర సంజీవని

ఇది రాష్ట్రేతరాంధ్రుల పక్షమున ఖరగపురమునుండి ప్రకటితమగు మాస పత్రిక. దీనికి బ్ర. శ్రీ. గుమ్మలూరి లక్ష్మీనృసింహ శర్మగారు సంపాదకులు. మొదటి రెండు సంచికలు మా కార్యాలయమునకు జేరినవి. ఆశీస్సులుగాక మొదటి సంచికయందు ౪౮ పుటలును రెండవ సంచికయందు ౫౦ పుటలును గలవు. ఈ పత్రికయందు "రాష్ట్రేతరాంధ్ర మహామండలి" యను శీర్షిక క్రింద రాష్ట్రేతరములలోనేమి, ఖండాంతరములందేమి తాత్కాలికముగనో స్థిరముగనో నివసించుచున్న ఆంధ్ర సోదరుల సంఘములయొక్కయు సమాజముల యొక్కయు సంస్థలయొక్కయు కార్యక్రమములను కష్టేష్టములను ఎప్పటికప్పుడు ప్రకటించుచుండుట సర్వాంధ్రమండలియు గమనింపదగును. ప్రత్యేక మీశీర్షికక్రిందే గాక విస్తారతర వ్యాసములును "బొంబాయి రాష్ట్రాంధ్రులు" "తమిళరాష్ట్రాంధ్రులు" "కల్యాణి ఆంధ్ర జన సంఘ గ్రంథాలయములు" అనురీతిని ప్రకటిత మగుచున్నవి. ఆంధ్రభూమిలోని మనలను హెచ్చరించుటకుగాను ఎడనెడ రాష్ట్రేతర ప్రదేశములలోని ఆంధ్రుల సంఖ్యలు వగైరా వివరములు కంటికి గట్టిన చిత్రఫలకములలోవలె ప్రకటితమైనవి. హృదయాకర్షకమగు కవిత్వము, భాషావిషయికవ్యాసములు, వైద్యవిషయములు, అధ్యాత్మికబోధలు, వ్యవసాయము, విద్య, గృహనిర్మాణాదికళలు వీనికి సంబంధించిన రచనలు ఇందు గలవు. రాష్ట్రేతరాంధ్ర ప్రముఖులలో నొకరై, ఖరగపురాంధ్రుల సేవ నప్రతిమానరీతిని చేసి కృతకృత్యులై చిరువయస్సున దివంగతులైన శ్రీ దేవరాజు సీతారామస్వామివారిస్మరణ నిరాడంబరజీవులయమృతత్వమునకు నిదర్శనముగా మొదటి సంచికయందు ప్రకటితమైనది. ఈపత్రికయందు రాష్ట్రేతరాంధ్రులకు సంబంధించిన చిత్రపటములును పెక్కులుగలవు. ఇది నిజముగా రాష్ట్రేతరాంధ్రుల భాషాభిమాన దేశాభిమానముల వేనోళ్ల వ్యక్తపరచుచున్నది. లోకపు పదిదిశలకును బ్రాకిన ఆంధ్రప్రతిభావంతులను ఆంధ్రభూమికిపరిచయపరచుటకీమహోద్యమము సకాలమున బయలుదేరినదని సంతసించుచున్నాము. సంవత్సరము చందా రు ౨-౦-౦.

### మురళి:

కాకినాడ ఆంధ్రప్రచారిణీ నిలయమువారు రజతోత్సవ సత్కృతిగా యువమాఘ మాసమునుండి దీనిని మాసపత్రికగా ప్రకటించుచున్నారు. దీనికి శ్రీ వేంకట పార్వతీశ్వరకవులు సంపాదకులు, ప్రకాశకులు, జీవదాతలు. అనర్గళకవితాసామ్రాజ్యధురీణులగు నీ కవిద్వయులసృష్టి రసవత్తమముగ నుండదని యెవ్వరనగలరు? ఆంధ్రసాహిత్యమున కభినవసౌందర్యమును గూర్చుట ఈ జంటకవుల యుద్దేశము. తన్నిర్వహణమునకై వీరు 'మురళి' నాశ్రయించిరి. ఆంధ్రప్రచారిణీ గ్రంథనిలయముయొక్క చరిత్ర వ్రాయుచు వీరు తెలిపిన వివరములు, సారస్వత సేవకు లాంధ్ర దేశమున పడుచుండు కడగండ్లను హృదయదారకరీతిని స్పష్టీకరించినవి. శ్రీ చంద్రారెడ్డిగారి యాశ్రయము, పీఠికాపురాధీశుల యాశ్రయము, ఇతరప్రభువుల యాశ్రయము, శ్రీ అద్దెపల్లి లక్ష్మణస్వామిగారి యాశ్రయము, పాఠ్యగ్రంథనియామకుల యాశ్రయము, తాలూకాబోర్డులయాశ్రయము,విశ్వవిద్యాలయముల ఆశ్రయము, ఇన్ని యాశ్రయములుండి128 కృతులు ప్రకటించి ఈగ్రంథాలయము మూడుపర్యాయ

ములు వేలకొలదియప్పులపాలగుటయు నొకప్పుడు ముద్రాయంత్రము నేయమ్ముకొనుటయు సంభవించె ననిన, ఆశ్రయమే లేని గ్రంథకర్త లీయాంధ్రభూమిలో బ్రతుకు టెట్లు? ప్రభువులగుచుండు ప్రజలు గ్రంథకర్తల నేలుదురా? చూతముగాక. విమర్శ యందుండు సంచికలో శ్రీవిమర్శాదర్శక నడకుదుటి వీరరాజకవిగారు భాగవతములోని "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి" యను పద్యము ప్రక్షిప్తమని నిరూపించి పోతనకును రావుసింగమ భూపాలునకును గౌరవము నిలుప బ్రయత్నించినారు. ఇది సత్ప్రయత్నము. వీ రీప్రయత్నమున కృతకృత్యులై రనియే దోచుచున్నది కావున వీరి నభినందించుచున్నాము. ఈ పత్రిక వార్షిక మూల్యము రు 1-2-0 లు. విడిప్రతి 0-1-6.

## వినోదిని

మార్చి సంచిక యధాపూర్వంగా శృంగార రసభూయిష్టమయి యున్నది. దుర్వ్యసనం (తాగేభర్తకు తాగడం ప్రోత్సహిస్తేనేగాని సౌఖ్యం పొందలేని యిల్లాలి కథ), మాయబజారు (టక్కరుగా బాతుకోడిగుడ్లు విలాసవతి బుట్టలో పడవేసి దానిమానం తీయనెంచిన విటపురుషుని కథ), స్త్రీ హృదయం (మొదట రంకుమగని వలచి పిదప తనమగనితో మచ్చికై రంకుమగనిని రచ్చకెక్కించిన స్త్రీ కథ), పిల్ల పిచ్చి (వీధుల వెంబడి విటత్వం ఫలిస్తుందని విటుడై తిరిగే విద్యార్థికథ-క్వీన్ మేరీ కళాశాలమీద వానిచేత కారుకూత కూయిస్తూ), బ్రాహ్మణీకం (విధవను వలచి కడుపుచేసి వివాహమాడి దానిని తిప్పలు పెట్టిన బ్రాహ్మణుని సశేషం కథ) ఇత్యాదులను వాడుక భాషలో అనర్గళంగా ఈ సంచికలో క్రుమ్మరించినారు. మానవప్రపంచములో లేని అత్యూహాలుగాని అత్యుక్తులుగాని ఇందులో లేవన వచ్చునేమో. స్వభావవిరోధం కూడ చేయలేదన వచ్చునేమో. కాని దుస్స్వభావ జన్యములగు చిత్త వికార వర్ణనములు, నీతికి అలవాటు పడని నీచస్వభావములను సంస్కరించుటకు బదులు అధోలోకమునకే ఎక్కువగ లాగికొని పోవును. పచ్చిబూతులు, బండపల్కులు లేకున్నంతమాత్రముచేత సద్భావ వికాసమును వ్రాతలు పురికొల్ప జాలవు. పూర్ణమగు నీతిపరుడుగాని, పూర్ణమగు అవినీతి పరుడుగాని ప్రపంచమున లేరు. నీతిప్రాబల్యమున్న ప్రకృతి నీతిపరము. తద్వ్యతిరేక మవినీతిప్రకృతి. అందుచేత దుస్వభావ వర్ణనమే ప్రముఖము చేసినప్పుడు నీతివిరోధం కాక తప్పదు. పామరజన వశీకరణేచ్ఛతో అట్టిపథకం వేసికొనడం హర్షింపదగిన మార్గంగాదు. రాముడులేని రావణసృష్టి వాల్మీకి చేసియుంటే వాల్మీకి ఉత్తమ కవియై యుండడు. మావిమర్శ కాక్షేపణ కలదు. నాటి గాథలు గొప్ప పురాణాలు; నేటి కథలు చిరుకథలు, ఆనైతికదృష్టి యిందులో పెట్టి కథను పెంచితే కళ చెడుతుందనడ మీయాక్షేపణ. ఇది సరి యనరాదు. మూడు ముక్కలలోనే దోషమూ ఇముడ్చవచ్చును, గుణమును ఇముడ్చవచ్చును. ఇది చేసిననాడే మనది మానవత్వం. అది చేసిననాటిమాట పదిం బదిగ చెప్పవలెనా!

## గృహలక్ష్మి

గృహలక్ష్మి ఈ మార్చి మాసముతో తొమ్మిదవ సంవత్సర మారంభించినది. ఇందులోని వ్యాసము లెప్పటివలెనే చక్కగనున్నవి. త్యాగము అను చిరుకథ చదువం దగినది. దీనితో గూడ "స్వయంకృతాపరాధమా?" "రాత్రి రాత్రే, పగలు పగలే" "మంచిమార్గం" "అనుమాన పిశాచం" అనే ఇతర కథలును కలవు. ఇందులో నొకటి సశేషము. కేశవ చంద్ర సేనుని మాతయగు శారదా సుందరీ దేవిజీవితము ప్రక

టితమైనది. పద్యములు, ఇతరములగు మామూలు వ్యాసములు కలవు. ఇందులోని చిత్రపటములలో నాట్యవిలాసము గమనింప దగినది. రచయిత పరిచయము, భావవివరణము ఇట్టి చిత్రములనుగురించిప్రకటించుట మేలు. ఈ చిత్రమున నాంధ్రత్వసిద్ధి చక్కగా ప్రయత్నింపబడినను కటి చేలమునుండి భిన్నమైనచేలాంచలము, అరచాటు' సీటును ప్రకటింపని యురోజసృష్టి కొంత యౌచిత్యమును తగ్గించినవి. ఈ పత్రిక నిలువున నచ్చు వేయుచు పైచిత్రము విలాసము వెడలుపున ప్రకటించుట అందమును కొరవడజేయుచున్నది యనితోచును.

ఈ పత్రికాధిపతులు తమ వ్యాఖ్యలలో నీ పత్రికకు ౨౦౦౦ మంది చందాదారులుమాత్రముకలరనియు 'రెండుకోట్లకు పైబడిన ఆంధ్రలోకమున నింతతక్కువ ప్రచారముండుట అచ్చెరువు కలిగించుననియువ్రాసిరి. మాకిది ఎక్కువ యాశ్చర్యము ననుపించదు.

ఆంధ్రప్రజల వికాస వాంఛను పెంచుటకు నాయకలోక మెక్కువ ప్రయత్నించలేదు. మనకు మంచి సంవేదనపరత్వము కలదు త్యాగము కలదు. కార్యము లారంభింతుము, సాగింతుము. క్రొత్త సంవేదన కలిగెనా మొదటి పట్టు విడుతుము. కార్యపరత్వమునకు కావలసిన సామగ్రిని సమకూర్చుకొని శ్రమపడి ప్రజలకై నిరంతరము ఏకదీక్షగా పాటుపడు గుణము మనమింకను నేర్వ తగియున్నది. పత్రికలు కొనసాగుటకుద్రవ్యము పెట్టి ముద్దులుమూట గట్టునట్లు అచ్చువేసిన చాలదు. ద్రవ్యమిచ్చి దివ్యమైన వ్యాసములు వ్రాయించినను చాలదు.

అక్షరమురాని నిఖిలాంధ్ర ప్రజకును ఈ సిద్ధమైన విషయము శ్రుతపరచు సాధనము ఏర్పడవలెను. అదిగ్రంథాలయము దక్క వేరు కాదు. పత్రికాధిపతులు, ఇతరోద్యమ నాయకులు ఈ కార్యమునకును ఉచితరీతిని చేయూత నొసంగిననాడే వారి స్వప్నములు వాస్తవములు కాగలవు. పక్వాన్నము సిద్ధమైనను వడ్డించు వారులేనిది అతిధులకు చెందదు గదా!

ప్రకృతి

ఈ పత్రికను ముఖపత్రముమీాద సచిత్ర సహజ వైద్యమాసపత్రికయని వర్ణించిరి. మార్చి నెలసంచికలో ఆరోగ్యగోష్టియందు సంపాదకులు మదనపల్లి థియసాఫికల్ స్కూలు హాస్టలులో దంపుడు బియ్యపు వాడుకచే కలిగిన ఫలముల నుదహరించిరి. గుంటూరు కమ్మహాస్టలు ఆంధ్ర విశ్వవిద్యాలయహాస్టలులలో దంపుడుబియ్య ముపయోగించుట నారంభించినారట? ఆంధ్రవ్యాయామమునుగురించి వ్రాయుచు సంపాదకులు, మనసీమలో ప్రోత్సాహము లేక కోడిరామమూర్తి గారు ఉత్తర హిందూస్థానము నాశ్రయించుట తెలియపరచి ఆంధ్రుల నిరాదరత్వమునకు దుఃఖించిరి. ఆంధ్రులు సత్వరముగా వ్యాయామ సంఘములు నెలకొల్పిఆరోగ్యాభివృద్ధిని కావించుకొనవలెనని హెచ్చరించిరి. 'చలనచికిత్స' యను వ్యాసమున 15 చలనములు వర్ణింపబడినవి. ఇవి సూర్య నమస్కారాది వ్యాయామములు చేయలేని రోగులకొరకేర్పడినవి. దేహమునందలి ప్రతియవయవమునకును సరియైన కదలిక ప్రతిదినమును కలుగుచుండునెడల నెట్టి రోగములును దరిజేరవను సిద్ధాంత మీాచలన చికిత్సకు మూలాధారము. నేటి స్త్రీలకొకమాట యను వ్యాసమున యోగాసనములు, ఋషులు యోగులు చేయవలసినవి గాని సంసారులు చేయవలసినవి కావనుట పొరబాటనియు యోగవ్యాయామము స్త్రీలకు పెట్టినపేరనియు సూర్యనమస్కారములు, ఆసనములు, మంత్రో

చ్చారణము, ఈత, ఇన్నియు స్త్రీల యారోగ్యమున కుపకారులనియు స్థిరపరచబడినవి. జలచికిత్సా విధానము శీతలోదక సర్వాంగ తడికట్టు చిత్రములతోగూడ సుగమముగా వర్ణితమైనది. దేహ వ్యాయామ పాఠములలో మూడవ పాఠమున కాళ్ళ కండరముల యభివృద్ధినిగురించి కథ సాగించిరి. విశ్వేశ్వరం గారి మమున్సిఫ్ తమ 12 ఏండ్లబాలికకు మోర్తోట యోగాశ్రమమున కలిగిన ప్రకృతి చికిత్సవలని మహారోగ్యఫలమును గురించియు కొరిపెల్ల వెంకట్రామయ్య చౌదరీ గారు ఉపవాస చికిత్సవల్ల తమకు గలిగిన ఆరోగ్యఫలమును గురించియు, ఏర్లగడ్డ రాఘవయ్యగారు తాము పాముకాటుకు చేసికొనినచికిత్సను గురించియు స్వానుభవలేఖలను వ్రాసిరి. ఈకడపటి చికిత్స తెలిసికొనగోరువా రనేకు లుందురు. కాన వివరింతుము. చౌదరిగారికి 24 కట్లుకలిగిన పాము, ఎడమకాలునాల్గవ్రవేలిని కరచినదట. ఆభాగముపైన కట్టుగట్టిరి. నీటితోకలిపిన మట్టిపట్టీని పైభాగమువరకును వేసిరి. ఇట్టివి మూడుపట్టీలు పదినిముసముల కొకపర్యాయము వేసిరి. తరువాత దేహమంతటను చక్కగా ఆవిరిపట్టి చన్నీటిస్నానముచేసిరి. పిమ్మట అరగంట తొట్టిస్నానము. పిదప వ్యాయామము. నీలిరంగు సీసాసీరు పావుగంట కొక యౌన్సు చొప్పున మూడు అవున్సులసేవన. పిదప ఎనీమా, ఆ దినము అనగా ఒకరాత్రి మరుసటి దినము ఉపవాసము. తజ్ఞులీచికిత్సలోకల్గిన పరివర్తనములు శాస్త్రీయముగా విమర్శించుట బాగు.

భారతి

శ్రీ దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరాయల ఆంధ్రభాషాసేవయందొక యపూర్వాంగంగా ప్రకటితమౌ మాసపత్రిక యిది యనడం లోకము చక్కగానెరుగును. విమర్శనలోనుండు సంచిక, 120 పేజీలుగలది. ఇందు శ్రీ తలిశెట్టి రామారావుగారు ఆంధ్రనాయకులకు సంబంధించిన రెండు వికటచిత్రములు వ్రాసిరి. అందులో నొకటి "ఆంధ్రనాయకులు క్రొత్త 'పోజు'తో ఆంధ్రమాతనుజూచి, ‹ఒసే దూరంగాపో; దగ్గరకురాకు; మేము మడిగట్టుకున్నాం" అనే వివరణకు పైగా ప్రకటితమైనది. 'భారతి'ని చదివి మూయడముతో 'భారతి' ఈ నాయకత్వానికి తోడ్పడుచున్నదే యనుచింత కలిగింది. ముఖచిత్రంలో తెలుగునకు ప్రాధాన్యం తప్పిం దనడం గోచరించింది. హిందీయక్షరాలు 'భారతి' యను మూర్ధ మలంకరించినవి. 'తెలుగక్షరాలు' క్రింద చిత్రంలో రంగులలో ఇమిడిపోయినవి. తలిశెట్టి రామారావు తెలివి నిజముగా గొప్ప దేయనిపించింది. మరియొకపర్యాయము సంచికలోనికిదృష్టి ప్రవేశపెట్టితిమి. బొడ్డు బాపిరాజుగారి 'దేవ !' అగ్రస్థానాన నున్నది. కవిత్వము చక్కనిదే కావచ్చును. గాని 'జనుమాంధజీవి'ని క్రమ్ముకొన్న యంధకారమున కీ ప్రధానస్థాన మేలనా యనుపించినది. తరువాత పుట త్రిప్పితిమిగదా! శ్రీ చల్లపిళ్ల వెంకటశాస్త్రిగారు తమ 'కర్మము కాలి' తమకొక విమర్శకుడు దాపరింపగా 'ఇంత చెత్త ప్రసంగము వ్రాయవలసివచ్చినది' అని వ్రాసిన పది పేజీల వ్యాసము (ఇట్టి వానిలో మూడవది) దృగ్గోచరమైనది. విఖ్యాతపురుషులను విమర్శించువారు వేఱుందురు ? అందరికిని ప్రత్యుత్తర మీవిధమైనది కురిపించకపోతే లోకమునకు నష్టమా ? తమకు న్యూనతా ? పత్రికలకు విషయము కరవా ? శాస్త్రులవారేల యాలోచింపలేదోయని మెరపు మెరసినది మా మెదడులో. ఇంత గ్రంధమున్నది, కథ లెన్ని యున్నవోయని వెదుకగా రెండేయని తేలినది.

41



సంతోషం కలిగినది "కర్మబద్ధులు" "తప్పెవరిది" అనునట్టివి. అహోబిలపండితుడు కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిలవారి జీవిత చరిత్రలు రెండు వ్యాసములలో వివరింపబడినవి. "రసాభాసము", "నరసభూపాలీయము" నను సారస్వత వ్యాసములు గలవు. 'రసాభాస' వ్యాసకర్త తెలుగున వ్రాయుచుండుట మరచినట్లుతోచును. తిర్యంగ్ మ్లేచ్ఛగతరతి, బహునసక్త యోషిద్గతరతి వర్ణనములు రసమేగాని యాభాసకాదని సిద్ధాంతీకరించు పాండిత్యప్రదర్శనమే ముఖ్యముగా గణించి వ్రాసినట్లున్నది. ఈవ్యాసకర్త తనయూహచే జగన్నాధ పండితుడు తనమతము వాడని నిరూపింప జూచుటచింత్యము. వీరడిగిన ఈక్రిందిప్రశ్న నడిగి శాస్త్రవాదము చేయక యుండియుందురేని ఆలంకారికు లేమి జవాబిత్తురో చూచి యుండవచ్చును.

"దక్షిణనాయకున కనేకనాయికానురాగము వర్ణితమైనప్పుడు రస మగుచుండ నాయిక కట్టి యనురాగము (బహునాయకానురాగమన్న మాట) వర్ణించిన రసమేల కాగూడదు?"

నరసభూపాలీయమును గురించిన వ్యాసము మిక్కిలి చదువదగినది. మూలమగు ప్రతాపరుద్రీయమునుండి మూర్తి' ఎచ్చ టెచ్చట నెంతెంత మారుపడినాడో దానిచే కలిగిన దోషములెట్టివో ఈవ్యాసమున పూసగ్రుచ్చినట్లు వివరించిరి. నరస భూపాలీయమును అచ్చువేయుటలో ప్రకాశకులు చేసిన యపచారములను నిరూపించిరి. "తెలంగానాశాసనములు" (హైదరాబాదు శ్రీలక్ష్మణరాయ పరిశోధక మండలి వారి ప్రకటనము) విజయనగర సామ్రాజ్య తృతీయవంశచరిత్ర పరిశోధనలు (మదరాసు విశ్వకళాపరిషత్తు ఇంగ్లీషు ప్రచురణము) కాంగ్రెసుచరిత్ర (ఇంగ్లీషు-తెలుగు) అను గ్రంథముల దీర్ఘవిమర్శలు వేరు వేరు వ్యాసము లందుగలవు. "తెలంగానా" శాసనములవిషయమై శ్రీశర్మగారు కొంచెము కఠిన విమర్శయే చేసిరి. గ్రంథకర్తపై అభిమాన మెక్కువగల విమర్శకు డెంతపక్షపాతము చూపనగునో యనువిషయము కాంగ్రెసుచరిత్ర విమర్శ యదగుపించును. 373 వ పేజీలో (ఇంగ్లీషు) గ్రంథకర్తగారు, సర్ తేజ్ బహదూరు సప్రూను గురించి 'ఇట్ సీమ్సు'అను పదములతో నొక యపోహ వేయగా, విమర్శకుడు గట్టిగా బల్లగ్రుద్ది సప్రూ 144,108 వ సెక్షనులను కనుగొని వానిని మూలనుండి ముంగిటికి తెచ్చిరనివ్రాసిరి. ఓపికతో విమర్శకుడు 111 వ పేజీచూచునేని కడచిన శతాబ్దములోనే 144, 108 వ సెక్షనులు రాజకీయనాయకుల నిర్బంధమునకు వినియోగింపబడెనని స్పష్టముగా గ్రంథకర్తయే వ్రాయుట కాన్పించును. ఇతరోదాహరణములు ఈ గ్రంథమున కలవు. ఈ భారతి సంచికలో ఇతరవ్యాసములును గలవు. అందు మిక్కిలి యాకర్షకమైనది తలిశెట్టి రామారావుగారి జావాయందలి ప్రతిమా నిర్మాణము. ఇది వారివ్యాసావళిలో 8 వది, కడపటిది. ఇందులో వర్ణితమైన భారతీయాంధ్రప్రతిభ మన కుత్తేజకరము.

# గ్రంథ విమర్శ

## స్మృతికాలపు స్త్రీలు

బ్ర. శ్రీ. జటావల్లభుల పురుషోత్తము ఎమ్.ఏ గారు
(ఆంధ్రగీర్వాణ విద్యాలయమున ప్రిన్సిపాలు, కొవ్వూరు)

తొలుత 'వేదకాల స్త్రీలు' అను గ్రంథమును వ్రాసి లోక సామాన్యముగ నందించిన విషయము లమూల్యములు గదా! ఆ లేఖినియే యిపుడు స్మృతికాలపు స్త్రీల చరిత్రమును జిత్రింపగలిగినది. శ్రుతిస్మృతిసమన్వయమున నిక లోపము రాదని హర్షింప నయ్యెడిని.

ఆర్యమతసాంప్రదాయములలో 'వివాహవిధి' యెంత ముఖ్యమో అంతక్లిష్టమైనది. ''శ్రుతిశ్చభిన్నా స్మృతయశ్చ భిన్నాః'' అన్న శ్లోకయంశమును నిర్ధరించుట కన్నో మతాంతరములమూలసూత్రములు సమన్వయింప వలసి యుండును. నేడార్యావర్తమున నావరించిన యన్ని దారిద్ర్యములతోఁ బాటు గ్రంథదారిద్ర్య మొకటి. ఆర్యమతముల పూర్వోత్తరములఁ జర్చించి యిదమిత్థమని యొక నిర్ణయము సేయుట కష్టతమముగాఁ గన్పట్టుచున్నది. ఇంత చేసినను వినిపించుకొనెడి యాస్తిక భావము ప్రజలలోఁ గఱవగుచున్నది. అట్టిస్థితిలోఁ గల వానితోఁ గాలక్షేపము చేసి, అంతలోనంతదారి గల్పించి సరియగుసమన్వయము చేసి, తామొకటి హృదయమున నిడుకొని యాసిద్ధాంతమునే సమర్థింప, స్మృతివాక్యముల కర్థాంతరములఁ గల్పింపక, వితండవాదమునకుఁ బోరక, విషయమును జనసామాన్యమునకు బోధించుటయే ప్రధానముగా నెంచి చేసిన గ్రంథకర్తల రచనాపాటవ మాదర్శప్రాయమనుట కానందము గలుగుచున్నది. ఇట్టి నిష్పక్షపాతవిమర్శనశైలి యిప్పటి గ్రంథములలో కొద్ది మందిలో మాత్రమే గోచరించినది.

'సంఘసంస్కర్త'లను పేర శ్రుతిస్మృతుల కర్థాంతర కల్పనము సేయు నొకతెగ యీనాడు దేశమున బయలుదేరినది. వాని ప్రతికూలవాదఝంఝామారుతమున నార్యజాతీయమత ధర్మవృక్షము కూకటివ్రేళ్లతోఁ గదలిపోవుచున్నది. ఆర్యులవిజ్ఞానాదర్శము భగ్నమై శాంతి, యైకమత్యము చెడిపోయెనని యెఱుంగక, ధర్మశాస్త్రములఁ దిద్దినచో నైకమత్య మేర్పడుననియు, పాశ్చాత్యులలోఁ గూడ కొంద ఱంగీకరించిన ఆర్యవైవాహిక సూత్రముల దుడిచి పెట్టినచో, వీర్యవంతులగు బిడ్డల భారతజనని కనుననియు, దేశమునఁ బ్రాతినిధ్యము వహించి రాజ్యము చేయుచున్నవి. అధికసంఖ్యాకుల బలమే బలమనుచు, వారి కనుకూలముగాఁ బండితులగువారు కూడ భావముల మార్చి, విరుద్ధార్థములఁ జెప్పుచున్నారు. తమలో ఘనీభవించిన భావముల కనుకూలముగ ధర్మశాస్త్రగ్రంథముల నన్వయించి, వానిగౌరవము చెఱచుటకంటె, తమ విధానము కాలమానమున సఫలమైనదిగా నమ్మి ప్రచారముచేయు భారత జాతీయనాయకులు కొంద ఱున్నారు వారిప్పటికిఁ బ్రశంసార్హులే. ఇట్టి స్థితిలో శ్రీపురుషోత్తముగారు తమ గ్రంథమును బండిత పామరు లెల్లరను సామాన్యముగా గ్రహింప వలసినవియు, ప్రకృత కాలప్రవాహమున నూగులాడు జీవయాత్రా విధానమున నిదమిత్థమని నిర్ణయించుకొన వలసినవిగా వాకొన్న యీక్రింది యంశములు గమనార్హములు.

I. వివాహవయస్సు 2 వ అధ్యాయము
II. వివాహవిధానము 4 వ అధ్యాయము
III. పునర్వివాహము.
IV. గౌరవము. స్వాతంత్ర్యము
V. విద్య.

ఇందొక్కొక్క దానిలోని సారమును చదువరుల సౌకర్యమున కిట వివరింతును.

### I వివాహవయస్సు.

పురుషున కుపనయమెట్టిదో స్త్రీకి వివాహవిధి యట్టిది. బ్రాహ్మణున కుపనయనవయస్సు 8 సం॥ క్షత్రియునకు 11 సం॥ లు, వైశ్యునకు 12 సం॥లు. స్త్రీకి వివాహమే యుపనయనమువంటి దగుచో నావయస్సుననే వివాహము చేయ నగును.

II నారదుఁ డొక్కఁడు మాత్రము ప్రథమరజస్వలానంతరమున మొదటి పదునారుదినములలో వివాహసంస్కారము చేయనగును. అంతకుఁ బూర్వము వాగ్దానముగా వరుని యోగ్యతలఁ బరీక్షించి, దానము చేయవలెను. ! అనెను. దీనింబట్టి దానము వేరు, వివాహమువేరు. రెండిటికిని నడుమ కొంతకాలము వ్యవధియున్నట్లు స్పష్టము. ఈ విషయమున ననుకూలించు ధర్మశాస్త్రము లింకఁ గానరావు.

వశిష్ఠుఁడు, గౌతముఁడు, పరాశరుఁడు, యమసంహిత, సంవర్తసంహిత, యాజ్ఞవల్క్యస్మృతి, రజస్వలానంతర వివాహముల నొప్పుకొనవు. యమస్మృతి, పరాశరస్మృతి స్త్రీకిఁ బండ్రెండవ యేడు రాకపూర్వము వివాహము చేయవలె ననుచున్నవి.

స్త్రీకి రజస్వల కాకపూర్వ ముత్తముడైన వరుడులభింపకనో మరేయజాగ్రత వలననో తండ్రి వివాహముచేయ డేని, యాబాలిక మూడేండ్లు నిరీక్షించి, (స్వయంవరము) తనంతనే పెండ్లి చేసికొనవచ్చునని స్మృతికర్తల యాదేశము. అయ్యెడ నామెకాని, ఆమెను పెండ్లాడిన యాతని వంశముగాని దోసము పొందదు.

## II వివాహవిధానము.

'సమావేశనము' ఇప్పుడు చిన్న తనములో వివాహాంశముగా నిది చేయుట సాంప్రదాయమే కాని, శాస్త్రీయము కాదు. కన్యావరణము నిట్టిదే.

వివాహవిధానములో ముఖ్యవిషయములు:

I కన్యాదానము:-దీనివలన వరునకుఁగన్యపై స్వామ్యము కలుగును. ఇది వివాహమునకు ముందే చేయఁబడునది.

II పాణిగ్రహణము:- భార్యయగును. అనఁగా కర్మములలో సాహచర్యము లభ్యము.

III. సప్తపది:— భార్యాత్వము స్థిరపడును.

IV శేషహోమము:-వరుడునువధువునుఅగ్నిప్రదక్షిణము చేయుదురు. ఇప్పుడిది పరిణయమని చెప్పఁదురు.

ఇందలి 'కన్యాదానము' విధిజరిగిన స్త్రీ వాగ్దత్తయని పిలువఁబడును. ఈమెను 'దానమాత్రముగా గ్రహించిన వాఁడే వాగ్దానపతి. వాగ్దత్త భార్యయే, కాని కేవలము భార్యకాదు - అందులకు నిదర్శనములు. వాగ్దత్తయైన కన్య మరణించుచో భర్తయొక్క జ్ఞాతులు మూడుదినములే యాశౌచము పట్టవలెను. ఆమెతండ్రి దాయాదులు మూడు నాళ్లాశౌచము పట్టవలెను. భార్యకాకపోవుట కిది నిదర్శనము; లేనిచో దశరాత్రాశౌచము తప్పదు గదా!

ఈ సందర్భములో—

"నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితేఽపతౌ"

అనుచో, అపతౌ, - అనఁగా పతితో సమానుఁడు, వాగ్దానపతి యన్నమాట; అని యర్థము సమన్వయముచేసి, వాగ్దానపతి నష్టుఁడైనను, చనిపోయినను, జితుఁడైనను, క్లీబుఁడైనను, వాగ్దత్త నింకొకనికిచ్చి వివాహము చేయవచ్చును, అని సమన్వయించిరి. అపతౌ, యనుట నూతనమైనను, స్మృతికారుల మతమున కిది భిన్నము గాకపోవుటచే వీరిచట గల్పించినయుక్తి సరసమని చెప్పక తప్పదు.

వాగ్దానము చేసిన బాలికను జైకారణముల చేఁదనవశము చేసికొన్నచో, తొలుతటి వాగ్దానమునకైన వ్యయమును వడ్డీతోఁ దీర్చుకొనవలెను.

ఒకమారు కన్యను దానము చేసి యామెను మరొకరికీయరాదు.

## III. పునర్వివాహము

వాగ్దత్తయైన స్త్రీకి గూడ, భర్త నష్టుఁడు మొదలగుపట్ల గూడ పునర్వివాహమును మను వంగీకరింపలేదు, నియోగము నంగీకరించెను. అక్షతయోని (పురుషసంగ మెఱుగనిది) యీనియోగమును సంస్కారముతోనే పొందవలెను. (అవివాహితవలెనే).

భర్త జీవించియుండగా స్త్రీ కామమువలన 'సవర్ణుని' (తనకులమువానిని) స్వతంత్రముగా (నన్యు నాశ్రయించుచో నది 'పునర్భువు' అని చెప్పఁబడును. అది పురుషసంభోగము పొందినది) క్షతయోనియైనను, అక్షతయోనియైనను, సంస్కారమును బొంది 'పునర్భువు' అను పేరొందును. ఆమె యన్నము భుజింపరాదు.

## IV స్వాతంత్ర్యము, గౌరవము.

స్త్రీ సర్వపూజ్యురాలు. ఆమెకు సంసారవిధియందెక్కువ భార మీయకుండుటకే వారికి స్వాతంత్ర్య మంగీకరింపబడలేదు, గాని వేరుగాదు, వారి కన్నిస్మృతులును గౌరవస్థాన మిచ్చుటలో లోపము చేయలేదు, స్త్రీస్వాతంత్ర్యవాదు లిది గమనింపవలెను.

## V 'విద్య'

అథర్వణవేద శేషమే వారి విద్యయట! అది గృహ్యసూత్రములలోఁ జెప్పబడిన కర్మములకు సంబంధించినది. అంకురారోపణము, నాకబలి మొదలగువానికి సంబంధించినది. నృత్యము, గానము మొదలగునవి నిషిద్ధములు.

వివిధవిషయము లను పేరఁ బదునొకొండవయధ్యాయమున స్త్రీల ధర్మమును గూర్చి చక్కని విషయములు వివరింపఁబడెను.

ఇట్టి పవిత్రతమమైన గ్రంథమును భారతదేశీయులగు స్త్రీపురుషులు ముఖ్యముగాఁ జదివి యర్థము చేసికొని, నిజమగు నార్యమత భక్తిరసము దమజీవనాడుల పొంగిపొరల, నెప్పటికేని యిట్టి యార్యమతాభిమానుల నుత్తమసంతానమును బడయుదురు గాక! యని కోరెదను. అట్టి జ్ఞానదీప్తివలనగాని మనల నావరించిన నాస్తికమత నిబిడాంధకారము పటాపంచలు గాదని ముమ్మాటికిఁ జెప్పగలను.

బ్ర. శ్రీ. పురుషోత్తముగారు ప్రతికూలవాద వైపరీత్యమునకు నిరుత్సాహులుగాక, భావి భారత భాగ్యోదయమునకుఁ గారకులగు నమాయిక యువక బృందమును దృష్టిలో నిడుకొని, నిష్పక్షపాతముగ నిట్టి గ్రంథముల నందింతురుగాక యని వేడుచున్నాను.

సత్యమేవ జయతి! శ్రీ శ్రీ శ్రీ

# ప్రణవము ఇంద్రియాతీతమా?

(కల్లూరి వీరభద్రశాస్త్రిగారు.)

మన తెలుగు దేశములో అక్షరాభ్యాసము చేయునాడే బిడ్డలచేత ఓంనమఃశివాయ సిద్ధంనమః అని అనుపించడము ప్రత్యేకాచారము. ఇవియే మొదటియక్షరములుగా నేర్పుటయు పూర్వపు పద్ధతి. భారతభూమియం దితర ప్రాంతములలో నీయాచారమున్నట్లు గానరాదు. అక్షరాభ్యాసముతో నుపక్రమించిన యీ ఓంకారమును మన దేశములోని ప్రతిపురుషుడును జీవితాంతమువరకు మంగళాచారముగా అభీష్టకార్యముయొక్క నిర్విఘ్నసమాప్తికొరకును, ఆధ్యాత్మిక లక్ష్యసంప్రాప్తి కొరకును వినియోగించుకొనుచున్నాడు. ఓనమాలు దిద్దబెట్టునప్పుడు మొదట, చెవినిబడిన ఈ యోంకారము బ్రహ్మోపదేశమున- అనగా నుపనయనమున- , వేదవేదాంగాది విద్యాభ్యాస ప్రారంభమున జ్ఞానవిజ్ఞానసాధనకు నిరంతర ముచ్చరించి యుపాసింపదగిన మహామంత్రబీజముగా నేర్పడుచున్నది.

అడుగడుగునకు చెవి నిల్లుగట్టుకొని ధ్వనించునీ ఓంకారమును గూర్చి ఆర్యమతాభిమానులు తెలిసికొనుట యవసరము. ఉపనిషత్తులలో ఓంకారమే బ్రహ్మయని మనపెద్దలు ఘోషించినారు. కాని ఈ 'ఓం'కారమునకు నర్థము చెప్పునప్పుడు భేదాభిప్రాయములు కలిగియున్నవి. నాదబ్రహ్మమునుపాసించువారు పలువురున్నారు. వారు 'ఓం'కారము, ప్రాణము (వాయువు), అనలము, (అగ్ని) వీనిసంయోగముచే బుట్టునందురు. అనాహతస్థానమున స్వప్రకాశమై శబ్దించునందురు. ఇదే పరనాదము, పరమాత్మయందురు. దీనికి శ్రుతివాక్యము విరోధముగనున్నట్లుతోచును. వినుడు.

"యోవేదాదౌ స్వరః ప్రోక్తః వేదాంతేచ ప్రతిష్ఠితః తస్య ప్రకృతిలీనస్య "యః పరస్స మహేశ్వరః."

ఏస్వరము వేదముల మొదటను, వేదాంతములందును నిలుపబడినదో. అది ప్రకృతిలీనమైనది. దానికిఁ బరుడైనవాఁడే మహేశ్వరుఁడు. (పరమాత్మ)

ఇందు వేదాది వేదాంతముల ప్రతిష్ఠితమైన శబ్దము - అదియే ఓంకారము అథవాప్రణవము-ప్రకృతియందు లీనమైనదని చెప్పబడినది. పరమాత్మ ప్రకృతికి అతీతుఁడు. ప్రకృత్యతీతమును ప్రకృతిలీనమును నొక్కటేయనుట బొత్తుగా సరిపడదు.

ప్రకృతిలీనమగు దానికంటె పరమైనదే యాత్మయనుట సిద్ధాంతము, "ఓమిత్యేకాక్షరం బ్రహ్మ"యని మనము దినమును ఉచ్చరించుచున్నాము. ఇతి శ్రుతివాక్యముగదా! దీనిగతి ఏమి? యని విజ్ఞులు ప్రశ్నింపగలరు.

శ్రీశంకరులవారే దీనికి ప్రత్యుత్తరమిచ్చిరి. దాని యనువాదమును వినుఁడు. కర్మపరతంత్రులగువారు ఓంకారమును తొలుత నుచ్చరించియే కర్మ లాచరింతురు. ఈ విధముగా చేసిననే ఫలముగల్గునని విధినిబద్ధము. తద్వారా యీ ప్రయోగ మభ్యాసబలముగలది యగుచున్నది. అట్టివారు బ్రహ్మోపాసనాస్థితికి వచ్చినపుడు ఓంకారలక్ష్యమును విడచి ఆత్మవస్తువును పరిగ్రహింపనేరరు. ఆ స్థితియం దీ రెంటికి నభేదమును

పాటింతురు. ఆకారణముచే శ్రద్ధాగృహీతము ఆత్మస్వరూపముగా నేర్పడును. అంతియకాని ఓంకారమే యాత్మయనుట పొసగదు.

ఓంకార మాత్మస్వరూపముకానియెడల ఫలప్రద మెట్లగునను శంకకవకాశముగలదు. దానికి శ్రీశంకరు లీసమాధాన మిచ్చిరి.

ప్రతిమేవ విష్ణోః అన్నన్యాయమున ప్రతిమారూపమున నర్చింపఁబడిన యీశ్వరుడు మనోరథములనెల్లను గ్రహించుచున్నాడో అట్లే ప్రణవమునకును లక్ష్యము బ్రహ్మమే యగుచున్నాడు. అట్టియెడ బ్రహ్మమునకుఁ గమకమైన ఓంకారము బ్రహ్మమే యనునెడ, బ్రహ్మతో సదృశమైనది యను నర్థమే గ్రహించవలసియుండును. కాని రెంటికి నభేదము వాకొనుట సాధ్యపడదు.

ఇక ప్రాణానల సంయోగముచేఁ బుట్టినది ప్రణవనాదమే యనుచున్నారు. అదియు సరిపడదు. ప్రాణానలసంయోగమువలన ధ్వని పుట్టును. అదిశుద్ధనాదము. అయ్యదంతఃకరణముతోఁ జేరినపుడే మనకుఁ దెలియఁబడును. ఆ తెలిసిననాదమును శ్రద్ధాగృహీతమును తనపూర్వసంస్కార సంస్కృతమునగు 'ఓం'కారమే యని నిర్ణయించుకొనుట యుపాసకునియభిమానమూలకముగాని వేఱుగాదు. ఉపాసకుఁ డేయాకారధ్వని నభిమానించిన నదియేనాద మారూపముననే తోఁచుననుట సిద్ధాంతము. ఏదోయొకస్మృతి లక్ష్యమును గుర్తించుకొన్న గాని బోధనము వీలుండదు గదా! లోకములో మనము రాముఁడను నొకవ్యక్తితో నత్యంతసంబంధ మేర్పరుచుకొన్నప్పు డా పదార్థము మఱుగుపడియున్నను పదార్థాంతరమును జూచి ధ్యానబలమున నదే వ్యక్తియని గోచరింపఁజేసికొన్నట్లే కర్మతంత్రములనుండి యనుగమించుచున్న ప్రణవమునే బ్రహ్మోపాసనాకాలమున వినబడునాదముగా గోచరింపఁజేసికొన్నామని యనుభవమునుబట్టి గ్రహింపగలము. శ్రీ బ్రహ్మసూత్రకారులు 'తస్యవాచకః ప్రణవః' అని పరమాత్మ దీనికి వాచ్యమనియు వానికి వాచకము ఓంకారమనియు వాకొని యున్నారు. కనుక ప్రణవ పరమాత్మలకు వాచ్య వాచక సంబంధమున్నటుల స్పష్టపడుచున్నదే కాని ఐక్యము దురవగాహము "వాగర్థావివసంప్రుక్తౌ" యన్నట్లు వాచ్యవాచకముల కభేదము చెప్పుట యాలంకారికము గాని, యనుభవపరము గాదు. అభ్యాసకునికి వినఁబడిన ధ్వని "యాదృశీభావనా యత్ర సిద్ధిర్భవతి తాదృశీ" (ఎట్లు తలఁచునో అటులనే సిద్ధియగును) అను న్యాయమున ఓంకారపరిచితుఁడగు యోగికి వినబడిన నాద మోంకారముగనే తోఁచును. అంతమాత్రమున దానినే పరమావధిగా తలచి జ్ఞానవిజ్ఞాన ప్రాప్యమగు మోక్షమొందినవానివలె దృప్తుడగుట అజ్ఞానవిలసితము. కనుక ప్రణవ మనునదియొక అక్షర తత్త్వము. 'ఆత్మబ్రహ్మ' ఇత్యాది సంకేతముల కంటె కొన్ని యంశములను సుగమము గావించుచున్నది గాన ఉపాసకలక్ష్యమున ఫలకారి ఓంకారమే.

# గ్రుడ్డివారి గ్రంథాలయములు

(గ్రంథాలయ సేవకుడు)

పై శీర్షిక యొక వింతగా తోచవచ్చును. గ్రుడ్డివారలకు గ్రంథాలయములా? యని. కాని మనకు ఆశ్చర్యముగ తోచునది ఇంగ్లండు అమెరికా దేశములలో కార్యరూపము దాల్చినది. అనేకులు అంధులు మేలు పొందుచున్నారు. ఇచ్చటనో కళ్లతోపాటు అన్ని అవయవములుండియు కోట్లకొలదిగ నిరక్షరకుక్షులై తమజీవితమును నిరర్థకముగ గడుపుచున్నారు.

ఇంగ్లండులో, నేషనల్ లైబ్రరీవారు అంధులకై ఎత్తుపల్లములుగల పుస్తకరూపమున సలుపుచున్న సేవ ఎంతయు ప్రశంసనీయము. ఈసంస్థ 1882 వ సంవత్సరమున స్థాపింపబడినది. ఆ గ్రంథాలయాధికారుల నిరంతరకృషివలన గ్రుడ్డివారల కుపయోగపడుపుస్తకములయుత్పత్తి అధికముగ సాగుచున్నది. 25 సంవత్సరముల క్రిందట 1 ,000 పుస్తకములసంఖ్య నుండి క్రిందటి సంవత్సరమునకు 1,85,000 అంధుల పుస్తకములు వృద్ధినందినవి. ఈ పుస్తకములలో అక్షరములు ఎత్తుగనుండును. వీటిని చేతితో తడుముటద్వారా నేత్రాభావుడు చదువగల్గును. ఈఅక్షరములు రెండువిధములు 1. బ్రైలీఅక్షరములు 2. మూన్ అక్షరములు. బ్రైలీఅక్షరములపుస్తకము సాధారణపు గ్రుడ్డిచదువరులకు పనికి వచ్చును. మూన్ అక్షరములు పైరకముకన్న పెద్దవి. పై వానిని గ్రహింపలేనివారల కుపయోగపడును.

ఇంగ్లండులో 11,000 గ్రుడ్డిచదువరు లున్నారు. వారిలో 8,000 మంది పోస్టుద్వారా పుస్తకములు తెప్పించుకొనెదరు. పుస్తకముంచుకొను గడువు సాధారణముగా నొకనెల. ఎన్నిపుస్తకములు కావలసినను తెప్పించుకొనవచ్చును. నేషనల్ లైబ్రరీ, గ్రుడ్డివారల పుస్తకములకొరకై 1935 వ సంవత్సరమున 24,000 సవరనులు ఖర్చుపెట్టినది. మరియు 3,14,243 పుస్తకములను ఎరువిచ్చినది. అదే సంవత్సరమున బ్రైలీఅక్షరములు

ములు వృత్పత్తిచేయబడినవి. ఎక్కువ మంచి పుస్తకములైతేనేకాని అంధులకొరకై తయారుచేయబడువానిలో జేర్పరు.

గ్రుడ్డివారలు స్పర్శజ్ఞానముచేతనే - అక్షరములు తడుముట వలన- వాటిని గుర్తించగలుగుదురు. ఈపద్ధతి అంత సులభముగ కన్పడుట లేదనియెంచి అమెరికాలో గ్రామఫోనువంటి "గ్రంథఫోను" అను ఒకయంత్రమును నిర్మించినారు. ఇది గ్రామఫోను వలెనే యుండును. కాని దీనికి రెండు తిరుగునట్టి గుండ్రనిబల్ల లమరియుండును. (శబ్దము ఫిలింమీద రికార్డు చేయబడును.) పైబల్లలమీదనుంచి అడ్డముగ ఫిలిం, ఫొటో ఎలెక్ట్రిక్ సెల్ (విద్యుచ్ఛక్తివలన, వెలుతురునుశబ్దముగమార్చుసాధనము) వద్దకుపోవును. ఫొటో ఎలెక్ట్రిక్ సెల్ వలన శబ్దము ఉత్పన్నమై గ్రంథఫోను నందున్న యంత్రము వలన స్పష్టీకరింపబడును. స్పర్శకుబదులు శ్రవణముద్వారా జ్ఞానసంపాదన జరిగిపోవును. అమెరికన్ లైబ్రరీ కాంగ్రెసుయొక్క 1935 వ సం॥పుసమావేశమందు గ్రుడ్డివారలకు వాషింగ్టన్నందుఏర్పరచిన అమెరికన్ ఫౌండేషన్ సంఘమువారు యంత్రములను తయారుచేయుటకు ఈక్రింది బడ్జెటును ఆమోదింపజేసిరి. మాట్లాడు పుస్తక రికార్డులను తయారుచేయుటకు 75,000 డాలర్లను, 5,000 యంత్రములను తయారుచేయుటకు 2,11,500 డాలర్లను గ్రాంటు చేయబడినవి. ఈ సంఘము యొక్క పారిశ్రామికాలయమందే రికార్డుచేయుటకు ఏర్పాట్లు గావింపబడినవి.

ఒక నవలను, 500 అడుగుల ఫిలింమీద రికార్డుచేయవచ్చును. మెషీనుమీద, విరామములేకుండ ఫిలిను త్రిప్పుచు నవలనంతను ఒకేమారు చదివించుటకు వీలగును. అమెరికన్ లైబ్రరీ కాంగ్రెసువారు తయారుచేయించు రికార్డులు, మెషినులు, అమెరికా సంయుక్తరాష్ట్రములం

# గ్రంథాలయ సేవ - గుంటూరు జిల్లా

కస్తూరి కుటుంబరావుగారి పని

గుంటూరుమండల గ్రంథాలయ సంఘమునకు ఉపాధ్యక్షులైన శ్రీ కస్తూరి కుటుంబరావుగారు 1935 వ సంవత్సరమున తాము గ్రంథాలయముల పక్షమున చేసిన సేవను గురించి దినచర్య ఈ క్రింద వ్రాసిరి. ఏమాత్రము సేవయైనను ఒక్కొక్కరు జరుపునెడల ఉద్యమము అంతవరకును పురోభివృద్ధి నందగలదు. ఎవ్వరు కావించిన సేవాకార్య వివరము, వారు వ్రాసి పంపి ప్రకటనకు తోడ్పడినయెడల ఇతరులకు మార్గము చూపినట్లగును. సం॥

28-4-1935

శ్రీ కృష్ణ మోహన గ్రంథాలయము నాజరపేట, తెనాలి.

ఈ దినము, యీ నిలయమునుచూచితిని గ్రంథాలయ పరిస్థితులను తెలిసికొనిన తరువాత, వార్షికోత్సవము జరుపుటకు ప్రోత్సాహపరిచితిమి.

5 వ తేదీ మే :—

నేడు పైగ్రంథాలయ వార్షికోత్సవము జరిగినదియీవార్షికోత్సవమునందు పాల్గొంటిని, గ్రంథాలయ ప్రదర్శనమును జరిపితిని. సభయందు గ్రంథాలయోద్యమ ప్రాశస్త్యమును గురించి ఉపన్యసించితిని.

6 తేదీ మే :-

మ్యునిసిపల్ లైబ్రరీ, తెనాలి

ఈ గ్రంథాలయమును చూచి, భాండాగారిని కలసి, గ్రంథాలయ పరిస్థితులను గురించి తెలిసికొంటిని, యీ నిలయమున ప్రదర్శనము జరిపించుటను గురించి మాట్లాడితిని. మ్యునిసిపల్ మేనేజరుతోను, కమిషనర్‌తోను మాట్లాడితిని. ప్రదర్శనమును, గ్రంథాలయోద్యమ ఉపన్యాసములను జరిపించుటకును అంగీకరించిరి. పట్టణములో నివాసులైయుండి, మ్యునిసిపాలిటీకి పన్ను చెల్లించు వారందరికి ఉచితముగ, గ్రంథాలయమును నుండి పుస్తకములను పొందు ఏర్పాటు చేయించవలసినదని, సలహా యిచ్చితిని.

28 ఆగస్టు:—

వినయాశ్రమ గ్రంథాలయం, కల్యాణకొప్పూరు.

గ్రంథముల సంఖ్య 400 పత్రికలు

రిజిష్టరులు వగైరా యిపుడే తయారు చేయుచున్నారు దేశభక్తులగు గొల్లపూడి సీతారామశాస్త్రిగారి ప్రోత్సాహముతో నడపబడుచున్నది.

రిజిష్టర్లు ఉంచవలసిన పద్ధతిని చెప్పితిని. సర్వజనులకు పుస్తకములను యింటికి యిచ్చుయేర్పాటు చేయవలసినదని చెప్పితిని

28 ఆగస్టు:-

భారత సేవక మండలి, కొప్పూరు.

నూతన పద్ధతుల మీద గ్రంథాలయమును నడపుటకు ప్రోత్సాహపరచడమైనది. కార్యనిర్వాహకుల తోడను, జాతీయపాఠశాల ఉపాధ్యాయులు, నేతిశివయ్యగారి తోడను యీ గ్రంథాలయాభివృద్ధిని గురించిమాట్లాడితిని. విజ్ఞానసర్వస్వసంపుటములను తెప్పించదలచినట్లును, యికముందు, ప్రోత్సాహకరముగ గ్రంథాలయమును నడపుదమనియు, నిర్వాహకులకు చెప్పిరి.

28 ఆగస్టు :-

పాఠశాల గ్రంథాలయము, చెరుకుపల్లి.

ఈ గ్రంథాలయమందు 250 గ్రంథములు గలవు, పత్రికలు, ఆంధ్రదైనిక, కృష్ణాపత్రిక తెప్పించవలసినదిగా చెప్పితిని, పాఠశాలలోని ఉపాధ్యాయులు, బాలురును గ్రంథాలయమును ఉపయోగించుచున్నారు. సర్వజనోపయోగముగ గ్రంథాలయమును ఉంచవలసినదిగా చెప్పితిని. గ్రంథాలయము అభివృద్ధిలోనికి తెచ్చుటకు వలయు సహాలనిచ్చితిని. రిజష్టర్లు ఉంపవలసిన విధానమును తెలిపితిని.

28 ఆగష్టు:— శ్రీసరస్వతీగ్రంథాలయము పొన్నపల్లి, ఈ నిలయమున 300 గ్రంథములుగలవు. రిజష్టరులు ఉంచబడుచున్నవి. ఆంధ్రపత్రికను తెప్పించి ఉపయోగించుచున్నారు. ఇంకను పత్రికల తెప్పించ వలసినదిగానున్ను గ్రంథములను అభివృద్ధి చేయవలెననియు చెప్పితిని. గ్రామస్థులందరును ఐకమత్యముగాయుండి గ్రంథాలయమునకు ఆర్థికమున తోడ్పడవలెననియు, గ్రంథాలయము పైపునకు ప్రజల నాకర్షించుటకుగాను, సభలు జరిపి ఉపన్యాసము లిప్పించుట అవసరమని చెప్పితిని.

28 ఆగష్టు:— తిలక గ్రంథాలయము, నడింపల్లి

గ్రంథములు 700 ఆంధ్ర, ప్రజామిత్ర, పత్రికలు.

కొలదిమందికి మాత్రమే ఉపయోగ పడుచున్నది. గ్రామప్రజలు అందరు గ్రంథాలయమును ఉపయోగించుటకుగాను, బహిరంగసభలు వార్షికోత్సవములు జరుపవలసినదిగా ప్రోత్సాహము నిచ్చితిమి.

28 ఆగష్టు: నెహ్రూ గ్రంథాలయము, గూడవల్లి.

గ్రంథములు 250; పత్రికలు, ఆంధ్రదైనిక, ప్రజామిత్ర కృష్ణ. రిజష్టర్లు ఉంచబడుచున్నవి.

పుస్తకములను, పత్రికలను వాడుచున్నారు. గ్రామస్థులు ధనసహాయము బాగుగా చేయుచున్నారు. కాని పుస్తకములు అభివృద్ధిచేయవలెను. వార్షికోత్సవములు, బహిరంగసభలు చేయుచుండవలెననియు, ప్రజలను బాగుగా ఆకర్షించవలెననియు చెప్పితిని.

20 అక్టోబరు:- 10 వ గుంటూరు మండలగ్రంథాలయ మహాసభ' రేపల్లె.

ఈ మహాసభా సందర్భమున గ్రంథాలయప్రదర్శనమును జరిపితిని. గ్రంథాలయోద్యమమును గురించి, యువకుల కర్తవ్యమునుగురించి ఉపన్యసించితిని.

20 డిశంబరు:- శ్రీవాణీనికేతనం. నిజాంపట్నం

గ్రంథములసంఖ్య 1219, పత్రికలు, ఆంధ్ర, కృష్ణా, భీమాప్రచారిణి, గ్రంథాలయసర్వస్వము.

1935 సంవత్సర ప్రారంభమునుండి డిశంబరు 20 తేదీ వరకు చదువబడిన గ్రంథములు 393. వేతనముమీద భాండాగారి కలడు. ఇన్నిగ్రంథములున్న గ్రంథాలయమున 393 గ్రంథములు మాత్రము చదువబడుట చాలవిచారము. ఉచితముగ ఎల్లరకు పుస్తకములనిచ్చి చదివించవలెననియు వార్షికోత్సవములు ఉపన్యాసములు జరుపవలెననియు, సలహాల నివ్వడమైనది గ్రంథాలయ అభివృద్ధిని తెలియజేయు స్టేటుమెంటులను వ్రాసియిచ్చితిని. రిజష్టరులను క్రొత్తపద్ధతులపై ఉండవలెనని చెప్పితిని.

24 డిశంబరు: పమిడిమర్రు గ్రామవాసియగు గొప్పాడి కోటయ్య చౌదరిగారువచ్చి నేడు నాతో మాట్లాడివెళ్ళిరి. వారి గ్రామమున గ్రంథాలయమును స్థాపనచేయ దలచినట్లును, అందులకుగాను, గ్రంథాలయోద్యమమును గురించి ప్రజకు ఉపన్యసించి సహాయము చేయవలసినదిగా కోరిరి. వారెప్పుడు, వర్తమానముచేసిన అప్పుడువచ్చి సహాయము చేయుటకు సిద్ధముగాయుంటినని చెప్పిపంపితిని.

ఇతర కంపెనీల రికార్డుల కన్న ఎక్కువకాలము వాయించును.

# బ్రాడ్ కాస్టు రికార్డులు

సుప్రసిద్ధగాయకులను సుశబ్దముతో వినుడు.

Broadcast

సుభద్ర
పార్వతీబాయి
శ్రీహరి
శ్రీదేవి
తాయమ్మాళ్
కొచ్చమ్మాళ్
సుబ్బలక్ష్మి
సుందరకామాక్షి
దేవనాయకి
సూరిబాబు
మాష్టర్ కల్యాణి

సుబ్రహ్మణ్యంపిళ్ళె
చొక్కలింగ
భాగవతార్,
చెంబైవైద్యనాథ
అయ్యర్,
మూర్తిరాజు
భాగవతార్
జందాకనకలింగేశ్వర
రావు
రామచంద్రారెడ్డి
అద్దంకిశ్రీరామమూర్తి
స్వామిభాగవతార్

ఆంధ్ర ఫోనుహౌసు
ఆంధ్రగ్రంథాలయ ప్రెస్ బిల్డింగులు, బెజవాడ.

# అన్న వస్త్ర వైద్య విద్యాదాన సమాజము, ఏలూరు.

( స్థాపితము 1913 సం॥ )

## 1935 సం॥నకు బ్యాలన్సుషీటు

# శాశ్వత నిధులు

### జమలు

| | |
|---|---|
| 42722- 2-0 | శాశ్వతనిధిధర్మములు |
| 4402- 2-0 | బిల్డింగు ధర్మం |
| 5511-11-7 | నికరాదాయము (1913 లగాయతు) 1935 సం॥ తాలూకు రు 937-4-7లు సహా |
| 1379-15-3 | లోకులకిన్వవలసినది |
| 362-12-7 | శాశ్వతధర్మముల తాలూకు వడ్డీనిల్వ |
| 354- 3-2 | అద్దెలతాలూకు డిపాజిట్సు |
| 64,732-14-7 | వెరశి |

### ఖర్చులు

| | |
|---|---|
| స్థిరాస్తులు - ఇళ్లు - కోట్లు | 12,221-10- 1 |
| సమాజం బిల్డింగు | 5,642-12- 3 |
| అద్దెలతాలూకు బాకీలు | 1948- 4- 3 |
| బాకీలు | 12089- 6-11 |
| చరాస్తి | 678- 5-0 |
| మిల్ షేర్లు | 530- 0-0 |

#### ధర్మకర్తల బాకీలు

| | |
|---|---|
| దండుబోయిన నర్సయ్యగారు | 559-14-11 |
| మోతే నారాయణరావు జ. గారు | 1359- 5- 7 |
| వుమ్మా లక్ష్మయ్యగారు డిక్రి | 874-13-10 |
| చీమకుర్తి మల్లిఖార్జునుడుగారు | 106- 0-10 |
| | 64,732-14- 7 |

### 1935 సం॥ ఆదాయము-వ్యయము

#### ఆదాయము

| | |
|---|---|
| 528- 5-6 | వడ్డీలు |
| 319- 8-0 | సంవత్సరచందాలు |
| 164- 2-6 | స్పెషల్ సంతర్పణలు |
| 12- 8-0 | బొగ్గుల అమ్మకం |
| 2326-13 0 | ఇండ్లఅద్దెలు |
| 4- 2-0 | ధర్మం బాపతు |
| 3355- 7-0 | వెరశి జమ |
| 2418- 2-5 | వెరశి ఖర్చు |
| 937- 4-7 | నికరఆదాయము |

#### వ్యయము

| | |
|---|---|
| జీతాలు | 443- 8-2 |
| పన్నులు | 274-12-8 |
| సాదరు | 242-12-0 |
| ప్రకటనలు | 53-2-8 |
| ప్రింటింగు | 63- 6 6 |
| చలివేంద్రలు | 19- 5-9 |
| ఇన్సూరెన్సు | 56- 0-0 |
| మరమ్మతులు | 45-14-4 |
| పోస్టేజీ | 0- 7-3 |
| కిరసనాయిలు | 10- 1-9 |
| సంతర్పణసామానులు వంటచెరుకు బియ్యంవగైరా | 1208-11-4 |
| వెరశి ఖర్చు | 2418- 2-5 |

ఈలెక్కలు గవర్నమెంటు సర్టిఫైడు ఆడిటరు కే. భీమేశ్వరరావుగారిచే ఆడిటు చేయబడి సరిగానున్నవని సర్టిఫై చేయబడినవి. ధర్మములకు రశీదులును, శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా పట్టాలును ఇయ్యబడును.

మోతేగంగరాజు జమిందారుగారు, (సోల్ట్రస్టి) పసుమర్తి పురుషోత్తముగారు, (ప్రెసిడెంటు)
కొత్తమాసు శీతారామయ్యగారు, (సోల్ట్రస్టి) కందుల రామయ్యగారు, (శెక్రిటరీ)
మద్దుల వెంకట చిన్నరాజుగారు, (వైస్ ప్రెసిడెంటు) నున్న గంగరాజుగారు, (వైస్ ప్రెసిడెంటు)

RSVM01 A155



# ఏలూరు గోసంరక్షణసమితి.

(స్థాపితము 1918 సం॥)

## 1935 సం॥నకు బ్యాలన్సుషీటు.

### —♦ జమలు ♦—

| | |
|---|---|
| 26246-8-3 | శాశ్వతనిధి ధర్మము |
| 9378-4-10 | నికరాదాయము (1913 లగాయతు) 1935 తాలూకు రు. 493-0-4 సహా |
| 2600-6-9 | గోశాల రేకుల సావిడిధర్మం |
| 36-10-8 | లోకులకివ్వవలసినది |
| 281-3-9 | వ్యాసరచన బహుమతులవడ్డీ, ఖర్చు పెట్టవలసినది |
| 38543-2-3 | వెరశి |

### —♦ ఖర్చులు ♦—

| | |
|---|---|
| సిరాస్తులు | 24800 11-11 |
| శాశ్వత ధర్మకర్తల బాకీలు | 5454- 8- 8 |
| స్వాధీనతనఖాలు | 2549- 1-10 |
| శాశ్వతసభ్యులియ్యవలసినది | 349- 8- 3 |
| అద్దె బాకీలు | 361- 8- 6 |
| ప్రాంసరీనోట్లు వగైరా బాకీలు | 4964- 3- 8 |
| బ్యాంకిలో | 19- 3-11 |
| నిల్వ | 44- 3- 6 |
| వెరశి | 38543-2-2 |

## (ఆదాయము. 1935 సం॥)

| జమ. రు. | |
|---|---|
| 1329-11-3 | అద్దెలు |
| 742-14-7 | ఇతరములు |
| 815- 6-6 | వడ్డీలు, ధాన్యం, పేడ |
| 2,888- 0-4 | వెరశి జమ |
| 2395- 0-0 | ఖర్చు |
| 493-0-4 | నిల్వ నికరాదాయము |

## (వ్యయము. 1935 సం॥)

| | |
|---|---|
| వరిగడ్డి ... ... | 479- 5-6 |
| తవుడు ... ... | 282-15-9 |
| పెసరసున్ని ... ... | 85-11-6 |
| పన్నులు ... ... | 125- 4-5 |
| జీతాలు ... ... | 741-11-4 |
| సాదరు (Audit fee etc.) ... ... | 332-13-0 |
| చనిపోయినగోవులు పాతిపెట్టుటకు ... | 135- 2-0 |
| ప్రింటింగు ... ... | 22-15-6 |
| ప్రకటనలు ... ... | 81- 2 0 |
| గోవువగైరా గ్రంథములకు ... ... | 22- 8-0 |
| హిందూయువజన సంఘమునకు బట్టలఅమ్మకధర్మంనుంచి ... ... | 35- 0-0 |
| జూబ్లీ ఫండుధర్మం ... ... | 43- 4-0 |
| పోస్టేజి ... ... | 7- 3-0 |
| ఖర్చు మొత్తం | 2395- 0-0 |

ఈ లెక్కలను గవర్నమెంటు సర్టిఫైడు ఆడిటరు కె. భీమేశ్వరరావుగారిచే ఆడిటు చేయబడి సరిగా నున్నవని సర్టిఫై చేయబడినది.

ధర్మములకు రశీదులను శాశ్వతనిధి ధర్మములకు రశీదులతోసహా పట్టాలను ఇవ్వబడును.

ఇతరవివరములకు:—రా॥ బ॥ మోతే గంగరాజు జమీందారుగారు, (ప్రెసిడెంటు)

మద్దుల వెంకట చినరాజుగారు, (వైస్ ప్రెసిడెంటు)

పోలిశెట్టి గోపాలస్వామిగారు, (శెక్రెటరీ)

Printed & Published by K. Lakshminarasayya at the Andhra Grandhalaya Press, Bezwada.

## మనసు ఫౌండేషన్

## పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | RSVMOIA 155 |
| పుస్తకం పేరు | గ్రంథాలయము, సర్వస్వము |
| తారీఖు | 7/6/24 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 51 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | ,11,30,31, |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | Hema |
| పేజీలు విడదీసినది | Hema |
| స్కాన్ చేసినది | Sandhya |
| పరీక్ష చేసినది | pragathi |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| స్కాన్ చెయ్యనివి | |
| తప్పులు | NO |
| పరిస్థితి | Good |